# తిరుక్కుఱళ్

(శ్రీ సూక్తులు)

<u>తమిళ తాత్పర్యమునకు</u>
<u>తెలుగు అనువాదము</u>

అనువాద కర్త

**క్రిష్ణ శెవ్వాన**

తెలుగు అనువాద పర్యవేక్షణ

**జగన్నాథరావు గుండాన**

# THIRUKKURAL IN TELUGU

First Edition : 2021 - 300 Copies

Translator : Krishna Sevvana

For Copies and Suggestions & Comments

Address : S.R. Krishna Rao
H-303, Aparna Cyber Commune,
Nallagandla, Hyderabad - 500019.
Mobile : 9704655002
E-mail : sevvanakrishna@yahoo.com

Price : Rs. 150/-

మాతా, పితలకు
హృదయ పూర్వక
పాదాభి వందనములు

# ఓం గం గణపతయేనమ:

## గురు స్తుతి

1. గురుర్బ్రహ్మ: గురుర్విష్ణు: గురుర్దేవో మహేశ్వర:
   గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమ:
2. అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
   చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమ:

## దైవ స్తుతి

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
ఎవ్వని యందుడిందు పరమేశ్వరుడెవ్వడు
మూల కారణం బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు
సర్వముతానయైన వాడెవ్వడు వాని నాత్మ
భవునీశ్వరు నేశరణంబు వేడెదన్!!

# అంకితము

అనువాదము చేయుటకు ఆజ్ఞ ఇచ్చి,
శిష్యునిపై తాబేలు వంటి దృష్టి సలిపి,
హిరణ్య గర్భమున పరబ్రహ్మను దర్శించిన
సాంఖ్యయోగి, మృదుభాషి, మితభాషి,
అన్ని ధర్మముల కన్న గృహస్థాశ్రమమే గొప్పదని
చాటి చెప్పి, తనూ అదే అనుసరించుచున్న

**పూజ్య శ్రీ శ్రీ శ్రీ నిత్యానంద్ గురువుగారికి,**

(కపిల కృష్ణ మఠము,
నెం. 1 కాట్టావూర్ నల్ల ముత్తువీది,
చూలై-చెన్నై-600112)

**హృదయ పూర్వక పాదాభి వందనములతో**

**సవినయ సమర్పణ**

# తొలి పలుకు

తిరుక్కుఱళ్ అను గ్రంథము తిరువళ్లువర్ అను మహాజ్ఞానిచే 2000 సం॥ పూర్వము తమిళ ప్రాచీన సంగకాలమున వ్రాయబడినదిగా చెప్పబడుచున్నది.

"తిరు"+"కుఱళ్" అను పదములకు, "తిరు" అనగా మర్యాద సూచనగా శ్రీ, శ్రీమతి అన్నట్లు. దైవత్వ, దివ్య అనుబంధము, పవిత్రము, అర్థములను సూచించును. ఉదాహరణములుగా: తిరు మాంగల్యము, తిరు వేంగడము, తిరు కళ్యాణము అను పదముల వాడుకలో కలవు.

ఇక కుఱల్ అను పదమునకు అర్థము నాగరిత పరిణామానుసారముగా మాటలు, భాష, సూక్తులుగా మనము అర్థము చేసుకొనవలెను.

దివ్యలేక దైవత్వముతో నిండిన మాటలు సూక్తులుగా "తిరుక్కుఱళ్"ను పరిగణించవచ్చును. శ్రీ సూక్తులుగా పిలువవచ్చును.

"కుఱళ్ వెన్‌బా" అను పద్యపద్ధతి, పద్యశైలి, రెండు పాదములతో కూడినది. మొదటి పాదములో నాలుగు పదములు, రెండవ పాదములో మూడు పదములు కలిగిన పద్య అమరిక. (ఆంగ్లమున "బాలెడ్"), (తెలుగున "ఆటవెలది").

10 పద్యములతో కూడినది ఒక విభాగము అగును. అటువంటి 133 విభాగములలో ఏర్పడిన ఈ 1330 పద్యములను మూడు పెద్ద అధ్యాయములుగా అనగా పురుషార్థములలోని మొదటి మూడు "ధర్మము", ''అర్థము'', ''కామము''లను ''అరం'', ''పొరుల్'', ''ఇన్‌బం''గా విభజించబడియున్నవి.

ఈ 1330 పద్యములలో:-

మొదటి 40 పద్యములు దైవము, వర్షము, ధర్మము గురించియు,
తదుపరి 200 పద్యములు గృహస్థ ధర్మము, సచ్ఛీలత గురించియు,
తదుపరి 140 పద్యములు దైవానుగ్రహము, విశేష ధర్మము గురించియు,
తదుపరి 250 పద్యములు రాచరికము, రాజ్యాంగము గురించియు,
తదుపరి 100 పద్యములు మంత్రిత్వము, మంత్రి ధర్మము గురించియు,
తదుపరి 220 పద్యములు పరిపాలనా వ్యవస్థ గురించియు,
తదుపరి 130 పద్యములు శీలము, దాని ప్రభావిత మంచి, చెడుల గురించియు,

తదుపరి 250 పద్యములు ప్రేమ, శృంగారము గురించియు విశదీకరించబడియున్నవి.

తిరుక్కుఱళ్ వ్రాసిన మూల గ్రంధకర్త తిరువళ్లువర్ ఒక మహాఋషి, మహా సిద్ధుడు, మహా రసవాది, గృహస్థ ధర్మమెరిగిన మహాయోగి.

2000 సం॥ల పూర్వము వ్రాయబడిననూ, ఇప్పటికీ గొప్ప, గొప్ప పండితులు ఎన్నో కొత్తకొత్త అర్ధములను వెలికితీయుచున్నారు. ప్రస్తుత ఆచార వ్యవహారములకు కూడ సరిపోవు తగిన గ్రంధముగా కొనియాడబడు చున్నది. ముఖ్యముగా తమిళ గురువులు, యోగులు ఈ గ్రంధములోని కొన్ని పద్యములను రసవాదముతో పోల్చియున్నారు.

ఉదా: కఱ్క, కసడర, కఱ్రవై, కఱ్రిపిన్, నిర్క, అదర్కు, తగ

అర్ధము: నేర్చుకో, తప్పులు తడకలు లేక, నేర్వదగినన్నింటిని, నేర్చిన పిదప, నిలబడు వాటికి తగినట్లుగా.

మరొక అర్ధము: నేర్చుకో, కసడు + అర (సంది) = మలినము పోగొట్టుటకు, నేర్చుకోదగినన్నింటిని, నేర్చిన పిదప, దాని ప్రమాణమునకు నిలబడవలె, వాటికి, తగినట్లుగా.

విశదీకరణ: మలినములను పోగొట్టుట అనునది ఒక గూఢార్ధము. లోహములలోని కిలుమును వేరు చేసి లోహమును పరిశుద్ధము చేయుట. మరొక అర్ధము – ఈ శరీరములోని మలినములగు షడ్డరిష్టములు పోగొట్టుకొని పరమార్ధమును తెలుసుకొనుటకుగాను అర్హత, ప్రమాణములకు తగ్గట్లు మనల్ని మనమే ఉద్ధరించుకొనవలెననునది.

ఇటువంటివి చాలా ఉండుటచే, తిరువళ్లువర్ ఒక మహా సిద్ధుడనియూ, అచ్చటి తమిళ మహనీయులచే వేయినోళ్ల కొనియాడబడియున్నారు.

పురుషార్ధములలోని మొదటి మూడైన "ధర్మము", "అర్ధము", "కామము" లేక శృంగారములను బోధించిన ఈ గ్రంధము నాలుగవదైన "మోక్షము" గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఏలననగా ధర్మార్ధ కామములను ఈ మూడింటిని సన్మార్గముతో ఆచరించినచో "మోక్షము" తనంతట తానే ప్రాప్తించునని చెప్పు గ్రంధమిది. అందులోని కొన్ని ముఖ్య సందేశము యీ దిగువనుదహరించబడినవి.

"అధర్మ పనులు చేయువానికి పుణ్యము దక్కదు".

"సన్మార్గమున సంపాదించని డబ్బు పుణ్య కార్యములకు పనికిరాదు".

"మాట ఒకటి చేత, నడత వేరైనచో పాపమే దక్కును".

"పరులను ద్వేషించువానికి వారి మనస్సు నొప్పించువానికి శాంతి దొరకదు".

"అసత్యములు పలుకువాని వద్ద శ్రీలక్ష్మి నిలువదు".

"అంతరంగిక పరిశుభ్రత లేనిదే పరమాత్మ మనల్ని గుర్తించడు".

"దైవమునకు నైవేద్యము పెట్టుట కంటే ఇంటిముందు నిలబడిన యాచకునకు, సన్యాసులకు భోజనము పెట్టుట పుణ్యము"

"యజ్ఞయాగాదుల కంటే తోటి మానవులకు సహాయము, సేవ చేయుట పరమార్థము, మహా పుణ్యము. ఈ ఆనందమే పరమానందము".

"లక్కతో చేసినదైనను, కర్రతో చెక్కినదైననూ, రాతితో మలచినదైనను దైవ విగ్రహము కొంత కాలమునకు కరిగి, విరిగి, అరిగిపోవలసినదే. ఇవేవియూ పరమాత్ముని నిజస్వరూపములు కావు".

"నిస్స్వార్థ, నిశ్చల, నిష్కళంక, నిర్మలమైన మనస్సే దైవత్వము".

ఇట్లు తిరువళ్లువర్ చెప్పక చెప్పియున్నారు.

దైవ అనుభూతిని భక్తుడు అనుభవించగలడేగాని తన కంటితో చూడజాలడు.

దైవమునకు ఏ పేరు, రూపము లేదు.

నిశ్చలమైన, అనన్య భక్తి కలిగినవాడు పరమార్థతత్వముతో అనగా దైవముతో అనుబంధము ఏర్పరచుకొనును.

దైవమును గుణముతోగాని, రూపముతోగాని వర్ణించి చెప్పలేము. కాబట్టే దైవత్వము అనునది జ్ఞానము, బలము, ఐశ్వర్యము, సత్ప్రవర్తన, సౌందర్యము, వైరాగ్యముల కూర్పు అని చెప్పబడియున్నది.

ఈ జగత్తులో ఉత్పన్నమైన అన్నియూ ప్రకృతిలో లీనము కావలసినదే. అవ్యక్తమైన ఆ పరమ పురుషుడు అవినాశి. అతడు సనాతనుడు. అనన్యమైన, పరిశుద్ధ భక్తి, ప్రేమలకే లభ్యమగువాడు. అటువంటి ప్రేమ, భక్తి, నిస్స్వార్థత, ధర్మముతో కూడిన నిష్ఠాపరులకే సాధ్యమగును. అందులకే ఈ గ్రంథము సదాధర్మము, ధర్మప్రవర్తన, ధర్మచింతన, ధర్మభావనను బోధించుచున్నది. ధర్మముతోనే మోక్షము, దైవత్వము ప్రాప్తించునని నొక్కి చెప్పుచున్నది.

సుఖ, శాంతులతో కూడిన జీవితమే మానవుని ధ్యేయము. దానికి ఆధారము ధర్మబద్ధమైన సంపాదన, (ఆదాయము). దీనికి ఆధారము ధర్మబద్ధతతో కూడిన జీవితము, సత్ప్రవర్తన. ఇవే సుఖమునకు, శాంతికి దారి. ధర్మబద్ధమైన శృంగారముతో గృహస్థ జీవితము, మనసా, వాచా, కర్మణా కొనసాగించి, పరులకు దానము, సహాయము, సేవ చేస్తూ జీవించుటయే ఈ గ్రంథము యొక్క ముఖ్య ఉద్దేశము.

అన్ని కాలములకు తగిన గ్రంథమిది. అనుసరణీయమైనది. నీతికి, ధర్మమునకు వ్యవస్థను కల్పించు గ్రంథమిది. 2000 సం॥ పూర్వము రచించబడినదయిననూ, ఇప్పటికీ అనుసరింపదగినదిగా, తమిళ "వేదముగా", "దైవనూల్" (దైవ గ్రంథముగా) కొనియాడబడి దాదాపు 80 ప్రపంచ భాషలలోనికి అనువదింపబడి ప్రపంచములోకెల్లా మూడవ గొప్ప అనువాద గ్రంథముగా ప్రసిద్ధికెక్కినది.

ఇంతటి గ్రంథమును తమిళ పద్యశైలికి తగ్గట్లు యథాతథముగా తెలుగున తాత్పర్య అనువాదముచేసి, తెలుగు చదువగల సామాన్య పాఠకులకు సులభముగా అర్థమగునట్లు, వీలైనంతవరకు సంస్కృత పదములను విడనాడి, వారికి అందుబాటులోనికి తెచ్చి, చదివింపజేసి, వారిచే అనుసరింపజేయవలెనను, సదుద్దేశముతో సమర్పించబడినదని సవినయముతో తెలుపుచున్నాము.

ఏవైనా తప్పులున్నచో వాటికి ఈ అనువాదకర్తయే కారణముకాని మూలగ్రంథకర్త (తిరువళ్లువర్) కారని సవినయముతో తెలుపుతూ, తప్పులను మన్నింపగోరి, చేర్పులు, మార్పులను పున:ప్రచురణలో చేసెదమని తెలుపుచున్నాము.

**దేవుడు మానవునకు బోధించినది గీత (భగవద్గీత).**
**మానవుడు దేవునికి బోధించినది తిరువాచగం***
**మానవుడు మానవునికి బోధించినది తిరుక్కుఱళ్.**

*శ్రీ మాణిక్యవాచగర్ అను గొప్ప శివభక్తుని శైవకీర్తనలు – తిరువాచగం. దీని తెలుగు అనువాదమునకు మీ ఆశీస్సులతో ప్రయత్నించెదము.

ఇట్లు
**క్రిష్ణ శెవ్వాన**
**(ఎస్.ఆర్.క్రిష్ణారావు)**

# తిరువళ్లువర్ వారి సంగ్రహ జీవిత చరిత్ర

తిరుక్కుఱళ్ గ్రంధకర్త తిరువళ్లువర్ క్రీస్తు పూర్వము రెండవ శతాబ్ధము నుండి క్రీస్తు శకము 8వ శతాబ్దము మధ్య కాలమున తమిళ భాషా "సంగ కాలము"నకు చెందిన వారుగా చెప్పబడినది. వీరు మద్రాసులోని మైలాపూర్‌లో నివసించినట్లు చెప్పబడినది. వీరు వ్రాసిన గ్రంధ భాష యొక్క ప్రాచీనత బట్టి వీరి కాలము గణించబడినదే కాని ఎటువంటి శిలాశాసనము బట్టి కాని, పురాతన వస్తు పరిశోధనలు బట్టిగాని తెలియలేదు. వీరికి "నాయనార్", "దేవర్", "ముదర్‌పావలర్", "దైవపులవర్" (దైవకవి) "నాన్‌ముగర్" (బ్రహ్మ), "మాతాను బంగి", "సేనా పోత్తర్", "పెరు నావలర్" (పెద్దకవి) "వెట్టియాన్" (శ్మశాన కాపరి), "అయ్యన్" (కులపెద్ద) అనియూ మారుపేర్లు గలవు. వీరు వృత్తి పరముగా పద్మశాలియనియు, వీరి తండ్రి పేరు భగవానుడు, తల్లి పేరు ఆది అని తెలియుచున్నది. తిరువళ్లువర్ "తిరువళ్లువర్‌మాలై" అను మరొక గ్రంధమును కూడ రచించిరి. వీరు వ్రాసిన తిరుక్కుఱళ్ గ్రంధము వేద సమానమైనదిగా ప్రసిద్ధికెక్కినది.

తన గ్రంధమును మదురై పాండ్యరాజునకు సమర్పించుటకు మదురైకు వెళ్లి అచ్చట చాలా ఇక్కట్లు పడినట్లు చెప్పబడియున్నది. తుదకు యీ గ్రంధము అవ్వైయార్ అను ఒక తమిళ కవయిత్రి అయిన శివసన్యాసిని సహాయమున మదురై రాజసభ పండితుల మధ్య ఉంచబడినది. అప్పటి భాషా పండితులకు ఒక సంప్రదాయము ఉండెడిది. అది ఏమనగా మదురై మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరుని దేవాలయములో దైవ సన్నిధి ముందున్న "పొత్రామరై కుళం"లో (బంగారు తామరల కొలనులో) తామరాకులపై కవులు వ్రాసిన గ్రంధములను ఉంచి పరీక్షించెదరు. గ్రంధము యొక్క విశేషత ఔన్నత్యము బట్టి అవి నీటిలో మునగక తేలియాడినచో అది గొప్ప గ్రంధమని తీర్మానించెదరు. అట్లే తిరువళ్లువర్ వ్రాసిన తిరుక్కుఱళ్ గ్రంధము తాళ పత్రముల (తాటి ఆకుల) కట్టలు శోధింపబడి వారి పరీక్షకు నెగ్గి, అక్కడి పండితులందరి ప్రశంసలు పొందినదని చెప్పబడుచున్నది.

ఈ తిరుక్కుఱళ్ గ్రంథమునకు 'ముప్పాల్‌నూళ్', (పురుషార్ధములలోని మొదటి మూడు–ధర్మ, అర్ధ, కామములు కలిగిన గ్రంథమనియు), 'ఉత్తరవేదం', 'దైవనూళ్' (దైవ గ్రంథము), 'పొయ్యామొళి' (అసత్యముకాని మాటలు), 'వాయురైవాయుత్తు' (జీవితము యొక్క గొప్పదనము చెప్పునది), 'తమిళ్‌మరై' (తమిళవేదం) 'పొదుమరై' (సమవేదం), అనియు మారు పేర్లు గలవు.

తిరువళ్లువర్ బ్రహ్మ అవతారమనియు చెప్పబడియున్నది. ఇతను సహజ సన్యాసి, వేదాంతి, మహా సిద్ధుడు, రసవాది అని చెప్పబడియున్నది. ఇతని భార్యామణి వాసుకి మహాపతివ్రత,శీలవతి, భర్తకి తోడు నీడగా వుండి పతిసేవయే పరమార్ధమని జీవించిన వనిత. ఈమె పాతివ్రత్యమునకు చాలా నిదర్శనములు, ఋజువులున్నాయి.

తిరుమలపై జీవ సమాధి అయిన శ్రీ కొంకణ మహాముని వీరికి సమకాలికులుగా చెప్పబడియున్నది. ఒకప్పుడు శ్రీ కొంకణి మహాముని భిక్షాటనము చేసుకొనుచూ వీరింటి ముందు ఆగి "భిక్షాందేహి" అని ఎలుగెత్తి పిలచి నిలుచున్నారు. చాలా సమయమైనది, ఎంతకీ ఆ ఇంటి ఇల్లాలు వాసుకి బయటికి రాకుండా లోపల భర్తకు సేవచేయుచూ ఉండిపోయినది. ఇది ఆగ్రహించిన శ్రీ కొంకణ ముని ఆగ్రహముతో ఊగిపోయెను. ఇల్లాలు వాసుకి భర్త సేవ ముగించుకొని భిక్షము చేత పట్టుకొని బయటికి వచ్చెను. శ్రీ కొంకణ ముని ఆమెను చూచి ఆగ్రహము తెచ్చుకొని తీక్షణముగా ఆమె వైపు చూచెను. ఆమె అదేమీ పట్టించుకోకుండా భిక్షమును అతని పాత్రలో వేసి "కొంగ అనుకొన్నరా ఏమి?" అని అడిగి లోపలికి వెళ్లిపోయెను.

వెంటనే శ్రీ కొంకణ మహాముని తేరుకొని, తను అడవిలో తపస్సులోనున్నపుడు చెట్టు మీద కూర్చున్న కొంగ ఒకటి తన తలపై రెట్టవేయడము, తను వెంటనే ఆగ్రహించి కొంగ వైపు చూడడము, కొంగ వెంటనే తన తపోమహిమ వలన భస్మము కావడము ఇవి అన్నియు ఈ కుగ్రామములోనున్న ఈ ఇల్లాలికి ఏలా తెలిసినదని, ఆశ్చర్యపోయి, ఆలోచించి, సిగ్గుపడి, మారుమాటడక అటునుంచి వెళ్లిపోయెను. ఇది ఆ ఇల్లాలి యొక్క పాతివ్రత్య ధర్మమును తెలియజేయు అంశమగును.

తిరువళ్లువరు, వాసుకి అన్యోన్య దాంపత్యముతో, సంసారమును, సాధుజన సేవలో గడిపిరి. అడవులకేగి సన్యసించుట కంటే గృహస్థాశ్రమమే గొప్పదని చాటిచెప్పి తామూ అట్లే సహృదయముతో గృహస్థాశ్రమందే అన్ని ధర్మములను పాటించిరి. పవిత్రతకు, అన్యోన్యతకు, సేవకు మారుపేరుగా యుండిరి.

ఒకప్పుడు తిరువళ్లువరు తన శిష్యులతోనున్నపుడు, ఒక శిష్యుడు అతనిని గృహస్థాశ్రమము గొప్పదా? సన్యాసము గొప్పదా? అని అడిగెను. అందులకు తిరువళ్లువరు ఏమీ జవాబు చెప్పక, తనకు ఉదయమున వడ్డించిన చద్ది అన్నము తింటూ "వాసుకీ! చద్ది చాలా వేడిగాయున్నది విసనకర్రతో చల్లార్చుము" అనెను. బావినుండి నీరు చేదుతున్న వాసుకి అది వినిన వెంటనే అట్లే తాడును, బిందెను వదలివేసి అన్నము చల్లార్చుటకు విసనకర్రతో వచ్చి వేసినది. తను పెట్టినది చద్ది అన్నమే కదా! చల్లార్చుటకే ముందని తను తన భర్తను ప్రశ్నించలేదు. బావిలోని తాడు, బిందే ఆలాగునే మధ్యలోనే నిలబడిపోయినవి. భర్తకు విసురుతూ ఆయన సేవలో నిమగ్నురాలైపోయినది. శిష్యులు బావి మధ్యలో నిలబడిపోయిన ఆ తాడు, బిందెను చూచి ఆశ్చర్యచకితులైరి. భర్త మాటకు అంతటి ఔన్నత్యము, అన్యోన్యత, పతివ్రతా ధర్మమును చాటి చెప్పు ఇదొక అంశము.

మధ్యాహ్నమైనది, తిరువళ్లువరు భార్య వాసుకిని పిలిచి బట్టలు కుట్టుటకు సూది, దారము, దీపము తెమ్మనెను. సూది, దారము సరే! మిట్ట మధ్యాహ్నము కదా! పగటి వెలుతురు ఉండగా దీపము ఎందులకు? అని ఆమె ఎదురు ప్రశ్న వేయలేదు. అట్లే దీపముతోపాటు అన్నింటిని తెచ్చియిచ్చెను. అంతటి అణకువ, మర్యాద, భర్త మాట, అతనికి సేవచేయుటయే ఆమెకు ముఖ్యము. అంతటి పాతివ్రత్యధర్మము. ఇటువంటి ఎదురుచెప్పని సహృదయముగల స్త్రీలు భర్త హృదయమునందే ఉందురు. వీరి అన్యోన్యతకు సాటి ఏదియూ లేదు. గృహస్థాశ్రమునకు మూలమే ఇటువంటి సహృదయము, కల్మషము లేని భక్తి, భావన. ప్రశ్నలు వేసిన ఆ శిష్యుడు ఏమీ మాట్లాడక అన్నీ గ్రహించి గృహస్థము యొక్క పరమార్ధమెరిగి అచ్చటినుండి వెళ్లిపోయిరి.

తిరువళ్లువర్ వ్రాసిన తిరుక్కుఱళ్ గ్రంధము ధర్మబద్ధమైన జీవితము, ధర్మబద్ధమైన సంపాదన, ధర్మబద్ధమైన శృంగారమును బోధించుచున్నది.

ఇతను వ్రాసిన తిరుక్కుఱళ్ గ్రంధము ధర్మమును బోధించు 38 అధ్యాయములు, అర్ధమును బోధించు 70 అధ్యాయములు చివరిదైన కామమును బోధించు ప్రేమ, శృంగారము 25 అధ్యాయములతో కూడినదై మొత్తము 133 అధ్యాయములతో నిండియున్నది. ఒక్కొక్క అధ్యాయములో 10 పద్యములు చొప్పున మొత్తము 1330 పద్యములతో నిండిన ఈ తిరుక్కుఱళ్ గ్రంధము తమిళ వేదముగా ప్రసిద్ధికెక్కి ప్రపంచములోని దాదాపు 80 భాషలలో అనువాదము చేయబడినది. మరియు ఈ గ్రంధకర్త జ్ఞాపకార్ధముగా భారతదేశ దక్షిణ భూభాగపు చివరి అంచు బంగాళఖాతము, హిందూమహా సముద్రము, అరేబియా సముద్రము సంగమమైన కన్యాకుమారి తీరములో స్వామి వివేకానంద కేంద్రము ప్రక్కన 133 అడుగులు ఎత్తైన విగ్రహమును ప్రతిష్ఠింపజేసిరి. ఆ విగ్రహము యొక్క పీఠము 38 అడుగులు. ధర్మము యొక్క 38 అధ్యాయములకు ప్రతీకగా అమర్చిరి. మిగతా 95 అడుగుల ఎత్తులో తిరువళ్లువర్ విగ్రహమును అమర్చిరి. తమిళనాడుకు చెందిన ప్రముఖ విగ్రహ శిల్పి, వి.గణపతి స్థపతిగారిచే చెక్కబడిన ఈ విగ్రహము ప్రతిష్ఠింపబడి, తమిళనాడు ప్రభుత్వముచే తిరువళ్లువరు దినమని ప్రతి సంవత్సరము జనవరి 15వ తేదిన సెలవుతో కూడిన ఉత్సవముగా రాష్ట్రమంతయు కొనియాబడుచున్నది.

**--- సంగ్రహ చరిత్ర సమాప్తం --**

**కె.ఎమ్ సుబ్బుశేషు**
**(రిటైర్డ్) అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్)**
**డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (టి.ఎన్)**
**అన్నా యూనివర్సిటి,**
**చెన్నై.**

## గ్రంథ పరిచయము

తిరుక్కుఱళ్ అను తమిళ గ్రంథము మన సంస్కృత భర్తృహరి "సుభాషితత్రిశతి" పోలినది. ఈ తిరుక్కుఱళ్‌ను తిరువళ్లువర్ అను తమిళ కవి సుమారు 2000 సం॥ల క్రితము తమిళమున రచియించెను. ఈయన మన తెలుగువాఙ్మయములోని వేమన యోగి వంటివాడు. ఈ తిరుక్కుఱళ్ మూడధ్యాయములలో అఱత్తుపాల్ (ధర్మము) పొరుట్పాల్ (అర్థము) కామత్తుపాల్ (కామము) అని రచియింపబడినవి. ధర్మబద్ధమైన ధర్మార్థకామములు (చతుర్ధ పురుషార్థములు) మోక్షమునకు దారి తీయునని, విడిగా మోక్షమును తను ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ తిరుక్కుఱళ్ మన తెలుగులోని "ద్విపద" ఆటవెలది, తేటగీతి వృత్తమునకు చెందినది. తిరుక్కుఱళ్ "కుఱట్పా" అనే వృత్తములో రచియింపబడియున్నది. జాతి, మత, భాష, దేశములు భిన్నముగానున్నను, ప్రపంచములోని అందరు అనుసరింపదగు అవగాహనము చేసికొనదగు శైలిలో ఈ తిరుక్కుఱళ్ ఉండుట మఱి యొక్క పెద్ద విశేషము. తిరుక్కుఱళ్ జీవన గమనమును దిశా నిర్దేశకము చేయునదియు, మరియు జీవన వ్యవస్థను ఏర్పరచు గ్రంథము.

ఇంత ప్రాశస్త్యముగల గ్రంథమగుటచే ఈ గ్రంథ రాజమును పల్వురు ప్రపంచ భాషలలో పెక్కింటిలోనికి అనువదించియున్నారు. వానిలో కొన్ని ప్రౌఢముగానున్నవి. మరికొన్ని లభ్యమగుటలేదు. ఎందఱు అనువదించినను మనమును ఏల అనువదింపరాదనుకొన్న వారిలో శ్రీ ఎస్.ఆర్. కృష్ణారావుగారొకరు (కలంపేరు : క్రిష్ణ శెవ్వాన)

ఈయన నాకు పాఠశాలలో సహపాఠి ఏబది సంవత్సరముల పరిచయము బహునిదానస్థుడు. పరమసాధువు, సులభసాధ్యుడు.

మాతృభాష. చదువుకొన్నది ఆంధ్రభాషయే. కాని చాల పరిశ్రమ చేసి ఆంధ్రదేశములో సామాన్య ప్రజానీకమునకు సైతము అందుబాటులో నుండునట్లు తెలుగులో వచన రూపమున ఈ తిరుక్కుఱళ్‌ను అనువదించియున్నారు. భాష అత్యంత సులభ గ్రాహ్యముగానుండుట వలన అందఱు ఈ కూర్పును చదివి, ఆనందించి, అందువక్కాణించియున్నట్లు నడచుకొని భగవద్గీతలో గీతాచార్యులు "ఉద్ధరేదాత్మ నాత్మాన" మన్నట్లు ఆత్మోద్ధారణాచేయుదురుగాక! రచయిత ఉద్దేశ్యము నదియే.

తమిళములోగల తిరువాచకము మొదలగు భక్తి రసగ్రంథములను కూడ తెలుగున ఆంధ్రావనికి అందింప ఈ రచయితకు ఉబలాటము కలదు. ఈ గ్రంథమును అందరు ప్రోత్సాహము చేయుట ద్వారా ఈయన పై తదితర తమిళ భక్తి గేయముల తెలుగులో ననువదింప భగవానుడు ఈ రచయితకు ఆయురారోగ్యైశ్వములు బ్రసాదించుగాతమ్మని నా ప్రార్ధన.

ఇట్లు
సుధీజన విధేయుడు
**కుం.ము సుబ్బుశేషు**

**"శుభం భూయాత్"**

# స్పందన

భారతదేశం అపౌరుషేయాలైన వేదవాఙ్మయానికి పుట్టినిల్లు. ఇది ధర్మభూమి – కర్మభూమి మరియు తపోభూమి. అసేతుహిమాచలం అసంఖ్యాక మైన మహితాత్ములకు జన్మనిచ్చిన పుణ్యభూమి.

దేవభాష సంస్కృతాదిగా అనేక భారతీయ భాషలలో –పారమార్థిక చింతనలను, తత్త్వబోధనలను ఆత్మజ్ఞానాన్ని జన సామాన్యానికి అందుబాటులోకి తెచ్చిన మహానుభావులలో "శ్రీ తిరువళ్ళువర్" ఒకరు మహాజ్ఞాని. 2000 సంవత్సరాలకు పూర్వము "తమిళభాష"లో వారు రచించిన ప్రాచీన గ్రంథము "తిరుక్కుఱళ్" అంటే దైవసూక్తులు లేదా శ్రీసూక్తులు. సూక్తి అన్నమాటకు మంచిమాట / సుభాషితం అని అర్థము. నిత్యజీవిత సత్యాలతో బాటు పారమార్థిక సత్యాలను కూడా బోధిస్తున్నందున వీటిని దివ్య సూక్తులు / శ్రీ సూక్తులుగా వ్యవహరిస్తారు.

1330 పద్యములను (తమిళ సాంప్రదాయ బద్ధమైన). 1. అరం (ధర్మము) 2. పొరుల్ (అర్థము) 3. ఇన్‌బం (కామము) అను 3– అధ్యాయములలో సమీకరించారు. ఈ "తిరుక్కుఱళ్" – భర్తృహరి విరచితమైన సంస్కృత సుభాషితత్రిశుతి" పంథాకీ వుంటుంది.

ఇతర భాషలలోవున్న అమూల్యమైన జ్ఞాన సంపదను మిగతా భాషల వారికి అందించేందుకు అనేకులు కృషి చేశారు. అలాగే తమిళభాషకు మకుటమైన "తిరుక్కుఱళ్"ని తెలుగువారికి పరిచయం చేయాలన్న ఆకాంక్షతో తమిళం బాగా యెరిగిన తెలుగువాడు శ్రీ ఎస్.ఆర్. క్రిష్ణా రావు గారి ప్రయత్నము ప్రశంసనీయము.

విషయ సూచిక చాలా సౌకర్యవంతంగా విభాగించడం వల్ల పాఠకుడు తానుమెచ్చిన – తనకునచ్చిన విషయము గ్రహించుటకు అతి సులభమైయున్నది.

అనో భద్రః క్రతవో యంతు విశ్వతః (ఋగ్వేదం) (Let Noble Thoughts come to me from all sides)

భాషయేదైనా భావము ప్రధానము. ఆభావము బాగా అర్థము కావాలంటే మాతృభాషను మించిన సౌకర్యము లేదు. అందులకే శ్రీ ఎస్.ఆర్. క్రిష్ణా రావు గారి ప్రయత్నము మెచ్చదగినది. తెలుగు వారికి మరిన్ని గ్రంధాలు అనువాదరూపంలో అందిచడానికి శ్రీ ఎస్.ఆర్. క్రిష్ణా రావు గారికి ఆయురారోగ్యాలు – శక్తి సామర్థ్యాలు సమృద్ధిగా లభింప చేయమని పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

హార్థిక అభినందనలు
శుభం భూయాత్

**Dr. M.Jayanth Kumar**
E-805, Aparna Cyber Commune
Nallagandla, Hyderabad - 500 019.

## యువతకు తిరుక్కుఱళ్ ఇచ్చు సందేశము

**వాయిమై, ఎనప్పడుమ్, యాదెనిన్, యాదేన్రూమ్, తీయిమై, ఇల్లా, చొల్ (నెం.291)**

**సత్యము, అనునది, ఏదనగా, ఏ మాత్రమైననూ, చెఱుపు, చేయని, మాటలే.**

1. అంటే ఏ మాత్రమైననూ, చెఱుపు గలిగించని, అన్ని కోణములలోనూ శుభమునే కలిగించు మాటలు అసత్యమైననూ అవి సత్యమే అగునని తిరువళ్లువర్ నొక్కి చెప్పుచున్నారు.
2. తల్లిదండ్రులకు సేవచేయుట, సంతృప్తి పరచుటయే మహాపుణ్యం. తల్లియే మొదటి దైవము, తండ్రియే మొదటి గురువు. వీరి ఆశీస్సులు, ఆనందదాయకమై సంతతికి రక్షణ కవచమగును.
3. విద్య నేర్పిన గురువులు, మంత్రోపదేశము చేసిన కుల గురువులు జీవన సాఫల్యమునకు, మోక్ష మార్గమునకు దారి చూపు ఘనులు. వీరి ఆశీస్సులు, ఆనందదాయకమై సుగమ జీవన మార్గ దిశా నిర్ధేశకములగును. మోక్షమును ప్రాప్తింపజేయును.
4. సోమరితనమును వీడి లక్ష్య సాధన కొరకు గట్టిగా ప్రయత్నించవలెను. ప్రయత్నము, ప్రయత్నము, ప్రయత్నము – విజయము. విఫలము విజయమునకు తొలిమెట్టు. విఫలము తప్పులను సరిదిద్ది, జయమునకు దారి చూపును. నిరాశను వీడి ప్రయత్నము చేసి సంపదను, కీర్తిని సాధించవలెను.
5. గట్టి ప్రయత్నమునకు దృఢమైన మనస్సు కావలెను. దృఢమైన మనస్సు దృఢమైన శరీరముపై ఆధారపడియున్నది. దృఢమైన శరీరము కావలెనన్న, పుష్ఠియైన ఆహారము, క్రమశిక్షణ సరైన వ్యాయామము సమకూర్చుకొనవలెను. శరీర బలము, మనోబలము జీవన స్థితిగతులను సరిదిద్ది, మంచిని వృద్ధిచేయును.
6. మనో వికాసమునకు, ఆనందమునకు కోపమును, అసూయను విడనాడవలెను. కోపము లేమి ప్రాణరక్షణ అగును. అసూయలేమి సమబుద్ధిని కలిగించి మనస్సుకు శాంతినిచ్చును.

7. ధర్మబద్ధమైన జీవితమను అత్యాశలేమి, ఓర్వలేమి, ఉగ్రములేమి, పరదూషణలేమితో, ధర్మబద్ధమైన సంపాదన, ధర్మబద్ధమైన శృంగారమును పాటించవలెను. సత్ప్రవర్తనలేని జీవనము, కీర్తిని చెఱచును. అధర్మమార్గపు సంపాదన పుణ్యకార్యములకు పనికిరాదు. అధర్మ శృంగారము వంశమును చెఱచును. పాపమే మిగులును.
8. శృంగారము ఎన్నటికీ ప్రేయస్సు కాదు. శ్రేయస్సే అగును. సృష్ఠికి మూల కారణమే శృంగారము.
సృష్ఠి లేనిదే జగత్తు లేదు. శృంగారము శ్రేయోదాయకమే. ధర్మబద్ధతతో కూడిన శృంగారమే ఆచరణీయము.
9. ఇక అవసాన దశలో మరుజన్మమునకు మనకు రక్షణ కల్పించునవి మనతో వచ్చు పుణ్యఫలములే. తన శక్తికి తగినట్లు చేసిన అన్ని విధములైన దానములు, కోరి వచ్చిన వారికి చేయు సేవలు, పరులకు తగిన సమయములో చేసిన సహాయముల వలన ఆ పుణ్యఫలములు కలుగును.
10. పరులకు చేసిన సేవల వలన, సహాయముల వలన, అన్ని విధములైన దానముల వలన పరమాత్మ తృప్తిపొంది మోక్షమును ప్రసాదించును. డాంబికమును ప్రదర్శించు పూజలు, యాజ్ఞయాగాదులను పరమాత్మ కోరలేదు. మనస్ఫూర్తిగా చేయు సేవ, దానము, సహాయము చిన్నదైననూ పరమాత్మ పెద్దగా గుర్తించును.

ఇట్లు ప్రస్తుత యువతకు సంగ్రహముగా చెప్పునది ఏమనగా: మంచి దృఢమైన శరీరము, దృఢ సంకల్పముతో ప్రయత్నము, సచ్ఛీలత, ధర్మబద్ధతతో కూడిన సత్ప్రవర్తన, సంపాదన, శృంగారము కలిగియుండి వీటిలో తన స్థితికి తగిన దానము, సేవ, సహాయము చేయుచూ జీవనము కొనసాగించువాడే ఉత్తముడు. ఇటువంటి ఉత్తముల వలననే వారు నివసించు ప్రాంతము, ఊరు, దేశము బాగుపడి సకాలములో వర్షములు కురిసి, పంటలు సంవృద్ధిగా పండి సుభిక్షమునకు దారితీయును. **ప్రజల సౌభాగ్యము, ఉన్నతి, శాంతియే దేశ సుభిక్షతకు, ప్రగతికి సూచికలు.**

**సర్వేజనా:సుఖినోభవంతు!!!**

ఇట్లు
**క్రిష్ణశెవ్వాన**

# కృతజ్ఞతలు

ఈ పుస్తకము డి.టి.పి. మరియు ప్రచురణకు ఆర్థిక సహాయము చేసిన పుత్రుడు శెవ్వాన సురేంద్రనాథ్ మరియు పుత్రిక శెవ్వాన/ సిద్ధాబత్తుల శోభన వారికి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఆయురారోగ్యములతో సర్వ ఐశ్వర్యములు కలగాలని సర్వ అభీష్టములు నెరవేరాలని శ్రీకృష్ణపరమాత్మున్ని ప్రార్థిస్తున్నాము.

కొన్ని అంశముల విశదీకరణకు కొన్ని విశేషార్థముల కొరకు, కొందరు రచయితలు వ్రాసిన తమిళ తాత్పర్యార్థములు పరిశీలించబడినవి.

వారిలో ముఖ్యముగా ప్రొ॥ మాణిక్యంగారు, ప్రొ॥ ఆర్.పి. సారధి గారికి మా మన:పూర్వక కృతజ్ఞతలు, నమస్కారములు.

వారందరికి ఒక్కొక్కరికి విడి, విడిగా మా కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్తరములు వ్రాసితిమని సవినయముగా తెలియపరచుచున్నాము.

తెలుగు అనువాదమును పరిశీలించి తప్పులను సరిదిద్దిన అనుభవజ్ఞులు శ్రీ గుండాన జగన్నాధరావు గారికి హృదయపూర్వక వందనములు సమర్పించుచున్నాము.

ఇట్లు
**అనువాద కర్త**
**ఎస్.ఆర్. క్రిష్ణారావు**

# విషయ సూచిక

## 1. అధ్యాయము - ధర్మము


అంకె విభాగము

1. దైవ స్తుతి
2. వర్షము మహిమ
3. సన్యాసము
4. ధర్మము
5. గృహస్థము
6. ఇల్లాలు
7. సంతాన ప్రాప్తి
8. ప్రేమానుభూతి
9. ఆతిధ్యము
10. ఇంపైన మాటలు
11. కృతజ్ఞత
12. సమబుద్ధి
13. అణకువ
14. సత్ప్రవర్తన
15. పరుల భార్యను చూడకుండుట
16. సహనము
17. అసూయ
18. పరుల సొమ్ముపై కాంక్ష
19. పరోక్ష దూషణ
20. వ్యర్థ మాటలు
21. కీడు
22. సహాయము
23. దానము
24. కీర్తి
25. కృపాశీస్సులు
26. మాంసాహారము
27. తపస్సు
28. చెడు నడత
29. దొంగతనము
30. సత్యము పలుకుట
31. కోపము
32. అపకారము
33. అహింస
34. అశాశ్వతము
35. సన్యాసము
36. సత్యమెరుగుట
37. ఆశను తెంచుట
38. విధి


## 2. అధ్యాయము - అర్థము


39. రాజ ధర్మము
40. విద్య
41. విద్యలేమి
42. వినుట
43. వివేకము
44. తప్పులు
45. పెద్దలతోడు
46. అల్పులతో చేరకుండుట
47. కార్యమెరిగి
48. బలమెరిగి

49. కాలమెరిగి
50. స్థానమెరిగి
51. పరిశీలించి ఎంచుకొనుట
52. పరిశీలించి నియమించుట
53. బంధువులు
54. కర్తవ్యము మరువకుండుట
55. రాజ దండము
56. దుష్ట పరిపాలన
57. కఠిన శిక్ష వేయక
58. దయా దాక్షిణ్యము
59. గూఢ చర్యము
60. ప్రయత్నించు ఉత్సాహము
61. సోమరి తనము
62. దృఢ ప్రయత్నము
63. ఆటంకములు
64. మంత్రిత్వము
65. మాటల చాతుర్యము
66. సత్కర్మము
67. కార్య దీక్ష
68. కార్య విధానము
69. రాయ బారము
70. రాజుతో మెలగుట
71. గుర్తెరుగుట
72. సభనెరిగి మాట్లాడుట
73. సభలో భయము లేమి
74. దేశము
75. కోట
76. సంపద యొక్క తత్వము
77. సైన్య బలము
78. సైన్య పరాక్రమము
79. స్నేహము
80. స్నేహమును పరీక్షించుట
81. పాత స్నేహము
82. చెడు స్నేహము
83. తగని స్నేహము
84. మూర్ఖత్వము
85. అజ్ఞానము
86. పగ
87. శత్రు బలము
88. శత్రుత్వము తెలుసుకొనుట
89. నిగూఢ శత్రువు
90. పెద్దలయందు గౌరవము
91. ఇల్లాలి మాటలు
92. భోగపు స్త్రీలు
93. కల్లు త్రాగుట
94. జూదము
95. మందు
96. పౌరసత్వము
97. పరువు
98. గొప్పతనము
99. సద్గుణము
100. సంస్కారము
101. సంపద
102. సిగ్గు
103. కుటుంబ గౌరవము

104. వ్యవసాయము
105. దారిద్ర్యము
106. యాచకము
107. బిచ్చము
108. అల్పగుణము

**3. అధ్యాయము - కామము**

109. మెరుపు చూపులు
110. మనో సైగలు
111. కలయిక కోరికలు
112. అందమే ఆనందము
113. ప్రేమికుల మాటలు
114. లజ్జవీడిన ప్రేమ
115. బహిర్గతమైన ప్రేమ
116. వియోగ వేదన
117. విరహ బాధ
118. కళ్ల అవస్థ
119. పసుపు పచ్చదనము
120. ఒంటరి బాధ
121. తలచి ఏడ్చుట
122. కలల పరిస్థితి చెప్పుట
123. సంధ్యా బాధ
124. అంగ సౌందర్యము నశించుట
125. మన:పలవరింత
126. అభిమానము క్షీణించుట
127. మనో వేదన
128. సూచనలు
129. కలయిక కోరికలు
130. మనో ఘోష
131. ఉత్తి అలక
132. ఉత్తి జగడము
133. అలక ప్రేమ

# అధ్యాయము – 1

# ధర్మము

# 1. దైవ స్తుతి

1. ఏ భాషకైన 'అ' కారము మొదలు అన్నట్లు, ప్రపంచమునకు ఆది భగవానుడే మొదలు.
2. విద్య యొక్క ప్రయోజనము భగవంతుడిని తెలుసుకొని నమస్కరించుటయే తప్ప మరేమియూ కాదు.
3. మనో పద్మము యందు అమరియున్న భగవంతుని శరణు పొందినచో, ప్రపంచములో గొప్పగా దీర్ఘాయువుతో జీవింపవచ్చును.
4. ఇష్టము, అయిష్టము లేని భగవంతుని పాదము శరణు చెందిన వారికి ఎన్నటికీ దు:ఖము కలుగదు.
5. భగవంతుని యొక్క గొప్ప మహిమను స్తుతించి నమస్కరించడము వలన మన పూర్వ కర్మ దుష్ఫలితములు తొలగిపోవును.
6. పంచేద్రియముల ఆశలను విడనాడి, దేవుని యందు సత్య ధర్మముతో ప్రేమ సలిపిన వాడు, భువిలో గొప్పగా, దీర్ఘాయువుతో జీవించును.
7. అసమానమైన భగవంతుని యందు శరణు పొందినవారే, ఇతరుల దు:ఖమును పోగొట్టగలరు, తప్ప మిగతావారికది సాధ్యము కాదు.
8. ధర్మ సముద్రమైన దేవుని పాద పద్మములను స్తుతించి నమస్కరించు వారే, ఇంద్రియ ఆశల సముద్రమును ఈదగలరు.
9. ఎనిమిది గుణములలో గూడిన దైవమును నమస్కరించుటకే ఈ అష్టాంగములు అమరియున్నవి. అట్లు కానిచో ఫలము లేదు.
10. దేవుని శరణు పొందిన వారే, జన్మమను మహాసముద్రమును ఈదగలరు, ఇతరులకు అది సాధ్యము కాదు.

## 2. వర్షము మహిమ

11. ప్రపంచములోని అన్ని జీవరాసులు జీవించుటకు వర్షమే ప్రాణాధారమైనది, అందుకే వర్షము అమృతమనబడును.
12. భుజించువారికి, ఆహారము ఉత్పత్తికి, దాహార్తి తీర్చుటకు ఉపయోగపడునది వర్షము.
13. ప్రపంచము సముద్రపు నీటిచే ఆవరింపబడియున్ననూ, వర్షము లేనిచో ప్రజలు ఆహారము లేక తల్లడిల్లి పోవుదురు.
14. వర్షము సంవృద్ధిగా లేనిచో, వ్యవసాయము చేయుటకు సాధ్యపడదు.
15. అతివృష్టి, అనావృష్టిలతో ప్రజలను బాధించునదియు, సక్రమముగా, సకాలములో కురిసి ప్రజలను బాగుగా జీవింపజేయునదియూ వర్షమే అగును.
16. మేఘము నుండి వర్ష బిందువులు పడనిచో, పచ్చని గడ్డి పరకలు మొలకెత్తుట చూడ శక్యము గాదు.
17. మేఘము సముద్రపు నీటిని గైకొని ఆ నీటినే మరలా వర్ష రూపమున కురియకున్నట్లైతే, సముద్ర సంపద కూడా అంతరించిపోవును.
18. సక్రమముగా వర్షము కురియని యెడల, గుడియందు దేవతలకు జరుగు పూజలు, ఉత్సవములు కూడా జరుగవు.
19. వర్షము కురియని యెడల గృహస్థులు, దానధర్మాలు చేయలేరు. అడవి యందున్న సన్యాసులు జపతపములు చేయజాలరు.
20. నీరు లేక జీవనము లేదు. వర్షము లేక నీరు లేక, క్రమశిక్షణ ఉండదు.

# 3. సన్యాసము

21. ఆశను విడనాడి, ధర్మమును పెంపొందించుటకు సహాయపడు సన్యాసుల యొక్క గొప్పను స్తుతించడమే గ్రంథముల యొక్క ప్రయోజనము.
22. ఈ ప్రపంచములో జనన, మరణములను ఖచ్చితముగా లెక్కించుటకు ఎట్లు శక్యము కాదో అట్లే సన్యాసుల యొక్క గొప్పతనము చెప్పనలవి కాదు.
23. భూలోకములోని జన్మ, సంసార దు:ఖములను గుర్తించి, పరలోక శాంతికి సన్యసించు సన్యాసమే గొప్పదైనది.
24. జ్ఞానమను అంకుశముతో పంచేంద్రియములను మదగజములను అణచి పరిపాలించు వాడే, ముక్తి పొందుటకు అర్హత గలవాడు.
25. పంచేద్రియములను జయించిన గౌతమ మహర్షి, కామ కాంక్షతో తప్పు చేసిన దేవేంద్రుని శపించుటయే ఇందులకు నిదర్శనము.
26. పంచేద్రియముల ఆశలను అణచి పరిపాలించుటకు ప్రయత్నము చేయువారే గొప్పవారు, అట్లు చేయలేని వారందరూ అల్పులే.
27. పంచేద్రియముల గుణములైన రుచి, దృష్టి, స్పర్శ, శ్రవణ, వాసనలను అణచి, బంధించి పరిపాలించు వానికి ఈ ప్రపంచమే అణకువ.
28. ఉపయోగకరమైన సన్యాసుల మాటల గొప్పతనము, వారు చెప్పిన సూక్తులు, వేదవాక్కులు అమూల్యమైనవి అగును.
29. సద్గుణము అనే కొండపై నిలచియున్న సన్యాసి యొక్క కోపము కొంచెమేనైనను, దానిని తట్టుకోనుట ఎవరివల్లనూ సాధ్యము కాదు.
30. బ్రాహ్మణులని పిలువబడు వారెవరనగా, అన్ని జీవరాశుల యందు దయా గుణముతో, నిర్మల మనస్సుతో మెలగువారే.

# 4. ధర్మము

31. ధర్మము ప్రజలకు పేరు, ప్రతిష్ఠలు, సంపద ఇచ్చును. కాబట్టి ధర్మము కంటే శ్రేష్ఠమైనది మరేది లేదు.

32. ధర్మము వలె ఉత్కృష్టతను పెంచునది మరేది లేదు. ధర్మమును పాటించక విడచి పెట్టుట కంటే మరొక చెడ్డది లేదు.

33. ఒకడు తన శక్తికి తగినట్లు, చేయదగిన సమయ, సందర్భములలో ధర్మమైన పనులను చేయవలెను.

34. మనస్సులో చెడు తలంపులు లేకపోవుటయే ధర్మమగును. మనశు ్శద్ధి లేని అన్ని కార్యములు బాహ్య వేషములగును.

35. అసూయ, అత్యాశ, కోపము, కఠినమైన మాటలు అను ఈ నాలుగు లోపములు లేనిదే ధర్మమగును.

36. ధర్మమైన పనులకు కాలము, సమయము చూడక, వాటిని ప్రక్కన పెట్టక, వెంట వెంటనే చేయవలెను. ఆ ధర్మము మరు జన్మమునకు తోడై నిలుచును.

37. ధర్మఫలము ఇదని విశదీకరించునపుడు పల్లకి మోయు వానికి, అందులో సుఖాశీనుడై కూర్చున్న వానికి ఉన్న తేడా అని చెప్పరాదు.

38. ఒకడు ఆఖరి వరకు, విరామము లేకుండా చేయు ధర్మ పనులకు తగినట్లు, అతనికి మరు జన్మలేని స్థితి గలుగును.

39. ధర్మము వలన గలిగిన సుఖమే నిజమైన, సత్యమైన సుఖము. మిగతా సుఖములన్నియూ తాత్కాలికమైనవి. కీర్తి నివ్వవు.

40. ప్రతి ఒకడు ధర్మబద్ధతతో కూడిన మంచి కార్యములే చేయవలెను. పాప కార్యములు, చెడ్డవి విడువవలెను.

# 5. గృహస్థము

41. గృహస్థము నందున్నవాడు, మిగతా ముగ్గురికి, అనగా బ్రహ్మచర్యము, వానప్రస్థము, సన్యాసమునందున్న వారికి తోడుగా ఉండవలెను.
42. సన్యాసులకు, బీదలకు, అనాధలకు, తగిన ఆదరణ లేక మరణించిన వారికి గృహస్థుడు తోడుగా వుండి కర్మలు చేయవలెను.
43. పితురులు, దైవము, అతిథులు, బంధువులు, తాను ఈ ఐదుగురుకున్నూ, ధర్మమైన పనులు నీతి తప్పక చేయుటయే గ్రహస్థుని ధర్మమగును.
44. పరనిందకి భయపడి, ధర్మబద్ధమైన సంపాదనతో, ఇతరులకు సహాయపడి, తాను కూడా నీతి నియమాలతో జీవించినచో, తన సంతతికి ఏ కొదువ ఉండదు.
45. గృహస్థునకు ప్రేమ, వినయము, ఇతరులకు సహాయపడు గుణములే ధర్మములగును.
46. గృహస్థమున వుంటూ, ధర్మబద్ధమైన జీవితము గడుపువాడు ఏ తప్పులు చేయక అందరి కన్నా ఎక్కువ ఫలితము పొందును.
47. గృహస్థమున ఉండి సద్గుణములతో జీవితము గడుపువాడు, ఇంద్రియములను జయించుటకు ప్రయత్నించువాడే అందరికన్నా గొప్పవాడు.
48. గృహస్థ ధర్మములన్నింటిని చేయుచూ, ఇతరులకు ధర్మ కార్యములలో సహాయపడుచూ రెండు ధర్మములు నెరవేర్చు గొప్పతనము, సన్యాసము కంటే చాలా మేలైనది.
49. ధర్మముతో కూడినదే గృహస్థము. పైగా పరనిందలు లేని జీవితము చాలా చాలా గొప్పది.
50. ఈ లోకములో ధర్మముతో, సక్రమముగా జీవించువాడు, పరలోకములోని దేవతల వలె ప్రజలచే మెప్పు పొందగలడు.

## 6. ఇల్లాలు

51. గృహస్థ ధర్మములను వినయముతో నెరవేర్చునదియు, ఆదాయమునకు తగినట్లు ఖర్చుచేయు సామర్థ్యము ఉన్న ఇల్లాలే జీవితములో తోడు.

52. సద్గుణము, సత్కర్మ లేని ఇల్లాలు ఒకని జీవితములో ఎంత సంపద ఉన్నా ప్రయోజనము లేదు.

53. సద్గుణవంతురాలైన భార్యను పొందిన భర్తకు లేనిది ఏమియూ లేదు. అట్లుకాని యెడల అతని జీవితములో ఏమియూ లేనట్లే ఉండును.

54. ఒకరు శీలవతియైన భార్యను పొందియున్నట్లైతే, అంత కంటే పెద్ద సంపద మరేదియూ లేదు.

55. పతినే దైవముగా తలంచి కొలుచు భార్యకి, కురవమని చెప్పిన వెంటనే వర్షము కూడా కురుయును.

56. సచ్ఛీలముతో తనను కాపాడుకొని, భర్త గౌరవమును కాపాడి, తన సత్కర్మలతో గృహస్థమును జరుపునదే ఇల్లాలు.

57. స్త్రీలకు రక్షణ పెట్టి రక్షించుట కన్నా, వారి సత్ప్రవర్తన, సద్గుణములే వారి శీలమునకు అసలైన రక్షణ.

58. సద్గుణ వంతురాలుగా, సత్కర్మలను ఆచరించి, భర్తకి సేవ చేయుచూ, అతని వలన సుపుత్రులను పొందిన భార్య, దేవతలచేత పొగడబడును.

59. భర్త ప్రతిష్ఠకు భంగము కలిగించు భార్య, శత్రువుల ముందు భర్త సింహమువలె నడవలేక తలవంపునకు కారణమగును.

60. భార్య యొక్క సద్గుణములే గృహస్థమునకు గొప్పతనము. ఆ గొప్పతనము వారికి జన్మించు మంచి పిల్లల వలన మరింత శోభించును.

# 7. సంతాన ప్రాప్తి

61. ఒకరు పొందవలసినది, తెలుసుకోవలసినది, తెలివైన సంతానమును పొందుట కంటే గొప్పదైనది నాకేమి కనిపించడము లేదు.
62. ఇతరులచే నిందింపబడని, వినయముగల సంతానము బడయుట వలన, అతనికి ఏడు జన్మముల వరకు దు:ఖము లేదు.
63. జన్మించు సంతానమే తల్లిదండ్రుల యొక్క సంపద. ఆ పుత్ర సంపద, తల్లిదండ్రుల యొక్క పూర్వజన్మ కర్మల బట్టి అమరును.
64. అమృతము కన్న గొప్పదగును, తన పిల్లల చిన్నారి చేతులతో పిసికిన అన్నము.
65. పిల్లల లేత శరీరమును తాకుట వలన పెద్దలకు అది పులకరింపు, ఆ పిల్లల లేత పలుకులు పెద్దల చెవికి ఆనందము.
66. వేణుగానము, వీణ నాదముల, గొప్పదనమును పొగడువారు, తమతమ పిల్లల లేత పలుకులను విననివారే అగుదురు.
67. ఒక తండ్రి, తన పుత్రునకు చేయు శుభకార్యమేమనగా, వానిని చదువరుల సభలో గొప్పవానిగా చేయడమే.
68. తన పుత్రుడు తనకన్నా జ్ఞానవంతుడైనచో, తమ కన్నా ప్రపంచములో ఉన్న ఇతరులకు శుభమగును.
69. ఒక తల్లికి, పుత్రులను బడయు సంతోషము కంటే, ఆ పుత్రుడు జ్ఞాని అని, వినయవంతుడని ప్రజలచే కొనియాడునప్పటి సంతోషమే చాలా గొప్పది.
70. ఒక పుత్రుడు తండ్రికి తెచ్చు ప్రతిఫలము ఏమనగా, ఆ పుత్రుని పొందుటకు "ఏ తపమాచరించెనో" అని వేయినోళ్ల ప్రజలచే కొనియాడబడినపుడే.

# 8. ప్రేమానుభూతి

71. ప్రేమతో ఉన్నవారు యితరులు కష్టపడుట చూచి కన్నీరు కార్చుటయే ప్రేమకి చిహ్నము, కాబట్టి ప్రేమకి ఏ తాళము వేయలేము.
72. ప్రేమలేనివాడు అన్నింటిని తన స్వార్థము కొరకు ఉపయోగించును. ప్రేమగలగిన వాడు తన శరీరమును, ప్రాణమును కూడా ఇతరులకు ఇచ్చును.
73. ప్రాణము, శరీరము ఒకదానికొకటి సంబంధించినది. అట్లే న్యాయమైన జీవితము, ప్రేమలది విడదీయలేని బంధమని జ్ఞానుల మాట
74. మన చుట్టూ వున్న వారియందు, బంధువుల యందు చూపు ప్రేమయే, తర్వాతి కాలములో స్నేహముగా మారి ప్రేమానుభూతితో శోభించును.
75. ఈ లోకములోని గృహస్థ జీవితమునకు, పరలోకములోని అలౌకికి ఆనందము పొందుటకు ఖచ్చితమైన కారణము మనిషి యొక్క ప్రేమయే.
76. ధర్మ కార్యములకు మాత్రమే కాకుండా శత్రువుల యొక్క శత్రుత్వము కూడా మార్చుటకు ఉపయోగపడునది ప్రేమయే.
77. ఎముకలు లేని పురుగులు ఎట్లు ఎండలోపడి మాడిపోవునో, అట్లే ప్రేమలేని జీవిని ధర్మదేవత దండించును.
78. మనస్సులో ప్రేమలేని గృహస్థము అనునది, ఎడారిలో ఒక చెట్టు చిగురించినట్లు. (ఏ ప్రయోజనమూ లేదు)
79. మనస్సు యొక్క అంతర అంగమైన ప్రేమ లేని యెడల, బాహ్య అంగములు ఎన్ని వున్నా ఏమి ప్రయోజనము?
80. ప్రేమయే ఒకనికి జీవమున్న శరీరము వంటిది, ప్రేమలేని వానికి అది కేవలము ఎముకలు, తోలు మూసిన శరీరమే అగును.

# 9. ఆతిథ్యము

81. ధనము కూడబెట్టి సంసారము చేయుట, అతిథులను ఆహ్వానించి ఉపచారములు చేయుటకే.
82. మరణము నుండి కాపాడు అమృతమైనను, వచ్చిన అతిథులకు ఇవ్వక తానొక్కడే భుజించుట చేయకూడని పని
83. తన వద్దకు వచ్చిన అతిథులను ఆహ్వానించి, ఉపచారములు చేయు వానికి లేమి అన్నది ఎన్నడూ ఉండదు.
84. అతిథులను ప్రసన్న వదనముతో ఆహ్వానించి, ఉపచారములు చేయు గృహమున మహాలక్ష్మియు ప్రసన్న వదనముతో నిలిచియుండును.
85. అతిథులకు తొలుత ఆహారము సమర్పించి, మిగిలిన దానిని భుజించు వానికి భూ సంపదయూ, విత్తనములు వెదజల్లకుండానే పైరు వృద్ధియూ కలుగును.
86. వచ్చిన అతిథులకు ఉపచారములు చేసి, ఇకపై వచ్చు అతిథులను ఆహ్వానించి ఉపచారములు చేయు వానికి, దేవతలే ఆతిథ్యము ఇచ్చుదురు.
87. ఆతిథ్యము ఒక యాగము వంటిది. ఆతిధ్య ఫలితము కొలతలు లేనిది. ఆతిధ్యమునకు తగినట్లు ప్రతిఫలము దక్కును.
88. ఎన్నో పాట్లుపడి ధనము కూడబెట్టి, దానిని ఆతిథ్యములో ఉపయోగించని వానికి ఈ లోకములోనూ, తర్వాత పై లోకములోనూ సహాయమునకు ఎవరూ వుండరు.
89. ధనవంతుడైనను అతిథులను ఆహ్వానించి ఉపచారములు చేయని వాడు బీదవాడే అగును.
90. విరజాజి పూవు వాసన చూచుటచే వాడిపోవును, అట్లే అతిథులను అన్యమనస్కులై ఆహ్వానించిన యెడల అతిథుల ముఖము వాడిపోవును.

# 10. ఇంపైన మాటలు

91. ప్రేమతో, వంచన లేని, న్యాయమైన మాటలతో మాట్లాడునదే ఇంపైన మాటలు.

92. పూర్ణ మనస్సంతోషముతో ఒకరికి ఒక వస్తువును ఇచ్చుట కంటే ముఖస్సంతోషముతో ఇంపైన మాటలు మాట్లాడునదే గొప్పదగును.

93. ఒకరిని చూచిన వెంటనే ముఖము వికసించి, మనసు పరవశించి మాట్లాడు మాటలే ధర్మము అనబడును.

94. అందరితోనూ ఇంపైన మాటలు మాట్లాడు వానికి, దు:ఖమునిచ్చు బీదరికము దరిచేరదు.

95. తనకన్నా తక్కువ వారితో, వినయముతో కూడిన, ఇంపైన మంచి మాటలు మాట్లాడు వానికి, ఆ వినయము, ఇంపైన మాటలే ఆభరణములగును.

96. ఒకరు బాగా ఆలోచించి ఇతరులకు శుభము జరుగు, మంచి మాటలే నయముగా మాట్లాడిన యెడల, వానికి పాపము వీడి ధర్మము పెరుగును.

97. ఇతరులకు న్యాయము చేకూర్చునవియు, ధర్మము ఎరిగిన మంచి మాటలే, వినయముతో కూడిన ధర్మమైన మాటలగును.

98. ఇతరులకు దు:ఖము కలిగించని మాటలే, ఈ లోకమునందు, పరలోకమునందునూ సుఖమునిచ్చును.

99. ఇతరుల ఇంపైన మాటలు మనకు మనస్సంతోషము ఇచ్చునపుడు, మన మాటలెందుకు ఇతరులకు పరుషము కావలెను?

100. సుఖము నిచ్చు మంచి, ఇంపైన మాటలు మాట్లాడక, చెడ్డ మాటలు మాట్లాడుట, ఎట్లనగా తమ వద్ద పండ్లు ఉంచుకొని, కాయలు కోరి తిన్నట్లు అగును.

# 11. కృతజ్ఞత

101. తనకు సహయము చేయని వారికి కూడ సహయము చేయు వానికి ఈ లోకమును, పరలోకమును ఇచ్చినా సమానమవ్వదు.

102. అవసర కాలములో ఒకరికి చేయు సహాయము చాలా చిన్నదైనను, ప్రపంచము కన్నా పెద్దదిగా పరిగణించబడును.

103. ప్రతిఫలము ఎదురు చూడక ఒకరు చేయు సహాయము, సముద్రము కన్న పెద్దదిగా పరిగణించబడును.

104. చిన్న సహయము ఒకరు చేసిన దైనను, కృతజ్ఞతా భావమున్న వాడు దానిని పెద్ద సహయముగానే తలంచి స్తుతించును.

105. ఒకరు చేయు సహాయము యొక్క గొప్పతనము, చేసిన సహాయము వలన నిర్ణయింపబడదు, కాని సహాయము పొందువాని మనస్సు నిండుదనము బట్టి ఉండును.

106. మనము కష్టములో ఉన్నపుడు సహాయపడిన వారి స్నేహము విడువరాదు. అట్లే నేర రహితమైన జీవితము గడుపు ధర్మశీలుని స్నేహము మరువకూడదు.

107. మంచివాడు, తన ఆపదలో సహాయపడి కాపాడిన వాడిని, తరువాత వచ్చు ఏడు జన్మములలోనూ మరువకుండును.

108. ఒకరు చేసిన సహాయమును ఎన్నడూ మరువకూడదు. అట్లే ఒకడు చేసిన చెడువునూ వెంటనే మరువవలెను.

109. ఒకరు మనకు చేసిన సహాయమును తలంచి, అనతి కాలములో తాను చేయు చెడువును మన్నించి విడువవలెను.

110. మహా పాపకార్యములు చేసిన వానికి కూడా ప్రాయశ్చిత్తము, పరిహారము కలదు, కాని ఒకరు చేసిన సహాయమును మరచిన వానికి క్షమాపణ లేదు.

# 12. సమబుద్ధి

111. ద్వేషము, స్నేహము చూడక సమబుద్ధితో తటస్థముగా నిలచి తీర్పు చెప్పడమనునది చాలా గొప్పదైన ధర్మమగును.

112. సమబుద్ధితో మెలగువానికి సంపద క్షీణత లేకుండా చాలా తరముల వరకు ఫలితము కొనసాగును.

113. సమబుద్ధిని విడుచుట వలన కలుగు లాభమైననూ ఒకరు వెంటనే విడువవలెను.

114. ఒకరు సమబుద్ధితో మెలగుచున్నారా లేదా అనునది, అతనికి తరువాత కలుగు పరిణామముల బట్టి తేట తెల్లమగును.

115. ఒకరికి కలుగు మంచి చెడ్డలు పూర్వజన్మ కర్మ ఫలితములే అని ఎరిగి, ఎల్లకాలము సమబుద్ధితో ఉండుట వివేకులకు అందము.

116. సమబుద్ధి, తటస్థము వీడి నడువుటకు మనస్సు పురికొల్పినచో, అది అతని కీడుకి చిహ్నముగా తెలుసుకొనవలెను.

117. సమబుద్ధిని విడువక ఎప్పటికి ధర్మశీలమును పాటించు వానికి, వాని యొక్క దారిద్ర్యమును, ప్రపంచము క్షీణతగా తలంచదు.

118. పక్షపాతము లేక సమబుద్ధితో త్రాసువలె తటస్థముగా నిలుచుట వివేకులకు అందమగును.

119. ఒకని మనస్సు న్యాయమైనదిగాను, తటస్థముగా పక్షపాతము చూడక ఉండునట్లైతే అతని తీర్పు కూడా న్యాయమైనదిగా అమరును.

120. వ్యాపారము చేయు వణికుడు ఎట్లు ఇచ్చుట, పుచ్చుకొనుట చేయునో, అట్లే బాధ్యతగా, సమబుద్ధితో ఎప్పటికీ తటస్థము లాభదాయకమగును.

# 13. అణకువ

121. అణకువ అను వినయము ఒకరిని దేవునిగా చేయును. అణకువ లేమి దు:ఖ ప్రపంచములో త్రోసివేయును.

122. అణకువ అనుదానిని సంపద వలె కాపాడవలసియున్నది. ఎందుకనగా మనిషి ప్రాణమును అణకువ కాపాడునట్లు మరే సంపద కాపాడ లేదు.

123. అణకువనే బుద్ధిశాలి తనమని ఎరిగి మెలగిన యెడల, వానిని మంచివారందరు పొగడెదరు. గొప్పతనము కలుగును.

124. ఒకరి మార్పులేని, నిలకడయైన అణకువ యొక్క గొప్పతనము ఎటువంటిదనగా, అది పర్వత శిఖరం కన్నా ఎత్తైనది.

125. అందరికీ అణకువ గొప్ప సంపదగును. గొప్ప సంపన్నులకు అణకువ మరొక సంపదగా మారును.

126. తాబేలు తన అంగములను కవచము లోపలికి ముడుచుకున్నట్లు, ఒకడు తన పంచేంద్రియములను వశపరచుకొని నడుచుకున్నచో, అది ఏడు జన్మముల వరకు రక్షణగా ఉండును.

127. ఒకడు తాను గొప్పవాడిగా ఉన్ననూ తన నాలుకను అధీనములో ఉంచుకొనవలెను. అట్లు కాని యెడల తన మాటల వలన దు:ఖపడవలసి వచ్చును.

128. కఠినమైన మాట వలన కీడు ఎర్పడుటయేకాక, తనకు మిగత మంచి కార్యముల వలన ఏర్పడిన సత్ఫలితములు కూడ చెడిపోవును.

129. నిప్పు వలన ఏర్పడిన కాలిన పుండు మానిపోవును, కాని కఠినమైన మాటల వలన ఏర్పడిన గాయము ఎన్నటికీ మానదు.

130. అన్నింటినీ ఎరిగి, కోపము వీడి, అణకువతో మెలగువానికి, ఆ ధర్మదేతయే వాని వద్ద నిలిచి రక్షించును.

# 14. సత్ప్రవర్తన

131. సత్ప్రవర్తన అందరికి గొప్పతనమును కలిగించును. కావున దానిని ప్రాణము కన్నా మిన్నగా తలంచి కలిగియుండవలెను.

132. సత్ప్రవర్తనను కష్టకాలమందు కూడా కాపాడుకొనవలెను, ఏలననగా అది అన్ని ధర్మములకంటే గొప్పదిగాను, తోడుగాను ఉండును.

133. సత్ప్రవర్తన గలిగియుండడమే జీవితమునకు కీర్తి. సత్ప్రవర్తన లేని జీవితము వానిని అధోగతికి దిగజార్చును.

134. బ్రాహ్మణుడు వేదమును మరచిననూ పరవాలేదు. అనతి కాలములో నేర్చుకోనవచ్చును. కాని, అతని ప్రవర్తన చెడినచో, అన్నీ చెడినట్లే.

135. అసూయ ఉన్నవాని వద్ద సంపద చేరదు, అట్లే సత్ప్రవర్తన లేని వానికి ప్రగతి ఉండదు.

136. సత్ప్రవర్తన లేని యెడల కలుగు కీడును ఎరిగి, బుద్ధిమంతులు ఎన్నటికీ సత్ప్రవర్తన నుండి తప్పిపోకుండా కాపాడుకుందురు.

137. సత్ప్రవర్తన వలన కీర్తి ప్రతిష్ఠలు, సత్ప్రవర్తన లేనిచో నిందయు కలుగును.

138. సత్ప్రవర్తన ఎన్నో మంచి లాభములను పొందుటకు కారణమగును. దుష్టప్రవర్తన దు:ఖమునకు, పాపమునకు కారణమగును.

139. సత్ప్రవర్తన కలిగిన వారు, ఎన్నడూ చెడ్డ మాటలు మాట్లాడరు.

140. ప్రపంచములో గొప్పవారు చూపిన మంచి మార్గమున ఒకడు నడచుకొనని యెడల, వాడు ఎంత పండితుడైనను, బుద్ధిలేని వాడే అగును.

# 15. పరుల భార్యను చూడకుండుట

141. పరుల భార్యను కోరుట అను అజ్ఞానము, ప్రపంచములో ధర్మమెరిగిన బుద్ధిమంతుల నైజము కాదు.

142. సత్ప్రవర్తన లేక పరుల భార్యను కోరువారు, ధర్మము, సంపదలను కోల్పోయి, పైగా సిగ్గుతో తలవంచుకొని అల్పసంతోషమూ పొందక నిరు పేదలగుదురు.

143. తనను నమ్ముకున్న వాని భార్యను కోరువాడు, శవముతో సమానముగా పోల్చబడును.

144. కామాంధుడై, కొంచెము కూడ తన తప్పు ఎరుగక, నమ్మిన వాని భార్యను కోరినవాడు ఎంత గొప్ప చదువు, సంపద వున్న వాడైననూ ప్రయోజనము లేదు.

145. శీఘ్రముగా పరుల భార్యను వశపరుచుకున్న వానికి, అపనింద కలకాలము నిలిచియుండును.

146. ధర్మము తప్పి పరుల భార్యను కోరువానికి, అపనింద, కామ పాపము, ద్వేషము, భయము వాని నుండి ఎన్నటికీ వీడకుండును.

147. పరుల భార్యను కోరని వాడే, ధర్మము నెరిగి నీతితో గృహస్థము చేయువాడగును.

148. యుద్ధమందు ధైర్య సాహసమే – పురుషునికి అందము, కాని పరుల భార్యని చూడకుండుట – మహాపురుషత్వము, ధర్మము, సత్ప్రవర్తన అగును.

149. సముద్రముతో చుట్టబడి యున్న ఈ భూమి యొక్క అన్ని ప్రయోజనములను పొందుటకు అర్హత గలవారెవరనగా, పరుల భార్యని కోరనివారే.

150. ఒకడు ధర్మము తప్పి పాపము చేసిననూ, పరుల భార్యలను పొందు పాప కార్యమును చేయకున్నచో అదే చాలా మంచిదగును.

## 16. సహనము

151. తన మీద నిలబడి తననే త్రవ్వుచున్న వారిని సహించుకొనుచున్న భూమి వలె, తనని కించపరచు వారిని కూడా సహించుకొనుట చాలా గొప్పదైన ధర్మము.

152. ఇతరులు మనకు చేసిన కీడును సహించుకొనుట గొప్పదనమగును. అలాగే, ఆ కీడును వెంటనే మరచిపోవుట దానికన్న చాలా గొప్పదనమగును.

153. అతిథులను గౌరవించకపోవడము బీదరికములో మరీ బీదరికము. దానికన్న తనకు అజ్ఞానముతో ఒకడు చేసిన కీడును సహించుకొనుట చాలా గొప్పదగును.

154. ఒకడు తన సద్గుణములు తన నుండి విడిపోకుండా ఉండవలెనన్న, తాను సహనమును పాటించి వాటిని కాపాడుకోనవలెను.

155. ఇతరులు చేసిన కీడును సహించుకొన్న వారిని, ప్రజలు బంగారము వలె గౌరవించి మర్యాద చేయుదురు.

156. కీడు చేసిన వాడిని దండించుట వలన వచ్చునది అప్పటి సంతోషము, కాని ఆ కీడును ఓర్చుకున్న వాడికి ప్రపంచమున్నంత వరకు కీర్తి యుండును.

157. ఇతరులు మనకు చేయకూడని కీడు చేసిననూ, మనము ధర్మము తప్పి ఏ కీడు చేయకూడదు.

158. మనోక్రోధముతో ఒకరు మనకు చేసిన కీడును, మన మనో సహనముతో వారిని జయించవచ్చును.

159. ఇతరులు పలికిన కఠినమైన మాటలను సహించుకోను గృహస్థుడు, తపస్వి కన్న గొప్పవాడు.

160. నిరాహార దీక్ష చేయుచూ తపస్సు చేయువాని కన్నా గొప్పవాడు, ఇతరుల యొక్క కఠిన మాటలను సహించుకొనువాడే

# 17. అసూయ

161. ప్రతీ ఒక్కరు తమ మనస్సులో అసూయ లేని గుణమును ధర్మగుణముగా పాటించవలెను.

162. గొప్ప సంపద అనునది మరేది కాదు, విరోధులతో సహా ఎవ్వరియందును అసూయ గుణము లేకుండుటయే.

163. మరొకరి సంపద చూచి అసూయ పడువాడు, తనకు ధర్మగుణమును, సంపదను కలుగనివాడే అగును.

164. అసూయతో కలుగు కీడును ఎరిగిన బుద్ధిమంతులు, మరొకరిపై అసూయపడి అధర్మముతో కీడు చేయుటకు పూనుకొనరు.

165. అసూయ ఉన్నవాడికి అదొక్కటే చాలును, వానిని ఏ శత్రువులు లేకుండానే అధోగతికి పాలుచేయుటకు.

166. ఒకడు, ఒకరికి ఇచ్చు దానము చూచి అసూయ పడినట్లైతే తాను తన బంధువులు కూడ తిండి, బట్ట లేకుండా కష్టపడుదురు.

167. మరొకరి ప్రగతి చూచి అసూయ పడువానిని చూచి లక్ష్మీదేవి వానిని వీడి, తన సవతియైన జ్యేష్ఠా దేవిని అతని వద్దకు పంపించును.

168. ఒకని యందు అసూయ గుణముండిన యెడల, ఈ జన్మములోని సంపదను నాశనము చేయుటయే కాక, వానిని తప్పు దారిలోనికి నడిపించును.

169. ఈ లోకములో అసూయ ఉన్నవాడు సంపదతోనూ, మంచివారు బీదరికముతోనూ జీవించుట అనునది పూర్వజన్మ ఫలమేమో అని తలచి చూడవలెను.

170. అసూయ ఉన్నవాడు గొప్పవాడు కాలేదు, అసూయ లేనివాడు ప్రగతి లేక క్షీణించువాడు కాదు.

# 18. పరుల సొమ్ముపై కాంక్ష

171. పరుల వస్తువులపై అధర్మ గుణముతో ఆశ పడునది తప్పు. ఆ ఆశ తన కుటుంబమునే నాశనము చేసివేయును.

172. న్యాయ గుణమున్నవారు, మరొకరి వస్తువులపై ఆశపడినను, దానిని పొందుటకు పాప కార్యమును చేయరు.

173. నిలకడైన, అంతములేని ఆనందమును పొందగోరువారు, నాశనమునకు దారి చూపు, అల్పసంతోషములనిచ్చు అధర్మ కార్యములను చేయరు.

174. పంచేంద్రియములను వశపరచుకొని జీవించువారు, బీదరికముతో అష్టకష్టములు పడినను, పరుల వస్తువులపై ఆశ పడరు.

175. విద్యావంతుడు ఒకడు పరుల వస్తువులపై అధర్మముతో ఆశపడినచో, అతను పొందిన విద్య అంతయు విఫలమే అగును.

176. ధర్మ శీలముతో ఆశీస్సులు పొందిన ఒక గృహస్థుడు, పరుల వస్తువులను ఆశించినచో, గృహస్థము, ఆశీస్సులు, ధర్మము అన్నీ చెడును.

177. పరుల వస్తువులపై మోహము వలన ఏర్పడిన సంపద, ఎన్నాళ్లూ నిలబడదు, పైగా చెడ్డ ఫలితము, కీడును ఇచ్చును.

178. తన సంపద వృద్ధి పొందవలెనన్న, అందులకు ఒకే ఒక మార్గము పరుల సొమ్మును ఆశించకుండటయే.

179. పరుల సొమ్మును ఆశించని ధర్మ గుణము గల బుద్ధిమంతుని వద్దకు, అతని మనసెరిగి, మహాలక్ష్మియే అతని వద్దకు చేరును.

180. పరుల సొమ్ముని ఆశించువానికి, నాశనము కోరి వచ్చును, అయితే పరుల సొమ్ముని ఆశించనివానికి ధైర్యము, జయము దరిచేరును.

## 19. పరోక్ష దూషణ

181. ధర్మమైన మాటలు పలుకకపోయిననూ, ధర్మమైన పనులు చేయకపోయిననూ పరవాలేదు, పరులను దూషించువాడని పేరొందకుండిన అదే శ్రేష్ఠము.

182. ధర్మ మార్గమును వదలి అధర్మమైన పనులు చేయువాడి కన్నా, ఒకరిని వారిముందు పొగిడి, వారి వెనుక దూషించువాడు చాలా నీచమైన వాడగును.

183. పరోక్షములో ఒకరిని దూషించువాడు, జీవించుట కంటే చావడము చాలా ధర్మమైన కార్యమగును.

184. ఒకరిని వారి ఎదుటనే దయా దాక్షిణ్యములు లేక మాట్లాడిననూ పరవాలేదు, కాని వారి వెనుక దూషించరాదు.

185. ఒకడు దూషించు విధమును బట్టి, వానికి ధర్మమైన మార్గము పనికి రాదని తెలుసుకొనవచ్చును.

186. ఇతరులపై నింద మోపువాడు, ఇతరులను దూషించువాడు, తన ప్రవర్తన అంతా నీచమని అందరూ తెలుసుకుంటున్నారని తలంచవలెను.

187. పరులపై నిందమోపి, దూషించి, స్నేహము విడదీయువాడు, మంచి మాటలతో, సంతోషముతో స్నేహము వృద్ధిచేయడము, తెలియని వాడే అగును.

188. తనతో మిక్కిలి స్నేహముతో ఉన్నవారినే దూషించువాడు, తనతో స్నేహము చేయని వారిని ఏమీ చేయకుండా ఉండగలడా?

189. పరోక్ష దూషణ చేయువానిని వెంటనే మ్రింగకుండా, ఈ భూమాత తన శాంతమైన, ధర్మ గుణముతో మోస్తున్నదేమో!!

190. పరులపై దూషణ, నింద మోపువాడు, తన తప్పులు తెలుసుకున్నచో ఈ ప్రపంచములో తనకు, ఎవరికీ ఏ కీడు జరుగదు కదా!!

## 20. వ్యర్థ మాటలు

191. ఒక సభయందు వ్యర్థమైన మాట్లాడువాడు, అందరి ముందు నీచుడుగా తలంచబడును.

192. ఒకడు ప్రయోజనము లేని మాటలను పరుల ముందు మాట్లాడినచో, స్నేహితులకు చేయకూడని చేష్టలకన్నా, నీచమైనదగును.

193. ఒకడు ప్రయోజనములేని, వ్యర్థ మాటలను వినిపించిన యెడల, వాడు ప్రయోజనము లేనివాడని గ్రహింపదగును.

194. వ్యర్థ మాటలు మాట్లాడి వినువారి ఆనందమును చెఱపువానికి, రావలసిన శుభము, మంచి జరుగనే జరుగవు.

195. కీర్తి, ప్రతిష్ఠ ఉన్నవారు వ్యర్థ మాటలు మాట్లాడినచో, వారి గౌరవము, మర్యాద క్షీణించును.

196. అప్పుడపుడు ప్రయోజనము లేని మాటలు మాట్లాడువాడు, మనిషి అని పిలువబడక, 'చవట' అని పిలువబడును.

197. బుద్ధిమంతులు ఇతరుల వద్ద గొప్ప మాటలు మాట్లడకపోయిననూ, వ్యర్థమైన మాటలు మాట్లాడరు.

198. ఇతరులకు గొప్పగా తోడ్పడు మాటలను తప్ప వివేకులు, ఇతర వ్యర్థ మాటలు మాట్లాడరు.

199. జీవిత ధర్మమార్గ మెరిగి, దానికి తగ్గట్లు నడుచుకొను బుద్ధిమంతులు, కలలో కూడా ప్రయోజనము లేని వ్యర్థ మాటలు మాట్లాడరు.

200. చెప్పదగిన మంచి మాటలే మంచి పదములతో చెప్పవలెను, ప్రయోజనములేని మాటలు, పదములు మాట్లాడరాదు.

# 21. కీడు

201. ఇతరులకు కీడు చేయుట వలన ఏర్పడు హాని గురించి, కీడు చేయువాడు భయపడరు. కాని ఉత్తములు, బుద్ధిమంతులు కీడు చేయుటకు జంకుదురు.

202. కీడు చేష్టలు చేయుట వలన ఏర్పడు దు:ఖ ఫలితములను గ్రహించిన వివేకులు అగ్ని శిఖల కన్న ఘోరమైనదని భయపడి కీడును ఎవ్వరికి చేయరు.

203. తమకు కీడు చేసిన వారికి కూడా కీడు చేయని గుణము అన్ని గుణముల కన్న గొప్పదైనదగును.

204. పొరపాటున కూడ ఇతరులకు కీడు చేయుటకు తలంచరాదు, అట్లు తలచినచో అప్పటకప్పుడే ధర్మదేవత మనము ఇక్కట్లు పడునట్లు చేయును.

205. లేమి వలన ఇతరులకు చేయు కీడు, ఆ లేమిని మరింత లేమిగా చేసివేయును.

206. దు:ఖమును కల్పించు పాప కార్యఫలములు తనకు అంటరాదన్న, మరొకరికి కీడు చేయ తలంచరాదు.

207. ఒకడు తన శత్రువుల బారి నుండి కూడ తప్పించుకోవచ్చును, కాని చేసిన కీడుకి పాప ఫలితముల నుండి తప్పించుకోజాలడు.

208. తన నీడ తన వెంటే వచ్చునట్లు కీడు చేసిన వాడిని ఆ కీడు యొక్క పాపఫలితములు తనను వెంటాడును.

209. ఒకడు తనకు ఎల్ల వేళల శుభమునే జరుగకోరిన యెడల, తాను ఎవరికీ ఎటువంటి కీడునూ తలంచరాదు.

210. ఇతరులకు ఏ కీడు చేయని వానికి, ఎన్నటికీ వానికి కీడు కలుగదు.

# 22. సహాయము

211. వర్షించు మేఘము కృతజ్ఞతను కోరనట్లు, ఇతరులకు చేయు సహాయమునకు బుద్ధిమంతులు కృతజ్ఞతను కోరరు.

212. ఎన్నో పాట్లు పడి కూడబెట్టిన సంపద, తగిన వారికి తగిన సమయమున సహాయము చేయుట కొఱకే.

213. పై లోకములోనూ, భూలోకములోనూ, పరులకు సహాయము చేయు గుణము కన్నా మేలైనది ఏదీ లేదు.

214. లోక కర్తవ్యమును ఎరిగి పరులకు సహాయము చేయుచున్నవాడే ప్రాణమున్న మనిషి, ఇతరులు చచ్చిన వారితో సమానము.

215. లోక అవసరమునెరుగు ఉత్తముల వద్ద చేరు సంపద, ఇతరులకు దాహము తీర్చుటకు చెరువులో చేరిన నీరు వంటిది.

216. ఇతరులకు సహాయపడు వాని వద్ద చేరిన సంపద, ఫలములు అందించు చెట్టు ఊరి మధ్యన ఉండి ఫలములు అందించునట్లు.

217. ఇతరులకు సహాయపడు గుణమున్నవాడి యొక్క సంపద, అన్నీ అవయవములకు ఔషధము వలె పనిచేయు మూలిక వంటిది.

218. కర్తవ్యమెరికి సహాయము చేయువాడు, తాను బీదరికముతో దిగజారిననూ, తన సహాయ ధర్మమును విడువడు.

219. ఎల్లప్పుడూ సహాయము చేయు గుణమున్నవాడు, తాను సహాయము చేయలేని స్థితికి వచ్చునపుడే, తాను చేయలేమికి బాధపడును.

220. ఇతరులకు సహాయము చేయుట వలన బీదరికము వచ్చునను యెడల, ఆ బీదరికమును ఎంతటి వెలకైన కొనవచ్చును.

## 23. దానము

221. లేనివాడికి ఇచ్చుటయే దానము, మిగతావన్నియు ఏదో లాభము ఆశించి ఇచ్చుటయే.

222. మరొకరి వద్ద నుండి వస్తువును స్వీకరించడము భిక్షయే అగును. ఇచ్చుట వలన నరకమే ప్రాప్తించునన్ననూ ఇచ్చు దానమే శ్రేష్ఠము.

223. వచ్చి అడిగినవానికి 'లేదు' అని చెప్పక దానము తగినంత చేయుట మంచి సంస్కార వంతుల లక్షణమగును.

224. లేమి వలన వచ్చి అడిగిన వారికి లేదనుట, ప్రయోజనము లేనిది, వచ్చిన వాని ముఖము వికసించునట్లు చేయునదే దానము.

225. ఒక తపస్వి మిగతా వారి ఆకలిని తన తపోమహిమతో తీర్చుట కంటే, దానము చేసి ఒకరి ఆకలిని తీర్చుటయే చాలా శ్రేష్ఠము.

226. ఒకరిని పీడించు ఆకలిని తీర్చువానికి, ఆ దాన గుణము అతని భవిష్యత్తులో సంపదగా మారును.

227. మరొకరి ఆకలిని తీర్చి, తన ఆకలిని తీర్చుకోనువానికి, ఎన్నటికీ ఆకలి బాధ ఉండదు.

228. తన సంపదనంతా దాచి ఉంచి దానిని పోగొట్టుకున్నవాడు, దానము యొక్క గొప్పతనము తెలియనివాడే అగును.

229. ఇంకా, యింకా సంపాదించి, కూడబెట్టి తానొక్కడే తినువాడు, బిక్షమెత్తుట కంటే హీనమైన గుణము కలవాడగును.

230. ఇతరులకు పెట్టక, సహాయపడక ఉండు జీవితము కన్నా, మరణమే మేలగును.

# 24. కీర్తి

231. బీదలకు సహాయము చేయవలెను, దాని వలన ఏర్పడు కీర్తియే ఒకరు ప్రాణముతో జీవించుటకు అర్థము.

232. బీదలకు చేయు సహాయము వలన ఏర్పడిన కీర్తినే, వివేకవంతులు వేయినోళ్ల కొనియాడెదరు.

233. లోకములో దానముచే ఏర్పడిన కీర్తి ఒక్కటే అన్నిటి కన్నా గొప్పదైనదగును.

234. దేవతలు సైతము, దానము చేసి కీర్తి పొందినవారినే జ్ఞానుల కన్నా మిన్నగా స్తుతించెదరు.

235. కీర్తి, జ్ఞానము ఉన్నవారే శంఖము వలె చిరకాలము జీవించెదరు, భౌతిక దేహము విడిచిననూ, జ్ఞానవంతులు ఎప్పటికీ జీవించువారే.

236. లోకములో పుట్టినచో కీర్తి కలుగు గుణములతో పుట్టవలెను, లేనిచో పుట్టకుండా ఉండుట మంచిది.

237. కీర్తి పొందని వారి తప్పు తమదే, అందులకు విరుద్ధముగా ఇతరులను నిందించుట ఎందులకో?

238. ఒకరు కీర్తి పొందు గుణములతో లేని యెడల, అదే ఈ లోక ప్రజలకు నిందగా మారును.

239. కీర్తి పొందని ప్రజలను మోయుట భూమికి భారమే అగును, భూమిలో పైరు పంటలు పండుట తగ్గును.

240. పరనింద లేక ఉండువారే జీవించువారు, కీర్తి లేనివారు జీవించినను, చచ్చిన వారితో సమానమగుదురు.

# 25. కృపాశీస్సులు

241. అల్పుల వద్ద ధన సంపద చేరును. కాని దైవ కృప అను సంపద, సంపదలన్నింటిలోనూ చాలా శ్రేష్ఠమైనది.

242. ధర్మమార్గమెరిగి నడుచుకొని కృపాశీస్సులు పొందవలెను. ఎందులకనగా అదే అన్నింటికన్నా జీవితమునకు శ్రేష్ఠమైనది.

243. కృపాశీస్సులు నిండిన హృదయమున్న వారు చీకటి అలుముకున్న నరకములో ప్రవేశించరు.

244. అన్ని జీవరాసులయందు కరుణచూపు హృదయమున్న వారికి ఆశీస్సుల వలన, వారిని ఏ కీడు దరిచేరదు.

245. కృపాశీస్సులున్న వారికి ఎన్నటికీ దు:ఖము కలుగదు, ఎట్లనగా విశాల ప్రపంచములో వాయువే ప్రాణమై జీవనమిచ్చునట్లు.

246. తాము ముందే అనుభవించిన కష్టములను మరచినవారే దయను కోరక జీవరాశులను హింసించువారు.

247. సంపద లేని వానికి ఈ లోకములో సుఖము లేనట్లు, దయలేని వానికి పరలోకమందు మోక్షము లేదు.

248. బీదవాడు ఎప్పటికైన సంపదను కూడబెట్టుకొనవచ్చును, కాని కృపాశీస్సులు చేయి జార్చుకున్న పాపులు ఎన్నటికీ తిరిగి పొందలేరు.

249. కృపాశీస్సులు లేని వాని ధర్మగుణ మెట్లనగా, బుద్ధిలేని వాడు ఒక గ్రంథములోని సత్యమును వెతుకునట్లు.

250. తనవద్ద గల బలమునకు ఒకడు భయపడి ప్రక్కకు తప్పుకొనుట తలంచి, తనకన్నా బలహీనుల వద్ద కరుణతో మెలగవలెను.

# 26. మాంసాహారము

251. తన శరీరము పుష్టించుటకు వేరొక శరీరమును తినువాడు ఎట్లు ఇతర జీవరాసుల యందు కరుణ జూపువాడగును?

252. సంపదను కాపాడుకోలేని వానికి సంపదతో లాభము లేదు. అట్లే మాంసాహారము భుజించువానికి ఆశీస్సులతో లాభము లేదు.

253. ఆయుధము చేబూనిన వాని మనస్సు హత్యకే దారి తీయునట్లు, మాంసాహారము భుజించు వాని మనస్సు మాంసము పైకే పోవును.

254. జీవహింస చేయకుండుటయే ఆశీస్సులు పొందుటకు దారి, చంపి పర శరీరమును తినునది పాపకార్యము. ఆశీస్సులు కలుగనిది.

255. ఒకరి యొక్క జీవి, మాంసము తినని ధర్మముతోనే నిలచి ఉన్నది. మాంసము తినువాడు నరకము నుండి తప్పించుకొనజాలడు.

256. మాంసము తినువారు లేని యెడల జీవహింస ఉండదు. జీవహింస లేనందున మాంసము వ్యాపారము కూడ ఉండదు.

257. మాంసము తినకూడదు. ఏలననగా అది మరొక జీవికి కలుగు హింస, బాధ అనే సత్యమెరుగవలెను.

258. తప్పుచేయని బుద్ధిమంతులు జీవము లేని శరీర మాంసమును తినరు.

259. వేయి వస్తువులు అగ్నిలో పోసి యాగము చేయుట కంటే, ఒక జీవిని చంపి తినకుండుటయే చాలా శ్రేష్ఠము.

260. జీవిని చంపని వానిని, జీవములేని శరీరమును తినని వానిని, లోకములోని అన్ని జీవరాసులు స్తుతించి నమస్కరించును.

# 27. తపస్సు

261. తమకు కలిగిన కష్టములను సహించుకొనుట, ఇతర జీవులకు కష్టములను కలిగించకుండుటయే తపస్సు అనునది.

262. తపస్సు చేయుట అన్నది, దృఢమనో అర్హత ఉన్నవారే చేయగలరు. అందరికి సాధ్యపడదు.

263. సన్యసించిన వారి అన్ని అవసరములను తీర్చుట కొరకే గృహస్థులు తపస్సును మరచిరేమో!!

264. తన ధర్మమునకు ఆటంకము కలిగించు వారిని దండించుటయు, ప్రియమైన ధర్మాత్ములను వృద్ధిజేయుటయు, తపస్సు వలన కలుగును.

265. కోరినది కోరినట్లే పొందవచ్చును. కావున తపస్సు ఈ జన్మములోనే సాధన జేయదగును.

266. తపస్సు చేయువారే తమ కర్తవ్యములను చక్కగా నెరవేర్చగలరు, ఇతరులు ఆశలలో చిక్కుకొని దు:ఖములను కోరి తెచ్చుకొందురు.

267. బంగారమునకు పుటమేయడము వలన మలినములు తొలగి అది ప్రకాశించునట్లు, తపస్సు చేయువారికి కష్టములు మాడ్చి, మాడ్చి జ్ఞానమును కలిగించును.

268. 'నేను' 'నాది' అను అంహం వీడి తపస్సు చేయువారిని, అన్ని జీవరాసులు నమస్కరించును.

269. తపోబలము వలన జ్ఞానము పొందిన వారికి, మరణమును తప్పించుటకు సాధ్యమగును.

270. ప్రపంచములోని లేమికి కారణము, తపస్సు చేయువారు కొందరు, తపస్సు చేయనివారు ఎందరో ఉండుటయే!

## 28. చెడు నడత

271. కపట మనస్సుతో, చెడు నడతతో చేయు అధర్మ పనులను ఎవరూ చూడకపోయిననూ, పంచభూతములు చూచి నవ్వుకొనును.

272. తప్పు అని తన మనుస్సుకు తెలిసి కూడా అధర్మ పనులు చేయువానికి, ఆకాశమంత గొప్ప తపోవేషము వేసిననూ లాభము లేదు.

273. మనస్సును నిగ్రహించనివాడు తపోవేషము వేయుట, ఒక ఆవు, పులి వేషము ధరించి పొలము మేయునట్లు.

274. తపోవేషము వేసి చేయకూడని పనులు చేయువాడు, వేటగాడు పొదయందు దాగి, పక్షులను పట్టుకొనునట్లు.

275. ఆశలను విడనాడిన వాడివలె నటించి చాటుమాటున అధర్మ పనులు చేయువానికి అప్పటికి సుఖముగా తోచిననూ, ఆ తరువాత చాలా దు:ఖపడవలసి వచ్చును.

276. మనస్సును నిగ్రహించి సన్యాసము చేయక, కపటముగా సన్యసించినట్లు నటించువారు చాలా దుర్మార్గులు.

277. మనస్సులో కీడు తలంచుచూ, అధర్మ పనులు చేయుచూ బాహ్యముగా ఎర్రటి కాషాయ వస్త్రములు ధరించిన వారు, గురివింద వలె నలుపు, ఎరుపు రంగులు గలిగియున్నట్లగును.

278. మనస్సున ఎన్నో మాలిన్యముతో, కీడులతో, బయటికి మాత్రము నీటిలో స్నానమాడి శుభ్రమైనట్లు చెడు వేషము వేయువారున్నారు.

279. తిన్నగా ఉన్న బాణము ఒకరిని చంపును కాని, వంకరగా ఉన్న వీణా వాద్యము ఇంపైన రాగము పలుకును, అట్లే ఒకరి చేతలు చూచి మంచిని, చెడుని గ్రహింపవలెను.

280. లోకము నిందించు పనులు చేయకుండిన చాలును. జడలు, గడ్డము ధరించడమో, గొరిగించుకొనుటయో అక్కర్లేదు.

# 29. దొంగతనము

281. తాను ఒకరిచే నిందింపబడకూడదను కొనినయెడల, తాను పరుల వస్తువులను ఆశించి వంచన చేసి పొందకుండా ఉండవలెను.
282. తప్పులు చేయుట మనస్సున తలంచడమే పాపము, కావున మరొకరి వస్తువులను వంచించి తీసుకొనుట మరీ పాపమే.
283. పరులను వంచించడము వలన ఏర్పడు సంపద, అప్పటికి భారీ మొత్తముగా కనిపించినను, తుదకు భారీ మొత్తముగానే నశించిపోవును.
284. పరుల సొమ్మును ఆశించుటలో ఉన్న ప్రేమ, తుదకు తనకు తీరని నిందయు, పాపమును సమకూర్చును.
285. పరుల సొమ్మును సమయము చూచి కాజేయువారు, దైవ ప్రేమ ఆశీస్సులను పొంద అర్హత లేని వారే అగుదురు.
286. దొంగతనములో అధికమైన ప్రేమ యున్నవారు, తమ నడతలో న్యాయము, తృప్తి, నిలకడ లేనివారై యుందురు.
287. తనకు నిలకడైన జీవితము కోరుకొను వాడికి, దొంగ సొమ్ముపై ప్రేమ ఉండకూడదు.
288. నిబద్ధతతో నిలకడైన జీవితములో ఉన్నవాడికి ధర్మము తోడుండును. దొంగతనముతో జీవించువానికి మనస్సులో వంచనయుండును.
289. దొంగతనము తప్ప మరేమి తెలియనివాడు, అతిగా చేయకూడని పనులు చేసి వెంటనే నశించును.
290. దొంగతనము చేసిన వాడికి ఉచ్ఛ స్థితి తప్పిపోవును. దొంగతనము చేయనివాడు దేవలోకమునకు వెళ్లును.

# 30. సత్యము పలుకుట

291. సత్యము అనునది ఏదనగా, కొంచెము కూడ, కీడు కలిగించని మాటలే అగును.

292. ఎటువంటి కీడు కలిగించని, శుభము గలిగించు అసత్యము కూడ కొన్ని సమయములలో సత్యమే అగును.

293. తన మనస్సుకు తెలిసి ఒకరు అసత్యము పలుకరాదు. అట్లు తెలిసి పలికిన అసత్యము తనని కాల్చివేయును.

294. మనస్సున కూడ అసత్యమును తలంచని వానిని, ప్రపంచములోని ప్రజలు వానిని తమ మనస్సులో ఉంచి స్తుతించుదురు.

295. మన:పూర్వకముగా సత్యమునే పలుకువాడు, తపస్సు, దానము చేయువాని కన్నా గొప్పవాడే అగును.

296. ఒకడు అసత్యమును పలుకకుండుట వలన కలుగు గొప్పతనము ఏమనగా, అన్ని ధర్మములను అదే గలిగించును.

297. ఒకడు ఎల్లప్పుడూ సత్యమునే పాటించిన యెడల, వాడు ఇతర ధర్మములను పాటించకపోయిననూ సత్యమే ఫలితమిచ్చును.

298. బాహ్యశుద్ధి నీటితో కలుగును, అంత:శుద్ధి సత్యమైన నడత వలనే కలుగును.

299. బాహ్య చీకటిని పోగొట్టు దీపములన్నీ దీపములు కావు. బుద్ధిమంతులకు సత్యమే అసలైన దీపమగును.

300. సత్యమును పాటించుట కన్నా ఉత్తమమైన ధర్మము ఏ శాస్త్రములోనూ చెప్పబడ లేదు.

# 31. కోపము

301. తన వద్ద అణకువతో ఉన్నవారి యెడ కోపము తెచ్చుకొనరాదు. ఇతరుల వద్ద కోపము తెచ్చుకొనుట, ఎందులకో?

302. బలవంతులపై చూపు కోపము చెడును కలిగించును. చిన్నవారిపై చూపు కోపము పాపమును కలిగించును.

303. ఎవరిపైననూ కోపము చూపక, వెంటనే మరువవలెను. ఆ కోపము వలన కీడులే కలుగును.

304. ఒకనికి ఇతరుల ముఖ వికాసమును, మనస్సంతోషమును చెఱచు కోపము కన్నా మరొక శత్రువు ఉన్నాడా?

305. ఒకడు తనను తాను కాపాడుకొన వలెనన్న తన కోపమును అణచుకొనవలెను, లేనియెడల ఆ కోపమే తనను చంపివేయును.

306. కోపము, కోపము చెందిన వారినే కాక వారికి తోడు వచ్చిన వారిని కూడ చెఱచును.

307. భూమిని చేతితో కొట్టడము వలన తన చేతికే బాధగలిగినట్లు, కోపమును ఉపయోగించువానికి తుదకు బాధయే కలుగును.

308. ఎక్కువ నిప్పుపెట్టి కాల్చి బాధ కలిగించిన వానిపై కూడ కోపము పొందకుండా ఉండినచో చాలా గొప్పదగును.

309. మనస్సులో ఎన్నటికీ కోపము తెచ్చుకోని వానికి, వాడు తలంచినవన్నీ వెంటనే నెరవేరును.

310. కోపిష్టి బ్రతికియున్ననూ, మరణించిన వానితో సమానము అగును. కోపమును త్యజించిన వాడు సన్యాసించిన వానికి సమానము అగును.

## 32. అపకారము

311. గొప్ప సంపద గలిగించునన్ననూ, బుద్ధిమంతులు ఎవరికీ ఎన్నటికీ ఏ అపకారము చేయరు.

312. తమకు అపకారము చేసిన వారికి కూడ, బుద్ధిమంతులు కీడు చేయుటకు ప్రయత్నించరు.

313. మనము ఒకరికి దు:ఖము కలిగించక, మనకు దు:ఖము కలిగించినవారికి కూడ ఏ కీడు చేయకుండుట మేలు.

314. మనకు కీడు చేసినవాడికి కూడ మనము మేలు చేయుట, వాడు సిగ్గుపడునట్లు చేయు దండనే అగును.

315. పరుల దు:ఖమును, తన దు:ఖముగా తలంచి నివృత్తి చేయకుండుట బుద్ధిమంతుల లక్షణమగునా?

316. దు:ఖమును కలిగించునని తెలిసినచో, అటువంటి పని మనము పరులకు చేయకూడదు.

317. ఎన్నడైననూ, ఎట్టైననూ, ఎవ్వరికైననూ మనస్సులో కూడ కీడు చేయుటకు తలంచరాదు.

318. పరులు చేయు కీడు వలన తాను పొందుచున్న దు:ఖమును ఎరిగి, తానూ అదే కీడును పరులకు చేయుట ఎట్లు జ్ఞానమగును?

319. ఒకడు పరులకు మొదట దు:ఖము కలిగించినచో, ఆ తరువాత అదే దు:ఖము తనకు కోరకనే వచ్చును.

320. కీడులన్నియూ కీడు చేసిన వారికే వచ్చి చేరును. కావున ఏ కీడు లేక ఉండగోరు వారు ఏ కీడును ఎవరికీ చేయకుండా ఉండవలెను.

## 33. అహింస

321. ధర్మమైన కార్యము అనునది ఏదనగా, దేనిని చంపకుండుటయే. అన్ని పాపములకు హింసయే కారణ మూలమగును.

322. తన వద్ద నున్న ఆహారమును ఆకలితో ఉన్నవారికి ఇచ్చి తానూ భుజించుట అన్నది అన్ని ధర్మశాస్త్రములలో చెప్పబడిన ధర్మములన్నిటి కంటె శ్రేష్ఠమైనది.

323. ధర్మములన్నింటిలోనూ మొట్టమొదటిది చంపకుండుట, ఆ తరువాతి ధర్మము అసత్యము పలుకకుండుటయే.

324. సన్మార్గము అనునది ఏదనగా, ఏ జీవిని చంపకుండుటయే ధర్మమునకు సుభమైన దారిని చూపునది.

325. సన్యాసమును పాటించు వారికంటే అహింసను పాటించు వారే చాలా శ్రేష్ఠమైన వారు.

326. ఏ జీవిని చంపకుండుట అను ధర్మము పాటించువాని జీవితములో ధుర్మరణము ఏర్పడదు.

327. తన ప్రాణము పోయినా సరే ఇతరుల ప్రాణమును తీయకూడదు.

328. జీవిని చంపి యాగము చేయుటచే వచ్చి చేరిన సంపద వలన, బుద్ధిమంతులకు ఆ సంపద కీడునే కలిగించును.

329. చంపుటయే వ్యాపారముగా చేయు ప్రజలు, బుద్ధిమంతుల దృష్టిలో నీచులే అగుదురు.

330. రోగముతోనూ, దరిద్రముతోనూ బాధపడుతూ జీవించువారు, పూర్వ జన్మలో వారు ఏదో జీవియొక్క ప్రాణమును, శరీరమును వేరు చేసినవారై యుందురు.

# 34. అశాశ్వతము

331. శాశ్వతము కాని లేక నశించుపోవు దానిని శాశ్వతము అని తలంచుట అజ్ఞానమే అగును.

332. సంపద వచ్చునది, పోవునది, ఎట్లనగా నాటకమునకు చూచుటకు ప్రజలు వచ్చునట్లు, పోవునట్లు.

333. సంపద, నిలకడలేని గుణము గలది. కావున, సంపద గలిగిన వెంటనే నిలకడగల ధర్మమును ఆచరించుట మేలు.

334. గడిచిపోతున్న ఒక్కొక్క రోజు, జీవితములోని కాలమును ఒక్కొక్క ముక్కగా కత్తితో కోయునట్లని వివేకులు చెప్పుదురు.

335. అవసాన కాలములో మాటలు పడిపోయి మరణము సంభవించుటకు ముందే, ధర్మ కార్యములను వేగవంతముగా చేయవలెను.

336. ఒకడు "నిన్న ఉన్నాడు ఈ రోజున లేడు" అని చెప్పు గొప్ప గుణము కలిగినది ఈ ప్రపంచము.

337. జీవితములోని ఆఖరి ఘడియలు తెలియని ఈ ప్రజలకు కోటి ఆలోచనలు, ఆశలు ఉండుట ఆశ్చర్యమే!!

338. గుడ్డు నుండి పక్షి పిల్ల బయటికి వచ్చి ఎగిరిపోతున్నట్లు, శరీరమను గూటినుండి జీవి బయటికి ఎగిరిపోవును.

339. నిద్రించుచున్నట్లు మరణము, నిద్రించు లేచునట్లు జననము.

340. జీవి ఎప్పటికీ శరీరములను మార్చు తత్త్వముగలది, ఏలనగా శరీరములు భూమికి శాశ్వతములు కావు కనుక.

## 35. సన్యాసము

341. ఒకడు దేనిపై ఆశను విడనాడునో, వానికి దాని వలన దు:ఖము ఏర్పడదు.
342. అన్ని వస్తువులపై ఆశను వదులుకొని సన్యసించిన వానికి, మనోచింతలేని దీర్ఘకాల సంతోషము, మోక్షము కలుగును.
343. మోక్షము పొందవలెనన్న, పంచేంద్రియ నిగ్రహముతో అన్నిటిపై ఆశలను విడువవలెను.
344. తపస్సు చేయకోరు వారికి ఎందులోనూ ఆశ ఉండరాదు, అట్లు ఆశ ఉండినచో మరలా మోహమునకు దారితీసి అన్నీ చెడును.
345. జన్మమే కోరని వానికి శరీరమే ఒక బరువు, అట్టైనచో ఈ శరీరపు ఆశలు ఎందులకో?
346. "నేను", "నాది" అను తలంపులపై మోహము లేనివాడు మేలైన దేవ లోకమును పొందును.
347. ఆశలను కోరి వాటిని విడువని వానికి, దు:ఖములు వానిని విడువక పట్టుకొనియే ఉండును.
348. ఆశలను పూర్తిగా విడనాడిన వారు అన్ని సంతోషములు పొందుదురు. విడువని వారు మోహముతో మరలా మరలా జన్మమెత్తుదురు.
349. ఆశలు లేనిచో మరో జన్మ లేదు, ఆశలు వదలనిచో ఆగని జన్మ చక్రములో చిక్కుకొనును.
350. ఆశలు విడనాడగోరువాడు, దైవమునందు భక్తితో శరణుపొందినచో, అన్ని ఆశలను చాలా సులభముగా వదలనగును.

# 36. సత్యమెరుగుట

351. సత్యము కాని దానిని సత్యముగా చెప్పుకొనుట, దు:ఖమునకు దారి తీయు జన్మమును కలిగించును.

352. చీకటి అను అజ్ఞానమును తొలగించి సత్యమైన జ్ఞానమును పొందువాడు మహానందమును అనుభవించును.

353. సంశయము లేని సత్యజ్ఞానము పొందిన వానికి, దేవలోకము శీఘ్రముగా ప్రాప్తించును.

354. పంచేంద్రియములను నిగ్రహించిన వాడు సత్యజ్ఞానమును పొందకుండినచో ఏ ప్రయోజనము లేదు.

355. ఒక వస్తువు బాహ్యరూపమున ఎట్లు కనిపించిననూ, దానిలో నిగూఢమైన సత్యరూపమును తెలుసుకొనుటయే అసలైన జ్ఞానమనబడును.

356. గురువు మూలమున నేర్చుకొని సత్యజ్ఞానమును పొందినవారు మరు జన్మ లేని గొప్ప ధర్మ పథమును పొందెదరు.

357. ఒకని మనస్సు నిజమైన సత్యజ్ఞానమును ఆలోచించి, పరమార్థమును తెలుకొనిన యెడల, వానికి మరు జన్మ లేనట్లే అగును.

358. జన్మమునకు కారణమైన అజ్ఞానమును వీడుటకు, మహోన్నతమైన ఎర్రటి ప్రకాశమును చూచుటయే గొప్ప జ్ఞానమగును.

359. ప్రపంచములోని సకల విషయములు అన్నింటికిని మూలమైన దానిని తన వశములో వుంచుకున్న ఆ మహోన్నతమైన సత్యజ్ఞానమును తెలుసుకున్న వానికి ఏ దు:ఖము రాదు.

360. ఆశ, కోపము, అజ్ఞానము – ఈ మూడింటిని సమూలముగా తొలగించుకున్న వానికి ఎటువంటి జన్మబాధ దరిచేరదు.

# 37. ఆశను తెంచుట

361. అన్ని జీవరాశులను అన్ని కాలములలోను విడువక వెంటాడి, మరో జన్మకు కారణ భూతమైనది ఆశయే అగును.

362. ఒక్కటే కోరవలెనన్న అది మరు జన్మ లేకుండుట. దేనినీ కోరకుండుట వలన మరు జన్మ కలుగకుండును.

363. దేనినీ కోరకుండుటయే మహాభాగ్యము, ఆ మహాభాగ్యము కన్న మించిన భాగ్యము మరొకటి లేదు.

364. మనో శుభ్రతకు కారణము ఏ కోరిక లేకుండుటయే, మిగతావన్నియు కోరికల వలన ఏర్పడును.

365. లౌకిక ఆశలను తెంచుకున్న వారే అసలైన ఆశను తెంచుకున్నవారు, మిగతా వారందరూ ఆశలతో బాధలను పొందువారే!

366. ఆశలకు భయపడి వానిని విడనాడుటయే ధర్మము. ఏలననగా ఒకరిని వంచించి చెఱచునది ఆశయే అగును.

367. ఒకడు పూర్తిగా ఆశలను విడనాడినచో, వాని చేతలు కూడ శుభ్రమై వానికి తగ్గట్లు శుభ ఫలితములిచ్చును.

368. ఆశ లేని వానికి దు:ఖము లేదు, ఆశ ఉన్నచో కష్టములు విడువకుండా వచ్చుచూ దు:ఖమును కలిగించును.

369. ఆశ, దు:ఖములన్నిటిలోనూ అధిక దు:ఖతరమైనది. విడనాడినచో ఈ లోకములో సంతోషము వెన్నంటి వచ్చును.

370. నిండుదనము లేనివి తీరని ఆశలు. వానిని విడిచిన వానికి వెంటనే నిశ్చలమైన సంతోషము కలుగును.

## 38. విధి

371. సత్ప్రయత్నముతో ప్రగతిని పొందుటకు, సోమరితనముతో ఏదియూ చేయకుండుటకు కారణము విధియే అగును.

372. సంపద క్షీణించుటకు అజ్ఞానమును, సంపద వృద్ధికి తగు జ్ఞానమును కలిగించునది విధియే అగును.

373. కొన్ని గ్రంథములు చదివి పాండిత్యము పొందినను, తనకు విధి నిర్ణయించిన సొంత జ్ఞానమే నిలచియుండును.

374. ప్రపంచము రెండు వేర్వేరు గుణములతో నిండియున్నది, ఒకటి ఒకనికి సంపదనిచ్చు విధి, మరొకటి జ్ఞానమునిచ్చు విధి.

375. విధి కారణముగా మంచి పనులన్నియూ చెడ్డవిగా మారును, విధి వలన కొన్ని చెడ్డ పనులు చేసిననూ మంచిగా మారును.

376. కష్టపడి సంపాదించిన వస్తువులు విధి వలన కోల్పోవుదురు. వద్దు అని వదులుకున్నవి కూడ విధి వలన సమకూడి వచ్చి చేరును.

377. కోటి సంపదలు కూడబెట్టిననూ, విధి నిర్ణయించిన ఫలమునే అనుభవింపదగును.

378. విధి వశాత్తూ బీదలు కొందరు సన్యసించవలసి వచ్చును. ఏలననగా విధి వలన ఏర్పడిన కష్టములను ఓర్వలేకనే!!

379. విధి వలన కలుగు శుభములతో సంతోషించువారు, చెడు కార్యములు చేసి విధి వలన ఏర్పడు కష్టములకు దు:ఖించుట ఎందులకో?

380. విధి చాలా బలమైనది, తప్పించుకొనుటకు ఎన్ని ప్రయత్నములు చేసిననూ విఫలమై విధి మన ముందుకు వచ్చి నిలబడును.

# అధ్యాయము – 2

# అర్థము

# 39. రాజ ధర్మము

381. బలమైన సేన, మంచి ప్రజలు, సంవృద్ధియైన పంటలు, మంచి మంత్రి, మంచి స్నేహితుడు, భద్రత గలిగిన కోట – ఇవి ఆరు కలిగిన రాజు గొప్ప రాజని పిలువబడును.

382. వీరత్వము, దానము, తెలివి, సడలని పట్టు – ఈ నాలుగు రాజుకి సహజమైన  లక్షణములగును.

383. ఒక రాజు అనువాడు సోమరి తనము లేమి, విద్య, ధైర్యము – అను మూడింటిని ఎన్నటికీ కలిగియుండవలెను.

384. రాజు నీతి,ధర్మమును తప్పక పాటించుచూ, దేశములో ఏ పాప కార్యములు జరుగనివ్వక సైన్య వీర్యము తగ్గ నివ్వక పాలించునదే మంచి రాజు అనబడును.

385. రాజ్యమునకు సంపద వృద్ధియగు మార్గములను తెలుసుకొని, సంపద వృద్ధి చేసి, సంపదను కాపాడి, ప్రజల మంచి కార్యములకు ఉపయోగించు వాడే గొప్ప రాజగును.

386. ప్రజలు రాజును సులభముగా కలుసుకొనునట్లు, ప్రజల వద్ద కఠిన మాటలు మాట్లడకుండా వుండుట రాజును గొప్ప కీర్తి కలిగిన రాజుగా చేయును.

387. ఇంపైన మాటలు మాట్లాడి ప్రజలకు సహాయపడు రాజు, తనకు లోకంలో కావలసినవన్నియూ పొంది కీర్తితో యుండును.

388. నీతి, ధర్మములతో, రాజ్య పరిపాలన చేసి ప్రజలను రక్షించు రాజు దైవ సమానుడనబడును.

389. చెవికి కఠినమైన మాటలైనను, ఓపికతో విని మంచికి తగ్గట్లు నడుచుకొను వినయము గల రాజు గొడుగు క్రిందకు ప్రపంచమే వచ్చి నిలుచును.

390. దానము, ప్రేమ, నీతి ధర్మము, ప్రజలను సంరక్షించుట ఈ నాలుగు గుణములున్న రాజు, రారాజుగా జ్యోతివలె వెలుగొందును.

## 40. విద్య

391. తప్పులు లేకుండా నేర్వవలెను, నేర్వదగినవన్నీ నేర్చిన పిదప వాటికి తగ్గట్లు నడుచుకొనవలెను.

392. అక్షరము అని చెప్పబడునదియు, అంకె అని చెప్పబడునదియు రెండున్నూ ప్రజలకు రెండు కన్నుల వంటివి.

393. విద్య అభ్యసించిన వాడు మాత్రమే కన్నులున్నవాడు, విద్య అభ్యసించని వానికి కన్నులు ముఖములోని పుండ్లు మాత్రమే.

394. కలియునపుడు మనస్సంతోషము, విడిపోవునపుడు మన:క్షోభము కలిగించునదే పండితుల లక్షణము.

395. ధనవంతుని వద్ద బీదలు యాచకమునకు నిలుచునట్లు, విద్యాధికుల వద్ద విద్యార్థులు వినయముతో విద్యనభ్యసించవలెను, అభ్యసించనివాడు తక్కువ వాడే!

396. మట్టిని తవ్వుటచే ఎట్లు ఊట నీరు చేరునో, అట్లే చదువ చదువ తెలివి వృద్ధియగును.

397. విద్యావంతునకు అన్ని దేశములలోనూ గొప్పదనము, అన్ని ప్రదేశములు తన దేశమగును, అట్లైనచో విద్య అభ్యసించకుండుట ఎందులకు?

398. ఒకనికి ఒక జన్మలో నేర్చిన విద్య, వానికి ఏడు జన్మల వరకు తోడుగా వచ్చును.

399. ఒకని విద్య ప్రపంచమునకు సహాయపడి, లాభించునట్లు చేయుటచే, ఆ విద్య మరింత వృద్ధి పొంది అందరినీ విద్యావంతులను చేయును.

400. క్షీణత లేని సంపద విద్య ఒక్కటే, మిగతా సంపదలన్నియూ నిజమైన సంపదలు కావు.

# 41. విద్య లేమి

401. చాలా గ్రంథములు చదివి తెలివిని వృద్ధి చేసుకొనక సభలో మాట్లాడునది ఎట్లనగా గల్లు వేయక చదరంగము ఆడునట్లు.

402. విద్యనభ్యసించక సభలో మాట్లాడునది, రెండు స్తనములు లేని స్త్రీ ఒకరిని ఆకర్షించునట్లు. (హాస్యాస్పదము)

403. విద్యను అభ్యసించిన వారి ముందు నిండు సభలో మాట్లాడని చదువని వారు కూడ గొప్పగానే కనిపించెదరు.

404. విద్యను అభ్యసించనివాడు తెలివైన మాటలు మాట్లాడిననూ, బుద్ధిమంతులు దానిని గొప్పగా గుర్తించరు.

405. చదువనివాడు గొప్పగా మాట్లాడి నటించిననూ, ఆ మాటల వలన చెడుపు కలుగును.

406. చదువని వాడు ప్రాణముతో తిరిగిననూ, ఏ ప్రయోజనము లేని, పైరు పంటలు పండించలేని భూమి వంటి వాడే అగును.

407. గ్రంథపఠన చేసి సూక్ష్మమును ఎరుగని వాని అందము, మట్టితో చేసిన స్త్రీ బొమ్మ అందము వంటిది.

408. విద్యావంతుని వద్దగల బీదరికము కన్నా విద్యాహీనుని వద్దగల సంపద చాలా కష్టములను కలిగించును.

409. ఉత్తమ కులములో పుట్టిననూ విద్యాహీనుడు, తక్కువ కులములో పుట్టిన విద్యావంతుని కన్నా తక్కువవాడే!

410. మృగములు కన్నా మానవుడు ఎంత గొప్పవాడో అట్లే విద్యాహీనుని కన్నా విద్యావంతుడు గొప్పవాడగును.

# 42. వినుట

411. సంపదలకెల్ల గొప్ప సంపద శ్రద్ధగా వినుట, వినుట అన్ని సంపదలకెల్ల చాలా గొప్పదైన సంపద అగును.

412. చెవి ఆకలికి వినుట అనునది లేనపుడే, కడుపు ఆకలికి ఏదైన తినదగును.

413. శ్రవణ (వినుట) జ్ఞానమును పొందినవారు యాగ ఫలమును పొందు దేవతలతో సమానమైన వారగుదురు.

414. స్వీయ గ్రంథపఠనము లేకపోయిననూ, శ్రద్ధగా విని జ్ఞానము సేకరించిన వానికి ఆ జ్ఞానము తన అవసాన కాలములో చేతి కర్రవలె తోడుగా ఉండి కాపాడును.

415. బుద్ధిమంతుల మాటలను వినుట అనునది, జారుడు నేలలో జాగ్రత్తగా నడుచుటకు సహాయపడు చేతికర్ర వంటిది.

416. సత్ప్రవర్తన గలిగిన బుద్ధిమంతుల మాటలను వినుటచే, శ్రద్ధగా వినినంత గొప్పదనమును, మంచిని కలిగించును.

417. చాలా విషయములు ఎరిగిన బుద్ధిమంతులు, కలలో కూడ బుద్ధిలేని విషయములను మాట్లాడరు.

418. శ్రవణ జ్ఞానము ఉన్ననూ, మంచి మాటలు, విషయములను విని గ్రహించలేని వాడు చెవిటి వానితో సమానమే.

419. సూక్ష్మమును గ్రహించే శ్రవణ జ్ఞానము లేనివారు, తెలివైన వినయ మాటలు మాట్లాడలేరు.

420. మంచిని విను చెవి లేక నాలుక రుచినే గొప్పగా తలంచి భుజించువాడు జీవించిన నేమి? జీవించకపోయిన నేమి?

# 43. వివేకము

421. వివేకము ఒకరికి నాశనము కలుగకుండా కాపాడు ఆయుధము వంటిది. శత్రువులు ఛేదించలేని కోట వంటిది.
422. మనస్సుని తనకిష్టమైన దారిలో పోనీయక మంచి, శ్రేయస్సైన దారిలో మాత్రమే వెళ్లునట్లు చేయునది – వివేకము.
423. ఏ విషయమునైననూ, ఎవరెవరి నోటినుండి వినిననూ, ఆ విషయములోని సత్యమును తెలిసికొనుటయే అసలైన తెలివి.
424. ఏ విషయమైననూ వినువారికి అర్థమగునట్లు చెప్పుటయు, ఇతరులు చెప్పిన విషయములోని నిగూఢ సత్యమును తెలిసుకొనుటయే నిజమైన వివేకము.
425. ప్రపంచమునే స్నేహము చేసుకొనుటకు సహాయపడునదియూ, అట్లే సంతోషముతో పొంగిపోవుట, దు:ఖముతో కృంగిపోవుటయు లేనిదే సమబుద్ధి గలిగిన వివేకము.
426. ప్రపంచము ఎట్లు నడుచుచున్నదో, ఆ ప్రపంచముతో కలిసి తానూ అట్లే నడుచుకొనునట్లు చేయునదే – తెలివి.
427. వివేకము గలవారు తమకు జరుగబోవు మంచి, చెడు ముందే గ్రహింతురు. వివేకము లేనివారు వానిని గ్రహించలేరు.
428. భయపడవలసిన విషయములకు భయపడకుండా వుండుట బుద్ధి హీనుల లక్షణము. భయపడవలసిన విషయములకు భయపడుట బుద్ధిమంతుల గుణము.
429. జరుగబోవు దానిని ముందుగానే గ్రహించి, దానికి తగ్గట్లు నడచుకొను బుద్ధిమంతులకు, అకస్మాత్తుగా కష్టములు దరిచేరవు.
430. వివేకము గలవారు అన్నియు గలిగినవారే, వివేకము లేనివారు అన్నీ ఉన్ననూ ఏమీ లేనివారే అగుదురు.

# 44. తప్పులు

431. గర్వము, కోపము, అల్పబుద్ధి లేనివాని సంపద, మిగతవారి సంపద కన్నా చాలా గొప్పదైనది.

432. ఒక రాజునకు దానము చేయని గుణము, ఉన్నత బుద్ధి లేని మానము, మితిమీరిన అల్ప సంతోషము చెడును కలిగించును.

433. నిందకు భయపడువారు, పాపపుణ్యములు చూచువారు తమకు కలుగు చిన్న కష్టములను కూడా పెద్దవిగా తలంచుదురు.

434. తప్పులు పగను పెంచును. కావున తప్పులు జరుగకుండా తమని తాము కాపాడుకొనవలెను.

435. కీడు జరుగక ముందే జాగ్రత్త పడవలెను. ఏలననగా అది నిప్పులో వేసిన గడ్డి మోపువలె నాశనమునకు దారి తీయును.

436. తన తప్పులను ముందే పరిష్కరించుకొని పిదప పరుల తప్పులను పరిష్కరించు రాజునకు ఎటువంటి నింద ఏర్పడదు.

437. ఒకడు ధర్మమైన మార్గము ద్వారా సంపదను వ్యయము చేయనిచో, నిశ్చయముగా ఆ సంపద నశించును.

438. లోభ గుణము అన్ని గుణముల కన్నా చాలా నీచమైనది, చాలా చెడ్డది అగును.

439. తనను తాను ఎన్నటికీ పొగడకూడదు. మంచిని కలిగించని కార్యములను ఎవరు చేసినను ఎన్నడూ మెచ్చుకొనరాదు.

440. కోరినది పొందవలెనన్న ఆశను, ఇతరులకు తెలియకుండా నెరవేర్చగలిగిన సామర్థ్యమున్న రాజుకి, అతనిని వంచించుటకు శత్రువు దగ్గర ఏ మార్గము ఉండదు.

# 45. పెద్దలతోడు

441. ధర్మమెరిగిన పెద్దల యొక్క సహవాసమును, స్నేహమును, మంచినన్నింటిని రాజు గ్రహించి పొందవలెను.

442. కష్టములను నివృత్తి చేసి, అటువంటి కష్టములు మరలా కలుగకుండా రక్షించుట వంటి ఉపాయములు తెలిసిన పెద్దలతో రాజు స్నేహము చేయవలెను.

443. తెలుసుకోవలసిన వన్నింటిలోను ముఖ్యముగా రాజు తెలుసుకోవలసినది, పెద్దల తోడు, సహవాసము పొందుట.

444. పెద్దలు చూపిన ధర్మమార్గములో నడచుకొనుట రాజుకు బలములలో అన్నింటి కంటే బలమైనదగును.

445. రాజ్యభారమును కలిసి మోయగల గొప్ప మంత్రిని రాజు ఎంచుకొని నియమించుకొనవలెను.

446. ధర్మబుద్ధి, సత్ప్రవర్తన కలిగిన పెద్దల మార్గములో నడుచుకొను రాజునకు శత్రువులు ఏ కీడు చేయలేరు.

447. తప్పు జరిగినపుడు దండించు ధైర్యము గల పెద్దల తోడు ఉన్న రాజునకు ఏ శత్రువుల వలన భయము లేదు.

448. తప్పులను చూసి దండించు పెద్దలు లేని సభ కలిగిన రాజ్యము, శత్రువులు లేకుండానే నశించును.

449. వ్యాపారములో పెట్టుబడి లేక లాభము లేదు, అట్లే తోడు, ఆదరణ లేని రాజుకి స్థాన బలము ఉండదు.

450. రాజుకి మంచి పెద్దల ఆదరణ తోడు లేకపోవడము, శత్రువుల విరోధము కన్నా పలురెట్లు ఆపదైనది.

## 46. అల్పులతో చేరకుండుట

451. పెద్దవారు, గొప్పవారు అల్పులతో చేరరు, అల్పులే అల్పగుణము గలవారితో చేరుదురు.

452. వర్షపు నీరు నేలయొక్క రంగు రుచులకు తగ్గట్లు మారును. అట్లే మానవులు కలిసే కలియికల వలన తెలివి, గుణములు మారును.

453. మానవునకు సహజముగా కలుగు తెలివి వున్ననూ, వాడు ఇతరులతో చేయు కలయిక, సహవాసము వలన పెద్దలు 'ఇటువంటి వాడని' నిర్ణయించుదురు.

454. ఒకడు తన మనస్సుకు తగినట్లు అన్నీ చేసిననూ, నిజముగా వాని కలయిక, స్నేహములకు తగినట్లు పనులు మారును.

455. ఒకని మన:శుభ్రత, చేతన శుభ్రత వాడు చేసిన స్నేహము, కలయిక యొక్క శుభ్రత బట్టి యుండును.

456. పరిశుభ్రమైన మనస్సుగల వారికి సంతతి కూడ మంచిగా ఉ ండును. మంచివారితో కలయిక, స్నేహము వలన అన్నింటిని సాధించవచ్చును.

457. మన:పరిశుభ్రత మనిషిని ఉన్నత స్థాయికి చేర్చును, మంచి వారితో చేయు స్నేహము, కలయిక కీర్తిని కలిగించును.

458. బుద్ధిమంతులకు పూర్వ జన్మ సుకృతము వలన మంచి గుణములు ఏర్పడిననూ, మంచివారితో సాంగత్యము మరింత బలమునిచ్చును.

459. మన:పరిశుభ్రత మోక్షమును ఇచ్చును. ఆ మన:పరిశుభ్రత మంచివారితో స్నేహము వలన మరింత బలము పొందును.

460. మంచివారితో చేయు స్నేహము కన్నా ఉత్తమమైనది మరొకటి లేదు, అట్లే చెడ్డవారితో చేయు స్నేహము కన్నా అధోగతి వేరొకటి లేదు.

## 47. కార్య మెరిగి

461. ఒక పని చేయుటకు ముందే, దాని మంచిని, చెడ్డని పసికట్టి దాని వలన కలుగు లాభమును బాగుగా ఎరిగి చేయవలెను.

462. అన్నీ ఎరిగిన పెద్దల సహాయముతో చేయు కార్యములు, ఏ ఆటంకములు లేకుండా సులభముగా ముగియును.

463. ఎక్కువ లాభమునకు ఆశపడి పెట్టుబడినే కొల్పోవు పనులు, బుద్ధిమంతులు ఎన్నటికీ చేయరు.

464. తమకు చెడ్డ పేరు నింద కలిగించు పనులను బుద్ధిమంతులు ఎన్నడూ ప్రారంభించరు.

465. ఫలితములను బాగా ఆలోచించక చేయు పనులు, అనవసరముగా పగ అను పంటను పండించునట్లే అగును.

466. చేయకూడని పనులను చేయుట వలన కీడు, అట్లే చేయవలసిన పనులను చేయకుండినను కీడు సంభవించును.

467. ఒక పని ప్రారంభించుటకు ముందే బాగా ఆలోచించి ప్రారంభించవలెను, "ఆ తరువాత చూచుకుందాము" అన్నచో కీడుయే మిగులును.

468. ముందు ఆలోచన లేక ప్రారంభించిన పనులు, పిదప ఎందరు సహాయం చేసిననూ ప్రయోజనము ఉండదు.

469. వారివారి గుణములను, అవసరములను ఎరగకుండా చేయు పనులు, మంచివి చేసిననూ కీడుగానే మారును.

470. తమతమ స్థానములకు తగని పనులు చేయుటకు లోక ప్రజలు ఇష్టపడరు, కావున లోకములో దూషణ, నింద లేని పనులు మాత్రమే చేయవలెను.

## 48. బల మెరిగి

471. ఒకరు ఎంచుకొను పని దాని యొక్క ఫలితము, తన సామర్థ్యము, ప్రత్యర్థి బలము, తన వివిధ దళముల బలము అన్నింటిని ఆలోచించి చేయవలెను.

472. ఒకరు తన శక్తి సామర్థ్యములను పూర్తిగా ఎరిగి పూర్తి మనస్సుతో చేసినచో, చేయలేని పనులు ఏవియూ లేవు.

473. తన బలమును పూర్తిగా ఎరుగక ఉద్రేకముతో ప్రారంభించిన పనులు ఎన్నో గతములో ఓడిపోయి యున్నవి.

474. పరులు చెప్పు మంచి మాటలు వినక, తనయొక్క బలాబలములు పూర్తిగా తెలుసుకొనక, తనకు తానే పోగడుకొని చేయు పనుల వలన తానే చెడును.

475. చాలా సున్నితమైన నెమలి పింఛముల మోపు అయిననూ, అధికమైన బరువు పెట్టుట వలన బండి చక్రపు ఇరుసున్నూ విరిగిపోవును.

476. వృక్షముపై ఎక్కి కొమ్మ శిఖరమును చేరిన పిదప, మరింత పైకెక్కుట వలన ఒకడు క్రింద పడవలసినదే.

477. ఒకడు తన శక్తి తగ్గట్లు దానము చేయవలెను, అదే అతని సంపదను కాపాడుకొనునట్లు చేయును.

478. ఆదాయము పెంచుకొనుటకు దారి లేకపోయిననూ, ఖర్చును తగ్గించుకొనుటయే ఆదాయమును పెంచుకొనునట్లగును.

479. తన సంపద ఎంతో ఎరిగి, దానికి తగ్గట్లు జీవించవలెను. అట్లు కానిచో, ఉన్నట్లు కనిపించిన సంపద కనుమరుగైపోవును.

480. ఒకడు తన ఆదాయమును మించి, సంపదను దానము చేసినచో, వాని సంపద చాలా శీఘ్రముగా క్షీణించిపోవును.

## 49. కాల మెరిగి

481. తనకన్న బలీయమైన గుడ్లగూబను కాకి పగటి పూటలో జయించును. కావున రాజనువాడు బలమైన వారిని కూడ వారియొక్క బలహీనమైన కాలములో జయించవలెను.

482. కాలమునకు తగ్గట్లు ప్రయత్నము చేయుట, శాశ్వతము కాని సంపదను కూడ స్థిరముగా ఉంచుటకు కట్టు బలమైన తాడు వంటిదగును.

483. కాల మెరిగి ఏ కార్యమైనా చేసినచో, ముగింపు సఫలీకృతము కాకుండా యుండునా?

484. కాల మెరిగి, స్థానమెరిగి ఏ కార్యమునైన చేసినచో, ప్రపంచమునే పరిపాలించుటకు సాధ్యమగును.

485. ప్రపంచమును జయింపకోరు రాజు, దృఢమనస్కుడై సరైన కాలము కొరకు ఓపికతో వేచియుండవలెను.

486. సామర్థ్యమున్ననూ వెనుకంజ వేయుట అన్నది ఎట్లనగా కయ్యమునకు దూకేముందు పొట్టేళ్ళు వెనకడుగు వేసి అదను చూచునట్లు.

487. బుద్ధిమంతులు ఎల్లప్పుడూ ఆత్రుత పడక సరైన కాలము కొరకు కాచుకొని ఓపికతో ఉండి శత్రువులను జయించుదురు.

488. తమకు కాలము కలిసివచ్చు వరకు వేచియుండి, తగిన కాలము వచ్చిన వెంటనే శత్రువులను తలక్రిందులు చేయవలెను.

489. శత్రువులను జయింపగోరు రాజు, తగిన కాలమును ఎరిగి వెంటనే ఆ కార్యమును పూర్తిచేయుటకు ప్రయత్నించవలెను.

490. ఒక కార్యము నెరవేర్చుటకు తగిన సమయము వచ్చు వరకు కొంగవలె ఓపికతో కాచుకొని యుండి, సమయస్ఫూర్తితో చేసినచో తప్పక ఆ కార్యము సాధించవచ్చును.

# 50. స్థాన మెరిగి

491. శత్రువులను జయించగోరు రాజు సరైన స్థానము, సమయం కొరకు వేచి యుండవలెను. అంతకుముందే యుద్ధమును ప్రారంభించకూడదు.

492. ఎంతటి బలమైన రాజుకైననూ, మరింత సామర్థ్యము గలవారి తోడు ఆ రాజునకు కోటవలె బలమును ఇచ్చును.

493. జయించుటకు తగిన స్థానమును ఎరిగి, తనను తన స్థానబలమును తెలిసికొని ప్రయత్నించుట మరింత బలమును కలిగించును.

494. స్థాన బలిమి ఎరిగి చేయు యుద్ధమున, రాజు చాలా బలమైన శత్రువుని కూడ జయింపగలడు.

495. లోతైన నీటిలో మొసలి అన్ని జంతువులను జయించును. కాని నీటిని వీడి నేల మీదకు వచ్చినచో మిగతా జంతువులు దానిని జయించును.

496. ఎంతటి గొప్ప రథమైనను సముద్రములో నడువదు. అదే సముద్రమున వెళ్లు నావ భూమిపై నడవజాలదు.

497. మనోధైర్యముతో, ఎవరి సహాయము లేకుండానే, శత్రువు యొక్క బలమెరిగి వానిని సరైన స్థానములో సంధించినచో, జయింపదగును.

498. పెద్ద సైన్యబలమున్ననూ, చిన్న సైన్య బలము కలిగిన చిన్న రాజుతో వారి రాజ్యములో యుద్ధము చేయుట, ఆపదతో కూడుకున్నదగును.

499. రక్షణతో కూడిన కోట, బలమైన సైన్యము లేకపోయిననూ శత్రువులను వారి దేశ భూమిలో జయించుట చాలా కఠినము.

500. మావటి వానికి అణగని, వీరులను మదించి, చంపు మహాగజమైనను లోతైన బురద నీటిలో చిక్కుకొనిన యెడల, నక్కయే చంపివేయును.

## 51. పరిశీలించి ఎంచుకోనుట

501. ధర్మమెరిగి యుండుట, సంపద వృద్ధికి కర్తవ్యమును వీడక యుండుట, నీతి తప్పని కామము కలిగియుండుట, నీతికై ప్రాణమునైను త్యజించుట, అను నాలుగు గుణములు కలవానిని ఒకరిని ఎంచుకొనవలెను.

502. ఉన్నత కుటుంబములో పుట్టినవాడై, దోషము చేయని, నిందకు భయపడువానిని ఒకరిని బాగుగా పరిశీలించి ఎంచుకొనవలెను.

503. విద్యావంతుడు ఎటువంటి దోషము లేనివాడైనను, పరిశీలించి చూడకుండా వివేకవంతుడని చెప్పజాలము.

504. గుణములను పరిశీలించి, చేయు తప్పులను పరిశీలించి, వానిలో ఏది ఎక్కువగా ఉన్నదో నిశ్చయించి ఎంచుకొనవలెను.

505. గొప్పతనమైనను, చిన్న తనమైననూ, వారు వారు చేయు పనులు నిర్ణయింపబడు గీటురాయి వంటిది.

506. చుట్టరికం, బంధువులపై ప్రేమలేని వాడిని ఎంచుకొనరాదు. ఏలననగా వాడు నిందపొందుటకు, పాపమును చేయుటకు వెనుకాడడు.

507. ప్రేమ మాత్రమే ఉండి తెలివి లేని వానిని ఎంచుకొని వానికి పనులు అప్పగించడము వానిని నమ్మడము రాజునకు తెలివి లేని పనే అగును.

508. తనకు అనుకూలము కాని వాడిని ముఖ్యమైన పనులకు ఎంచుకొనుట వలన, రాజుకు ఆ తరువాత చాలా కష్టములు కలుగును.

509. ఎవరినీ బాగా పరిశీలించకుండా ఒక పనికి ఎంచుకొనరాదు. అట్లే ఎంచుకొని పనులు ఒప్పజెప్పిన పిదప వానిపై సంశయపడరాదు.

510. బాగా పరిశీలించక ఎంచుకొనుట, ఎంచుకొని నియమించిన పిదప వానిపై సంశయపడుట ఈ రెండునూ రాజుకు కష్టములు కలిగించును.

# 52. పరిశీలించి నియమించుట

511. మంచిని, చెడ్డని ఎరిగి బాగుగా పరిశీలించి మంచి చేయువానికే పని బాధ్యతను అప్పగించవలెను.

512. ఆదాయమును అధికరింపజేసి, మౌలిక వసతులను వృద్ధిజేసి, ఆటంకములు సరిజేసి, సామర్థ్యముగా పనిజేయువాడే శ్రేష్ఠుడు.

513. ప్రేమ, తెలివి, సద్బుద్ధి, పేరాశ లేనివాడు ఈ నాలుగు గుణములున్న వాడే పనికి శ్రేష్ఠుడు.

514. పనులకు ఎంచుకొని నియమించిన పిదప, ముందు చాలా గొప్పగా పనులు నిర్వహించి, తరువాత కాలములో వారి సామర్థ్యములు తగ్గిపోవచ్చును.

515. పని చేయుటకు గల సామర్థ్యము, తెలివి చూచి ఒకరిని పనికి నియమించవలెనే కాని "మనకు కావలసిన వాడని" తలచి నియమించుట తగని పని.

516. పని చేయుటకు గల సామర్థ్యము నెరిగి, పని వలన ఏర్పడు మంచిని ఎరిగి, తగిన కాలము ఎరిగి నియమించవలెను.

517. సరైన వాడని తెలుసుకొని ఎంచుకొని, నియమించుకున్న వానికి పూర్తిగా పనులను అప్పగించి వదిలివేయవలెను.

518. పనులను పూర్తిగా నమ్మి నియమించిన వానికి, తన నైపుణ్యము పెంచుకొనుటకు తగిన తర్ఫీదు ఇవ్వవలెను.

519. పనులు చేయుటలో పూర్తిగా లగ్నమై, పట్టు సడలిని దీక్షతో పనులు చేయువాడిని, వాని నడత, సామర్థ్యమును సందేహించు రాజును మహాలక్ష్మియే వీడును.

520. చేయు పనిని, రాజు ప్రతి దినము పర్యవేక్షించడము వలన పనికి చెడు జరుగదు, లోకమునకు చెడు జరుగదు.

# 53. బంధువులు

521. మంచి బంధువులు ఎవరనగా, సంపద పోగొట్టుకున్ననూ వారిపై ప్రేమ తగ్గక ప్రవర్తించు వారే అగుదురు.

522. ప్రేమ తగ్గని బంధువులు ఒకరికి ఉన్నచో, వారు అతనికి సంపద తగ్గని అన్ని అవకాశములను ఏర్పరచుదురు.

523. ప్రేమ లేని బంధువులు ఉన్నవానికి, అన్ని వసతులు ఉన్ననూ అవి గట్టులేని చెఱువు వలె వృధా అయిపోవును.

524. ఒకని సంపద వానికి యిచ్చు ఫలితము, వాని యొక్క బంధువులు వాని దరిచేరి, కలిసి జీవించుటయే.

525. ఇతరులకు ఇచ్చు గుణము, ఇంపైన మాటలు మాటలాడు గుణములున్న వాడి చుట్టూ బంధువులు మూగిపోవుదురు.

526. దాన గుణము, శాంతము కలిగి ఉన్నచో, వాని వంటి బంధువు ఈ లోకములో ఉండడు.

527. కాకికి ఎర దొరికిన వెంటనే తన వారందరిని ఎలుగెత్తి పిలిచి వారితో కలిసి తినునట్లు, బంధువులతో కలిసి తినునది బంధుత్వమును పెంచును.

528. బంధువుల యొక్క స్థానముల నెరిగి, వాటికి తగ్గట్లు ఉప చర్యములు చేయు రాజునకు, బంధువులు అతని వెంట సహాయముగా ఉ ందురు.

529. బంధువులు ఏదో కారణము వలన ఒకరిని వీడి దూరమైనప్పుడు, ఆ కారణము తెలుసుకొని దానిని సవరించుకున్న యెడల, వీడిన వారు మరలా వచ్చి చేరుదురు.

530. కారణము లేకుండా వీడి వెళ్లిన బంధువులు మరలా తిరిగి వచ్చినచో, రాజు తిరిగి వచ్చిన కారణమెరిగి, ఆలోచించి చేర్చుకొనవలెను.

## 54. కర్తవ్యము మరువకుండుట

531. మితిమీరిన సంతోషము వలన కర్తవ్యమును మరచుట, మితిమీరిన కోపము కన్నా చాలా కీడును కలిగించును.

532. ఒకని తెలివిని అతని దారిద్ర్యము చెఱచునట్లు, కర్తవ్యమును మరచిన వాని కీర్తిని ఆ మరుపు చెఱచును.

533. కర్తవ్యము మరచిన వారి కీర్తి చెడును అనునది విద్యావంతులకే కాక లోకములో నున్న వారందరికీ వర్తించును.

534. భయమున్న వాడికి రక్షణ కల్పించడము వలన లాభము లేదు, కర్తవ్యము మరచిన వాడికి శుభము లేదు.

535. కష్టములు ఏర్పడుటకు ముందే గుర్తించుట మరచినవాడు, ఆ కష్టములు వచ్చిన తరువాత చింతించవలసి వచ్చును.

536. కర్తవ్యము మరువని గుణము ఒకని వద్ద ఉన్నచో, దానికి మించిన శ్రేష్ఠమైనది ఏదియూ లేదు.

537. కర్తవ్యము మరువని గుణమను పనిముట్లు ఒకని వద్ద ఉన్నచో, కష్టమైనది, సాధ్యము కానిది ఏదియూ లేదు.

538. వివేకులు చెప్పిన మంచి పనులన్నింటిని మరువక చేయవలెను. మరచి చేయకుండినచో అది ఏడు జన్మల వరకు మంచిని చెఱుపును.

539. కర్తవ్యము చేసి ఫలితము పొందిన సంతోషములో నున్నపుడు కర్తవ్యము చేయక మరచి చెడిన వారిని తలంచవలెను.

540. ఒకడు తను చేయవలసినది మరువక చేసినచో, తను తలంచినవన్నియూ తలంచినట్లే తప్పక నెరవేరును.

## 55. రాజదండము

541. ప్రజలు నేరములు చేసినచో 'కావలసినవాడు' 'కానివాడు' అని పక్షపాతము చూపించకుండా బాగా పరిశీలించి దండన ఇచ్చునదే రాజ ధర్మమగును.

542. ప్రపంచములోని జీవరాశులన్నియూ వర్షము పైనే ఆధారపడినట్లు, ప్రజలు రాజధర్మము తప్పని రాజ్యముపై ఆధారపడియున్నారు.

543. బ్రాహ్మణుని యొుక్క వేదములకు, నీతి ధర్మములకు ఆధారమైయున్నది రాజధర్మమే అగును

544. ప్రజల శ్రేయస్సు కోరి, రాజధర్మముతో, నీతితో పరిపాలించు రాజు పాలన క్రిందకు ప్రపంచమంతయూ వచ్చి శరణుపొందును.

545. నీతి తప్పక, ధర్మమైన పరిపాలన చేయు రాజు ఉన్న దేశములో వర్షము తప్పక కురియును, పైరు పంటలకు కొరత ఉండదు.

546. రాజునకు యుద్ధములో జయము కలిగించునది శూలము మాత్రమే కాదు, తన నీతి, రాజధర్మమే అగును.

547. ప్రపంచమును రాజు కాపాడును. కాని రాజును నీతి, రాజధర్మము తప్పని 'రాజదండము' కాపాడును.

548. పెద్దలతో కలిసి ఆలోచించి రాజధర్మమును నెరవేర్చలేని రాజు అధోగతికి చేరి చివరకు చెడును.

549. ప్రజల శ్రేయస్సు కోరి, కాపాడి, కొన్ని సమయములలో తప్పులు చేసిన వానిని దండించుట అధర్మము కాదు, రాజధర్మమే అగును.

550. క్రూరులను, హత్యనేరస్తులను రాజు చంపి ప్రజలను కాపాడునది, పైరులోని కలుపు మొక్కలను తీసి పారవేసి పంటను కాపాడునట్లే అగును.

## 56. దుష్ట పరిపాలన

551. హత్య చేయుట కన్నా చాలా క్రూరమైనది, ప్రజలకు రాజు యిచ్చు దుష్ట పరిపాలనయే అగును.

552. దుష్ట పరిపాలన చేయు రాజు, ప్రజలను పీడించి వారినుండి పన్నులు వసూలు చేయడము, దోపిడి దొంగలు రాత్రుల్లో వచ్చి దోచుకున్నట్లు.

553. దేశ ప్రజల యొక్క కష్టములు తెలుసుకోకుండా చేయు రాజ్యపరిపాలన క్రమముగా క్షీణిస్తూ వచ్చును.

554. మున్నుందు ఏర్పడబోవు ఫలితములను ఎరగక చేయు రాజ్య పరిపాలన వలన సంపదను, సంపద వృద్ధిచేయు ప్రజలను రాజు పొగొట్టుకొనును.

555. దుష్ట పరిపాలన జరుగు రాజ్యములో ప్రజల యొక్క వేదనలు వారు కార్చు కన్నీరే, రాజ్య సంపదను నశింపజేయు సైన్యముగా మారును.

556. ఒక రాజుకు కీర్తి తెచ్చునది వాని నీతి తప్పని రాజ్య పరిపాలనయే. దుష్ట పరిపాలనతో కీర్తి కలుగదు.

557. వర్షము లేనిచో ప్రపంచములోని జీవరాశులకు కష్టము. అట్లే దయలేని రాజు యొక్క పరిపాలన వలన ప్రజలకు కష్టము.

558. సంపద ఉన్నా అది సంతోషమునివ్వదు. దుష్ట పరిపాలన జరుగు రాజ్యమున సంతోషముండదు.

559. నీతి, రాజధర్మము తప్పి దుష్ట పరిపాలన జరుగు రాజ్యములో ఋతువులు గతి తప్పి వర్షము కూడ కురవదు.

560. రాజు తన మంచి పరిపాలనలో ప్రజలను కాపాడలేకపోయినచో, పాడి పంటలు చెడి, బ్రాహ్మణులు వేదమును మరచి కర్తవ్యము చేయరు.

## 57. కఠిన శిక్ష వేయక

561. నేరము చేసిన వానిని దండించి, మరలా అటువంటి నేరములు చేయకుండునట్లు చర్య తీసుకొనుట రాజ ధర్మమగును.
562. కలకాలము కీర్తితో ఉండవలెనన్న ఆశ ఉన్న రాజు, శిక్షించునపుడు కఠిన శిక్ష విధించున్నట్లు భయము కల్పించి సాధారణ శిక్షతోనే సరిపెట్టవలెను.
563. కఠినమైన శిక్షలు విధించి ప్రజలను హింసించు రాజు, వేగముగా నశించుట నిశ్చయము.
564. తన ప్రజల మధ్య 'కఠిన మనస్కుడని' పేరు పొందిన రాజు యొక్క ఆయుస్సు, కీర్తి త్వరలోనే నశించును.
565. రాజుని, ప్రజలు శీఘ్రముగా దర్శించనివ్వకుండా, దర్శించినా అతడు కఠినమైన ప్రేమలేని ముఖ కవళికలతో నున్నచో, ఆ రాజు అతని సంపద అంతయూ దెయ్యమువలె కనిపించును.
566. రాజు దయా దాక్షిణ్యము లేకుండా కఠినముగా మాట్లాడు వాడుగా ఉన్నచో, వాని మహా సంపద అంతయూ పెరగక తరిగిపోవును.
567. కఠినమైన మాటలు, చేసిన నేరములకు కఠినమైన శిక్షలు విధించుట రాజు కీర్తిని దిగజార్చుటకు రంపముల వలె మారును.
568. రాజు సరైన రీతిలో ఆలోచించక, మంత్రులతో కలిసి వారి సలహా తీసుకొనక, జరిగిన తరువాత కోపము తెచ్చుకొనిన యెడల వాని కీర్తి, సంపద నాశనమగును.
569. యుద్ధము రాక ముందే సరైన రక్షణ కల్పించుకోలేని రాజు, యుద్ధము వచ్చిన తరువాత ఓడిపోవుట నిశ్చయము.
570. విద్యావంతులు, జ్ఞానుల యొక్క సలహాలను వినక రాజ్యపరిపాలన చేయు రాజు భూమికి భారము అగును.

# 58. దయా దాక్షిణ్యము

571. దయా దాక్షిణ్యములను గొప్ప విలువైన గుణములు ప్రజలలో ఉండుట వల్లనే ఈ ప్రపంచము నిలకడగా వర్ధిల్లుచున్నది.

572. ప్రపంచము యొక్క గమనము దయా దాక్షిణ్యములతో జరుగుట వలన అవి లేకపోతే భూమికి భారము అగును.

573. రాగ, తాళములు కుదరకపోతే, పాట లేనట్లు, దయాదాక్షిణ్యములు లేని కళ్ళతో ఫలితము లేదు.

574. దయా దాక్షిణ్యములు లేని కళ్ళు ముఖములో ఉండి ఏమి లాభము?

575. కళ్ళకు ఆభరణములు దయాదాక్షిణ్యములే, దయాదాక్షిణ్యములు లేని కళ్ళు, ముఖమునకు వట్టి పుండ్లు మాత్రమే అగును.

576. దయా దాక్షిణ్యములు లేని కళ్ళు గలవాడు, పండ్లులేని వట్టి వృక్షము వంటి వాడగును.

577. దయా దాక్షిణ్యములు లేనివాడు కళ్ళు లేనివాడే. కళ్ళున్న వారని అనవలెనన్న దయా దాక్షిణ్యములు అను గుణములున్న వారే.

578. కార్యము చెడిపోకుండా దాక్షిణ్యము చూపువారే రాజ్య మేలుటకు అర్హత ఉన్నవారగుదురు.

579. దండింపదగిన వాని యెడ కూడ దాక్షిణ్యము చూపు ఓర్పు గలరాజు చాలా శ్రేష్ఠమైన సంస్కృతి గుణము గలవాడగును.

580. అందరూ తనను ఇష్టపడవలెనన్న తనకు విష ఆహారము ఇచ్చిన స్నేహితునిపై కూడా దాక్షిణ్యము చూపి భుజించువాడుగా ఉండవలెను.

# 59. గూఢ చర్యము

581. శ్రేష్ఠమైన గూఢచర్య, శ్రేష్ఠమైన రాజనీతి గ్రంథము, ఇవి రెండు రాజునకు రెండు కళ్ళు వంటివి.

582. అందరివి, అన్ని విషయములు, అప్పటికప్పుడు గూఢచర్య ద్వారా వెంట వెంటనే తెలుసుకొనుట రాజు యొక్క అతి ముఖ్యమైన పని అగును.

583. గూఢచారుని ద్వారా సేకరించిన విషయములను రాజు బాగుగా ఆలోచించి చర్య తీసుకోని యెడల జయము పొందలేడు.

584. 'గూఢచారి' అన్నవాడు రాజు, సభలోనివారు, వారి బంధువులు, స్నేహితులు మొదలైన వారందరి చర్యలను రహస్యముగా గమనించువాడుగా ఉండవలెను.

585. ఒక గూఢచారి సందేహము గలగని మారు వేషములో ఎవ్వరికి భయపడని వాడుగాను, ఎటువంటి సమయములోనూ నోరు విప్పి రహస్యమును చెప్పనివాడుగాను ఉండవలెను.

586. సన్యాసి వలె, వ్రతము బూని ఏ ఆశయు లేని వానివలె, క్లిష్టమైన సమయములో కూడ రహస్యమును బయట పెట్టనివాడే సరైన మంచి గూఢచారి అగును.

587. ఇతరులకు తెలియకుండా గూఢముగా ఉండి విని, వినిన రహస్యములోని సత్యమును ఎరిగి, సంశయము లేక నిర్ధారణ చేసుకొనువాడే శ్రేష్ఠమైన గూఢచారి.

588. ఒక గూఢచారి ద్వారా సేకరించిన విషయమును, మరొక గూఢచారి ద్వారా ఋజువు చేసుకొనుట రాజ ధర్మమగును.

589. ఒక గూఢచారి ద్వారా కాక అదే విషయమును ముగ్గురు గూఢచారుల ద్వారా సేకరించి నిజమును రాజు తెలుసుకొనవలెను.

590. శ్రేష్ఠమైన గూఢచారిని రాజు సన్మానించుట రహస్యముగానే చేయవలెను. అట్లు కానిచో రాజు తనకి తానే గూఢచారిని బహిరంగము చేసినట్లగును.

# 60. ప్రయత్నించు ఉత్సాహము

591. అన్నీ కలవాడు అన్నచో ప్రయత్నించు ఉత్సాహము గలవాడే అగును, ప్రయత్నించని వాడు ఎన్ని ఉన్ననూ లేనివాడే అగును.

592. ప్రయత్నించువాడే నిలకడైన సంపద పొందగలవాడు, వస్తు సంపదలన్నియూ శాశ్వతము కాని సంపదలే అగును.

593. "ప్రయత్నము" అను సంపద గలిగినవారు, వస్తు సంపద పోయిననూ చింతించరు.

594. దృఢమైన ప్రయత్నించు ఉత్సాహము గలవానికి సంపద వెన్నంటి వచ్చి అతని దరి చేరును.

595. నీటి నిలువకు గుర్తు, తేలుచున్న పూవు యొక్క కాడ పొడవగును, అట్లే ప్రజల యొక్క అభివృద్ధికి గుర్తు వారివారి ఉత్సాహవంతమైన ప్రయత్నము అగును.

596. ఉన్నతమైన ఆశయములకు ప్రయత్నించవలెను, అది జరుగకపోయిననూ ప్రయత్నములను విడువరాదు.

597. బాణములు గుచ్చుకొన్ననూ ఏనుగు మరింత ధృడముగా పోరు సల్పునట్లు, ఓడిననూ ప్రయత్నము మానుకొనక మరింత దృఢముగా ప్రయత్నించవలెను.

598. ప్రయత్నము చేయని వానికి ఈ ప్రపంచములో సంపద, జయము, కీర్తి ఏవియూ గలుగవు.

599. ఎత్తైన రూపము, బలమైన దంతములున్న ఏనుగు, దానిని ఎదిరించుటకు తీవ్ర ప్రయత్నము చేయు పులిని చూచి భయము చెందును గదా!

600. ఉత్సాహవంతమైన దృఢ ప్రయత్నమే ఒకనికి మహా బలము అగును. ప్రయత్నము చేయని వారు వృక్షముల వంటి వారే అగుదురు.

## 61. సోమరితనము

601. కుటుంబము అను ఆరని దీపము, సోమరితనము అను మసితో మందగించి మందగించి తుదకు ఆరిపోవును.

602. కుటుంబము గొప్పగా వర్ధిల్లవలెనన్న, సోమరితనమును తన నుండి పూర్తిగా పొగొట్టుకొనవలెను.

603. సోమరితనమును విడువక తన వద్ద ఉంచుకున్నవాడు, వాని కుటుంబము, తాము నశించవలసిన దానికంటె ముందే నశించిపోదురు.

604. కుటుంబ గౌరవము వృద్ధికి ఏమీ చేయక, సోమరితనములో పడినవాడికి గౌరవము చెడి నేరములు అధికమగును.

605. సోమరితనము, ఆలస్యము, మరచిపోవుట, మితిమీరిన నిద్ర – ఇవి నాలుగు ఆత్మహత్యకు సమానమైన విరిగిన పడవ ప్రయాణము వంటివి.

606. భూమి అంతయూ పరిపాలించు సంపన్నత, సహాయమున్ననూ, సోమరితనము గలవాడు దాని ఫలమును అనుభవించలేడు.

607. సోమరితనముతో ఎటువంటి ప్రయత్నము చేయనివాడు, అందరి వద్ద అవమానము, హేళన, మాటలు పడవలసి వచ్చును.

608. ఒకని వద్ద సోమరితనమున్నచో, అది వానిని తన శత్రువుల వద్ద కూడ బానిసగా చేసివేయును.

609. ఒక కుటుంబముపై అంతకు ముందే యున్న నింద, నేరములు కూడ సోమరితనము లేని ప్రయత్నము వలన పోగొట్టుకొనవచ్చును.

610. సోమరితనము లేని రాజుకు, వామనుడు ముల్లోకములను తన పాదముతో ఆక్రమించినట్లు లోకమంతయూ అతని వశమగును.

# 62. దృఢ ప్రయత్నము

611. కష్టమైన కార్యమని తలంచి, మొదలు పెట్టిన పనిని విడువరాదు. తన ప్రయత్నమే పనిని ముగించు సామర్థ్యమును, ప్రశంసను ఇచ్చును.

612. మొదలు పెట్టిన పనిని ముగించే తీరవలెను. ఏలననగా పనిని ముగించని దానిని ఈ ప్రపంచము విడిచివేయును.

613. మరొకరికి సహాయము చేయవలెనన్న మేలైన గుణము, తీవ్ర ప్రయత్నము చేయువాని యందే అమరియుండును.

614. ప్రయత్నము చేయకుండా ఇతరులకు సహాయము చేయుట అనునది, వీరత్వములేని పేడి వాని వద్ద కత్తి యున్నట్లే అగును.

615. తన సుఖము కోరక, కష్టములు వచ్చిననూ ప్రయత్నము వీడనివాడు తన బంధువుల కష్టములనూ తీర్చి ఆదుకొని స్తంభమువలె నిలబడును.

616. ప్రయత్నము సంపదను వృద్ధి చేయును. ప్రయత్నము లేకపోయినచో అది సోమరితనమునకు, బీదరికమునకు దారి తీయును.

617. దరిద్ర దేవత సోమరి ఒడిలో యుండును. లక్ష్మీదేవి ప్రయత్నించువాని ఒడిలోనికి తానే వచ్చి చేరును.

618. అదృష్టము కలుగకపోవుట ఒకనికి నింద కాదు. కాని అన్నీ తెలిసి ప్రయత్నము చేయని సోమరి తనమే నిందయగును.

619. విధి వశమున అపజయము గలిగిననూ, చేసిన ప్రయత్నము వలన శరీర కష్టమునకు తగ్గట్లు ఫలితము దొరుకును.

620. మనస్సుని దిగజారనీయక దృఢ ప్రయత్నము చేయువారు తమ విధిని కూడ జయించగలరు.

# 63. ఆటంకములు

621. ఆటంకములు కలిగినపుడు సంకోచించక సంతోషించవలెను. వాటిని ఎదుర్కొని జయము పొందుట మహానందమును కలిగించును.

622. వరదవలె కష్టములు వచ్చిననూ మనో దృఢము గలవానికి ఆ కష్టములు తొలగిపోవును.

623. కష్టములకు దు:ఖించనివారు, ఆ కష్టములనే దు:ఖించునట్లు చేయుదురు.

624. అవరోధము దాటి బండిని లాగు ఎద్దువలె, మనోదృఢముతో ఉన్నవాడికి కష్టములు తమంతట తామే తొలగిపోవును.

625. వదలకుండా ఎదురయ్యే అవరోధములకు బెదరక, తీవ్ర ప్రయత్నముతోనూ, మన:సంకల్పముతోనూ ఉన్నవానికి, కష్టములు అవే దూరమగును.

626. మనోదృఢముతో ఉన్నవారు సంపద కలిగినపుడు సంతోషము, కష్టములు కలిగినపుడు దు:ఖము లేక యుందురు.

627. శరీరమునకు కష్టములు సహజమని తలంచిన బుద్ధిమంతులు తమ కష్టములకు చింతించరు.

628. సంతోషమునకు పొంగిపోకుండా, కష్టమునకు కృంగిపోకుండా రెండూ సహజమని తలంచువాడు ఎన్నటికీ దు:ఖించడు.

629. సంతోషమునకు సంతసించనివాడు, కష్టములకు కూడా దు:ఖించడు.

630. తన ప్రయత్నములో ఎదురయ్యే కష్టములను సంతోషముతో స్వీకరించువాడు శత్రువులచే కూడ కొనియాడబడును.

# 64. మంత్రిత్వము

631. పనికి కావలసిన పనిముట్లు, పని మనుషులు, కాలము, చేయు పద్ధతి, ఎదురయ్యే ఆటంకములు, వానిని దాటే మార్గము అన్నింటినీ ఎరిగినవాడే మంత్రి.

632. ధైర్యముగలవాడు, గౌరవమైన కుటుంబము నుంచి వచ్చినవాడు, ప్రజల శ్రేయస్సు కోరువాడు, నీతి, ధర్మశాస్త్ర జ్ఞానము గలవాడు తీవ్ర ప్రయత్నము చేయువాడు ఈ ఐదు గుణములు గలవాడే శ్రేష్ఠమైన మంత్రి.

633. శత్రువుని యొక్క స్నేహితులను విడదీయుట, తన స్నేహితులు విడిపోకుండా చూచుకొనుట, తమనుండి విడిపోయిన వారిని తిరిగి తమ దగ్గరకు చేర్చుకొనుట – ఇవి అన్నియూ మంత్రి యొక్క గుణములగును.

634. ఒక పనిని సరిగా చేయుటకు తగిన నేర్పు, సమర్ధవంతముగా పనిని పూర్తి చేయుట, తప్పొప్పులను విశదీకరించి ధైర్యముగా చెప్పు నేర్పు – అన్నియూ ఉన్నవాడే మంచి మంత్రి.

635. రాజధర్మ మెరిగి, సంపూర్ణ జ్ఞానము నిండిన మాటలతో, ఎప్పటికప్పటి పనులలో నేర్పరితనముతో తగిన మంచి ఆలోచనలు చెప్పువాడే మంత్రి.

636. ఎత్తులను గ్రహించు సూక్ష్మ బుద్ధి, గ్రంథపఠనమున్న వానిముందు ఎటువంటి శత్రువు యొక్క కుట్రయూ పని చేయదు.

637. శ్రేష్ఠమైన, తెలివిగల మంత్రి, గ్రంథపఠనముతోనే కాక, సమకాలీన లౌకిక మార్గములను అనుసరించి వాటికి తగ్గట్లు నడుచుకొనవలెను.

638. ఒక రాజుకి, బుద్ధి చెప్పిననూ ఆయన వినకుండా, రాజు తగిన రీతిగా, తెలివిగా ఆలోచించకుండా ఉండినచో, రాజుని వీడక, మంచిని నచ్చచెప్పుటయే మంత్రి యొక్క ధర్మమగును.

639. రాజుకు తోడుగా ఉండి కుట్ర చేయు మంత్రి, రాజు డెబ్బది కోట్ల శత్రువులను ఎరుర్కొనుటయే మేలు.

640. సరైన పద్ధతిలో చేయుటకు సామర్థ్యము, మనోదృఢము లేనివారు అవసరము కొరకు ప్రారంభించిన ఏ పనిని జయప్రధముగా ముగించలేరు.

## 65. మాటల చాతుర్యము

641. అన్ని అందములకన్న గొప్ప అందము, మాటల అందమే అగును.

642. మంచి, చెడులు మనము మాట్లాడే మాటల వల్లనే ఏర్పడును. మాటల వలన ఇతరులకు కీడు జరుగకుండా నాలుకను అదుపులో ఉంచుకొనవలెను.

643. వినిన వారిని తన్మయ పరుచునవి, విననివారిని వినుటకు ఆశక్తి కలిగించునవియు శ్రేష్ఠమైన మాటలు అగును.

644. మాట్లాడుటకు ముందే మాటల అర్ధము, వాటి ఫలితము, కాలము, స్థానము, వినువాని పరిస్థితి ఎరిగి మాట్లాడినచో దానికన్నా శ్రేష్ఠమైన ధర్మము, ఫలమూ మరొకటి లేదు.

645. మాట్లాడునప్పుడు శ్రేష్ఠమైన మాటలనే ఉపయోగించవలెను. దానికన్నా మంచి మాటలను ఉపయోగించి ఉండవచ్చుననే తలంపు ఆ తరువాత రారాదు.

646. ఇతరులు ఇష్టపడునట్లు మాట్లాడుట, ఇతరుల మాటల నుండి తానూ మంచి వాటినే తీసుకొనుట మంచి గుణములగును.

647. సామర్ధ్యవంతముగా మాట్లాడు వానిని, మాటకు తగిన నిలకడ యున్నవాడిని, మరొకరి వాదనకు భయపడని, వానిని మాటల యుద్ధములో జయించుట చాలా కఠినము.

648. చెప్పవలసిన వాటిని సరైన వరుస క్రమములో పెట్టి ఇంపైన మాటలతో మాట్లాడు సామర్ధ్యమున్నవాని మాటలను లోక ప్రజలు వెంటనే విందురు.

649. సూక్ష్మముగా, తేటతెల్లముగా మాట్లాడుట తెలియనివారు ఎన్నో మాటలతో విశదీకరించి మాట్లాడుదురు.

650. తాను నేర్చుకొన్నది ఇతరులకు వివరించి చెప్పలేని వాడు, పూచిన పువ్వులున్ననూ వాసన లేని పూవుల గుత్తు వంటి వాడగును.

# 66. సత్కర్మము

651. ఒకనికి సహాయ బలమున్నచో అది జయమునూ, సంపదను ఇచ్చును. కాని సత్కర్మములు కోరినవన్నింటినీ ఇచ్చును.

652. కీర్తిని, శ్రేయస్సుని ఇవ్వని పనిని వెంటనే విడువవలెను.

653. ప్రగతిని కోరువారు, కీర్తిని పాడుచేయు ఏ కార్యము చేయరాదు.

654. తమ పనులలో ఏవో ఆటంకములు కలిగినవని వానిని నివృత్తి చేయుటకు బుద్ధిమంతులు ఎటువంటి నీచ కార్యములు చేయరు.

655. ఒక పని చేసిన తరువాత చింతించుట కంటే అది చేయకుండా వుండుట మేలు. మరలా అటువంటి పనులు చేయకూడదు.

656. కన్నతల్లి ఆకలిని తీర్చుటకైననూ బుద్ధిమంతులు, నిందమోపే చెడ్డ కార్యములను చేయరు.

657. నింద, పాపములు చేసి సంపాదించిన గొప్ప సంపదతో జీవించే జీవితము కన్నా, సాత్వికముగా జీవించు బుద్ధిమంతులు బీదరిక జీవితమే గొప్పది.

658. బుద్ధిమంతులు, ఇవి కూడని పనులని తలంచి విడిచినవన్నింటిని ఒకడు విడువక చేసినచో మొదట అవి లాభించిననూ, తుదకు కీడునే కలిగించును.

659. పరులను పీడించి పొందిన సంపద, పొందిన వాడిని దు:ఖింపజేపి నశించిపోవును. మంచి మార్గమున పొందిన సంపద చివరి వరకూ నిలుచును.

660. చెడ్డ మార్గమున సంపాదించిన సంపదను కాపాడుకొనుట ఎట్లనగా, కాల్చని పచ్చి మట్టి కుండలో నీరు పోసినట్లే!!

# 67. కార్యదీక్ష

661. ఒక కార్యమును చేసి ముగించుట, వాని మనోధృడమునకు సంబంధించియుండును. మిగత ఉపకరణములన్నియూ అంత ముఖ్యము కావు.

662. కార్యము చేయునపుడు ఎదురయ్యే ఆటంకములను నివృత్తి చేయుటయు, తనకు కష్టములు కలిగినపుడు మనోధృడముతో ఉండుటయు, ఈ రెండింటిని వివేకుల ధర్మమని పెద్దలు చెప్పుదురు.

663. ఒక కార్యమును ప్రారంభించి ముగించునంత వరకు, ఆ కార్యము గురించి ఇతరులు తెలుసుకొనరాదు. అట్లు తెలిసికొనినచో ఆ కార్యమునకు కీడు గలుగును.

664. ఒక కార్యమును చేయు విధానము చెప్పుట సులభము, విధానము ప్రకారము కార్యమును చేసి ముగించుట అన్నది చాలా కఠినము.

665. కార్యదీక్షతో, మనో ధృఢముతో కార్యమును చేసి ప్రశంస పొందిన వారిని రాజు గుర్తించిన యెడల వారికి మరింత ప్రతిష్ఠ, కీర్తి కలుగును.

666. ఒక కార్యమును ముగించుటకు కార్యదీక్షతో మనోధృఢముతో ప్రయత్నించు వారికి, వారు తలంచినట్లే పూర్తిగా జయము పొందుదురు.

667. పెద్ద రథము నడుపుటకు చక్రములోని ఇరుసుసీల ఎంతో ముఖ్యము. అట్లే రూపము మాత్రమే చూచి ఎవరినీ చిన్నవారని తలంచరాదు.

668. మంచి కార్యమని తలంచి మొదలుపెట్టిన దానిని, మధ్యలో విడువక అచంచలమైన మనస్సుతో ఆ కార్యమును శీఘ్రంముగా ముగించవలెను.

669. కష్టములు ఎన్ని ఎదురైననూ, ఆఖరున సుఖము నిచ్చునను భావముతో మనోధృఢముతో కార్యమును చేసి ముగించవలెను.

670. చేయు కార్యములో కార్యదీక్ష లేని వారిని, వారిలో ఎన్ని ప్రత్యేకతలు ఉన్ననూ ఈ లోకము గుర్తించదు.

# 68. కార్య విధానము

671. కార్యము నెరవేర్చుటలో ఆలోచనకు ముగింపు దూకుడు. దూకుడుగా ప్రారంభించిన కార్యమును ఆలస్యముగా పూర్తి చేయుట కీడుని కలిగించును.

672. మెల్లగా చేయవలసిన పనులలో ఆలస్యము చేయవచ్చును. కాని త్వరగా చేయవలసిన పనులలో ఆలస్యము పనికి రాదు.

673. సమయము కలసి వచ్చిన వెంటనే కార్యమును ముగించవలెను. సమయము అనుకూలము కానప్పుడు దాని కొరకు వేచియుండవలెను.

674. ఒక కార్యమునుగాని విడువవలసిన పగను గాని వెంటనే ముగించవలెను, లేని యెడల అవి ఆరని అగ్నివలె, తరువాత ఆపదను కలిగించును.

675. ఒక కార్యము ముగించుటకు మూలవస్తువులు, ఉపకరణములు, తగిన కాలము, తగిన చోటు, చేయు విధానము ఈ ఐదింటిని సందేహము లేకుండా ఎరిగి చేయవలెను.

676. ఒక కార్యము ముగించుటకు తగిన విధానము, ఎదురయ్యే ఆటంకములు, వాటిని నివృత్తి చేసుకొను మార్గములు, పొందబోవు గొప్ప ఫలితములను ఎరిగి చేయవలెను.

677. ఒక కార్యము పూర్తి చేయుటకు, ఆ కార్యములో అనుభవమున్న వారి సలహా తప్పకుండా తీసుకొనవలెను.

678. ఒక ఏనుగు ద్వారా ఏనుగును పట్టుకొనునట్లు, ఒక కార్యము చేయునపుడే దానికి సంబంధించిన వాటినన్నింటినీ పూర్తి చేసుకొనవలెను.

679. మిత్రులకు ఎక్కువగా సహాయము చేయుటకంటే, శత్రువులను వీడిన వారిని తమ ప్రక్కకు చేర్చుకొనుట చాలా ప్రయోజనమగును.

680. చిన్న రాజులు సహాయమునకు, ప్రజల భీతిని పోగొట్టుట కొరకు, పెద్ద రాజులను బలమైన వారిని ఎదిరించుట, కష్టములను కలిగించునని తలచి సౌమ్యముగా ప్రవర్తించవలెను.

# 69. రాయబారము

681. ప్రేమగలవాడు, ఉన్నత కుటుంబములో పుట్టినవాడు, రాజులు కోరు మంచి వినయము గలవాడే రాయబారమునకు అర్హుడగును.

682. ప్రేమ, తెలివి, స్పష్టముగా చెప్పగలిన సామర్థ్యము ఈ మూడున్నూ రాయబారిగా వెళ్లువానికి ఉండవలసిన అతి ముఖ్యమైన గుణములు.

683. శత్రు రాజుల వద్దకు వెళ్లి జయప్రదముగా తన రాజు కోరినది తెలివిగా చెప్పగల నేర్పు, రాజనీతి శాస్త్రములు బాగా ఎరిగిన వాడుగా యుండవలెను.

684. తెలివి, గంభీరమైన ఆకర్షణగల రూపు, బాగుగా విద్యనభ్యసించి వుండుట ఈ మూడు రాయబారికి ఉండవలసిన లక్షణములు.

685. విషయములను వివరించి చెప్పుటలో నేర్పరితనము, కఠినమైన పదజాలము వాడకుండా ఇంపైన మాటలాడి తన ప్రభువుకు శుభము జరుగునట్లు చేయుటయే రాయబారి సామర్థ్యములు.

686. విద్యావంతుడు, శత్రురాజు కోపము చెందిననూ భయపడక, కాలానుగుణముగా విషయములను వివరించి చెప్పువాడే నేర్పరియైన రాయబారి.

687. రాయబారము చేయు విధానమెరిగి, కాలమెరిగి, తన స్థానము ఎరిగి విషయములను మాట్లాడువాడే శ్రేష్టమైన రాయబారి.

688. సాత్విక వినయము, పగవారిని కూడ స్నేహము చేసికొను సామర్థ్యము, భయపడకుండా వుండుట, సత్యము పలుకుట మంచి రాయబారి లక్షణములు.

689. రాయబారి (తనకు వేయబడే శిక్షకు భయపడి) తన రాజుకు కీడు కలిగించు ఎటువంటి విషయములనూ బయటికి చెప్పరాదు.

690. తాను చెప్పబోవు విషయము వలన తనకు కీడు జరుగబోవునని తెలిసిననూ భయపడక, తన రాజుకు శుభము కలుగు విషయములనే చెప్పువాడే సరైన రాయబారి.

# 70. రాజుతో మెలగుట

691. మరీ దూరముగా వుండక, మరీ సన్నిహితముకాక, మంట చుట్టు నిలబడి చలి కాచుకొన్నట్లు, రాజువద్ద నున్నవారు అతనికి దూరముకాక దగ్గరకు రాక ఉండవలెను.

692. రాజు ఆశపడిన వాటిపై తానూ ఆశపడక యుండిన వానికి, రాజు వల్లనే తనకు అన్ని సంపదలు కలుగును.

693. రాజునకు కోపము గలిగించకుండా జాగ్రత్తగా మెలగవలెను. లేనియెడల రాజు యొక్క సందేహము, కోపము తీర్చుట కఠినమగును.

694. రాజు సభలో వున్నపుడు పరుల చెవిలో రహస్యముగా మాట్లాడడమో, పరులతో కూడి నవ్వడమో చేయరాదు.

695. రాజు మరొకరితో మాట్లాడునపుడు దానిని చాటునుండి వినుటయో, దాని గురించి తెలుసుకొనుటకు ప్రయత్నము చేయుటయో తగదు.

696. రాజు యొక్క మనస్సును గుర్తించి, సమయమెరిగి రాజుకు ఇష్టము కానిది ఏది? ఇష్టమైనది ఏదని గ్రహించి వినయముతో నచ్చచెప్పవలెను.

697. రాజుకు శుభము కలిగించునవియు, అతనికి ప్రియమైన విషయములు మాత్రమే చెప్పవలెను, ఇష్టము కానివి తానడిగిననూ చెప్పరాదు.

698. రాజు "తనకన్నా చిన్న వాడనియు, తనకు బంధువనియు" తలంచి అతనిని చులకనగా చూడరాదు, రాజు యొక్క పదవి, స్థానమెరిగి అతని యెడ గౌరముగా మెలగవలెను.

699. "రాజునకు చాలా దగ్గరివారమైతిమి" అన్న తలంపుతో అతనికి ఇష్టము కాని కార్యములను బుద్ధిమంతులు ఎన్నటికీ చేయరు.

700. "రాజునకు మనము పాత సన్నిహితులము" అని తలంచి తగని కార్యములు చేసినచో, అవి చాలా కీడును కలిగించును.

# 71. గుర్తెరుగుట

701. రాజుయొక్క అభిప్రాయమును అతను చెప్పకుండానే, అతని ముఖ కవళికల బట్టి గ్రహించగల సామర్థ్యమున్నవాడు, సముద్రముతో ఆవరించిన ఈ లోకమునకు ఆభరణమువంటి వాడు.

702. ఒకరి మనస్సులో ఉన్నది నిస్సందేహముగా గుర్తించు సామర్థ్యమున్న వానిని దైవ సమానునిగా గౌరవించవలెను.

703. మరొకరి మనస్సును గుర్తించగల సామర్థ్యమున్న వారిని, వారి అవసరములకు తగిన వస్తువులు ఇచ్చి, రాజు తన తోడుగా ఉంచుకొనవలెను.

704. రాజు యొక్క సలహాదారులలో ఇతరుల మనస్సెరుగు సామర్థ్యమున్న వారు శ్రేష్ఠులు. తక్కిన వారందరూ సామాన్యులే!!

705. ఇతరుల చూపుల్లో ప్రతిబింబించే వారి స్వభావాన్ని కనిపెట్టలేని కళ్లు ప్రయోజనము లేనివే అగును.

706. మెరుపు రాళ్లు తమ ప్రక్కన ఉన్న వస్తు ఉనికిని తెలియజేయునట్లు ఒకని మనస్సులో ఉన్న తలంపులను వాని ముఖము తెలియజేయును.

707. ఒకని మనస్సులోని సంతోషమును, దు:ఖమును వెంటవెంటనే ప్రతిబింబించు ముఖము కంటే వేరొకటి ఏదైనా ఉన్నదా?

708. ముఖ కవళికలు చూచి కష్టములు పసిగట్టి, ఆ కష్టములను నివృత్తి చేయువాడు ఎదుట నిలబడితే, ఆ కష్టములన్నీ తొలగిపోవును.

709. మనస్సును చదవగల సామర్థ్యమున్నచో, పగను, స్నేహమును వెంటవెంటనే కళ్లలో చూచి పసిగట్టవచ్చును.

710. ఒకని యొక్క మనస్సును తెలియజేయు సూక్ష్మ కొలమానము వాని కళ్లు. కళ్లు తప్ప మరేమియూ లేదు.

## 72. సభనెరిగి మాట్లాడుట

711. బాగుగా మాట్లాడగల మంచి నేర్పువున్న వారు, సభనెరిగి, ఆలోచించి రసవంతముగా మాట్లాడవలెను.

712. మాట్లాడుటలో నేర్పరి అన్నచో, మాటల విధములెరిగి, పదములలో తప్పులు దొర్లకుండా చూచి, సభనెరిగి, బాగుగా ఆలోచించి, సమయమెరిగి మాట్లాడువాడే.

713. సభనెరగక, వినువారి గుణము నెరగక మాట్లాడు వాని మాటల వలన నేర్చుకున్న చదువు కూడ వానికి ఉపయోగపడదు.

714. విద్యావంతులున్న సభలో గొప్ప విద్యావంతుల శైలిలోనూ, తెలివిలేని ప్రజలున్న సభలో అమాయకముగానూ మాట్లాడవలెను.

715. తనకన్నా అధిక విద్యావంతులున్న సభలో అన్నీ తెలిసిన వానిగా మాట్లాడకుండా వుండువాడు మంచి గుణము, లక్షణమున్న వాడగును.

716. గొప్ప విద్యావంతుడై ఉండి, నిండు సభలో సరైన పదజాలముతో కాకుండా తప్పులతో మాట్లాడువాడు, తన స్థానము తప్పి దిగజారినవాడే అగును.

717. గొప్ప విద్యావంతుడు అన్నచో, అభ్యసించిన విద్యకు తగ్గట్లు తప్పులు దొర్లక మాట్లాడువాడే అగును.

718. గొప్ప విద్యావంతుల వద్ద వారెరిగిన విషయములనే చెప్పుట తమకు తామే ఎదుగు చెట్లకు నీరుపోయునట్లే అగును.

719. గొప్ప విద్యావంతులున్న సభలో బాగుగా మాట్లాడుట తెలిసిన నేర్పరి, అదే శైలిలో సామాన్య ప్రజల ముందు మాట్లాడరాదు.

720. తనవలె విద్యావంతులు కాని వారివద్ద గొప్ప విషయములను చెప్పుట, మురికి కాలువలో పోసిన అమృతము వంటిదే అగును.

# 73. సభలో భయము లేమి

721. మంచి మాటల కూర్పుతో, సభలోని వారి స్థితి ఎరిగి మాట్లాడువారు, మంచి మాటల చాతుర్యమున్నవారు. పొరపాటున ఏదీ మాట్లాడరు.

722. గొప్ప విద్యావంతులను ఒప్పించునట్లు చేయువాడే, విద్యావంతులందరిలోనూ చాలా మెరుగైన వాడగును.

723. యుద్ధములో భయము చెందక పోరాడి ప్రాణత్యాగము చెసిన వారెందరో ఉండవచ్చును, కాని గొప్ప విద్యావంతులున్న సభలో భయము చెందక మాట్లాడువారు కొందరే!!

724. ఒక గొప్ప విద్యావంతుడెవరనగా, తన మాటలు ఇతరుల మనస్సులో పదిలము చేయుటయేకాక, వారి వద్దనుండి మంచివన్నింటిని గ్రహించువాడే అగును.

725. సభలో ప్రశ్నించు ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పగలిగి సామర్ధ్యము కలిగి ఉండునట్లు ఒకరు పూర్తి విద్యను అభ్యసించవలెను.

726. ధైర్యములేని పిరికివానికి కత్తితో పనిలేనట్లు, సభలో ధైర్యముగా విషయము చెప్పలేనివానికి గ్రంథ పఠనముతో పనిలేదు.

727. సభలో మాట్లాడుటకు భయపడు వాని చేతిలోని గ్రంథము, పిరికివాడి చేతిలోని కత్తి వంటిది.

728. గొప్ప విద్యావంతుడైనను, నిండు సభలో మాట్లాడుటకు భయపడువానికి గ్రంథపఠనముతో ఏ లాభమూ చేకూరదు.

729. గొప్ప విద్య కలిగియున్ననూ, సభలో మాట్లాడుటకు భయపడువాడు విద్యాహీనులలో అధముడగును.

730. విద్యనభ్యసించియున్ననూ, సభలో భయపడి మాట్లాడలేని వాడు బ్రతికి యున్ననూ ప్రాణములేని వానికి సమానమగును.

# 74. దేశము

731. క్షీణతలేని పైరు పంటలు, ధర్మాత్ములు, క్షీణించని సంపద ఉన్న దేశమే దేశము.

732. అభివృద్ధియైన సంపదను పొరుగు దేశస్థులు చూచి కోరునట్లున్నూ, ఆ సంపద ఏ కారణము వలనైనా క్షీణించకుండా ఉండవలెను.

733. పొరుగు దేశముల వలన ఏర్పడు వలసలను భరించి, తన ప్రజల యొక్క అవసరములను పూర్తిచేయు దేశమే సుభిక్షమైన దేశమగును.

734. తీరని ఆకలి, నయముకాని రోగములు, ఆరని పగ లేని దేశమే శ్రేష్ఠమైన దేశము.

735. కలహములు, ద్రోహచర్యలు, వెంట ఉండు అంతర్ పగ, రాజు శిరస్సుకే ముప్పు తెచ్చు హంతకులు లేని దేశమే గొప్ప దేశము.

736. శత్రువుల వలనకాని, ప్రకృతి వలనగాని కీడు ఏర్పడిననూ, క్షీణించని సంపద కలిగిన దేశమే శ్రేష్ఠమైన దేశము.

737. బావి, చెరువు, నదుల నీటి సంపదయు, జలపాతములు, వర్షములు కురియు కావలసిన పర్వతములు, రక్షణకు బలమైన కోటయు దేశము యొక్క అంగములగును.

738. వ్యాధులు లేకుండుట, సంపద, పాడి పంటలు, సంతోషకరమైన జీవనము, దేశరక్షణ ఈ ఐదు దేశమునకు ముఖ్య ఆభరణములగును.

739. ప్రజల యొక్క అన్ని అవసరములు తీర్చు దేశమే దేశము, అట్లుకాని దేశము దేశమేగాదు.

740. ఒక దేశము మంచి రాజును పొందలేనిచో, పైన చెప్పిన సదుపాయములు అన్ని పొందిననూ ప్రజలకు ప్రయోజనముండదు.

# 75. కోట

741. శత్రువులు తమపై యుద్ధము చేయుటకు వచ్చిన యుద్ధమునందు శత్రువుల బారినుండి తమను కాపాడుకొనుటకు సహాయపడునదే కోట.

742. ముత్యము వలె తేటనైన మంచి నీటితో నిండిన తటాకము, పర్వతము, దట్టమైన అడవి, అభేద్యమయిన కోటముందు విశాలమైన పచ్చటి మైదానము దేశ రక్షణకు ప్రాధానమైనవి.

743. ఎత్తైనదియు, చాలా విశాలమైనదియు, మహాబలమైనదియు, శత్రువులు ఛేదించలేనిదియు శ్రేష్ఠమైన కోటయని రాజనీతి శాస్త్రము చెప్పుచున్నది.

744. రక్షించుకోవలసిన ప్రదేశము చిన్నదైననూ, ఎత్తైన విశాలమైన ప్రాకారము కోటకు ఉండవలె, ఏలననగా అది శత్రువుల ధైర్యమునకు, ప్రయత్నమునకు భయము పుట్టించును.

745. ఒక కోట, శత్రువులు జయించలేనిదిగాను, లోపల ఉన్నవారికి అన్ని వసతులు కల్పించగలిగినది గాను ఉండవలెను.

746. కోట లోపల అన్ని వసతులు ఉన్ననూ, శత్రువులతో యుద్ధము చేయునపుడు ఆ వసతులను కాపాడుకొను మంచి రక్షకులను పొందియుండవలెను.

747. శత్రువులు సమీపించి ముట్టడించిననూ అభేద్యముగాను, లోపలనున్న వారిని శత్రువులు కనిపెట్టలేకుండా కోట అమరియుండవలెను.

748. ముట్టడించిన వారిని మట్టుబెట్టుటయు, లోపలికి ప్రవేశించిన వారిని ఎదిరించి బంధించుటకు తగినట్లుగా కోట యుండవలెను.

749. యుద్ధములో శత్రువులను నాశనము చేయునదియు, శత్రువులకు తెలియని లోపలి రహస్య మార్గములున్నదే శ్రేష్ఠమైన కోటయగును.

750. ఎటువంటి బలమైన కోట యున్ననూ, దానిని కాపాడు రక్షకులు శ్రేష్ఠమైన వారుగా లేకపోయినచో ఆ కోట వలన ప్రయోజనము లేదు.

# 76. సంపద యొక్క తత్త్వము

751. లేనివారిని కూడ గొప్ప గౌరవనీయులుగా చేయునది సంపద ఒక్కటే తప్ప మరొకటి కాదు.

752. సంపద లేనివారిని అందరూ ఛీదరించుకుందురు. సంపద ఉన్నవారిని అందరూ గౌరవించెదరు.

753. సంపద గలవాడు ఎక్కడకు వెళ్లిననూ అతని సంపద, చీకటిని పారద్రోలు దేదీప్యమాన జ్యోతివలె అతనికి దారిచూపును.

754. ధర్మమార్గమున సంపాదించిన సంపద దానధర్మము చేయుటకు ఉపయోగపడును, మరియు సౌఖ్యమును కూడ ఇచ్చును.

755. మంచి మార్గమున వచ్చిన సంపద, ప్రేమతో ఇచ్చిన సంపద తప్ప మిగతా సంపదలను స్వీకరించరాదు.

756. ఒక రాజునకు తన సొంత వంశ సంపద, ప్రజల నుండి వచ్చు పన్ను, శత్రువులను జయించగా వచ్చిన సంపద అన్నియూ రాజ సంపదలగును.

757. ప్రేమయను తల్లి ఆశీస్సులు పొందిన బిడ్డ, సంపద అను పెంపుడు తల్లిచేత పెంచబడుచున్నది.

758. ఒకని వద్ద సంపద ఉన్నచో, వాడు కొండ మీద కూర్చొని ఏనుగుల పోరు చూచుట వంటిది.

759. కష్టపడి సంపద కూడబెట్టవలెను, ఏలననగా ఆ సంపద పగవారిని జయించు శూలము కంటే చాలా పదునైనది.

760. మంచి మార్గమున కూడబెట్టిన సంపద వలన దానధర్మముల చేయుట సుఖము పొందుట సులభతరమగును.

# 77. సైన్య బలము

761. చతుర్విధ సైన్యము, ఆటంకములకు బెదరని సైనికులు కలిగి ఉండుట రాజుకి అన్ని సంపదలలోని గొప్ప సంపద అగును.

762. క్లిష్ట పరిస్థితులలో యుద్ధమున ఓడిపోయిననూ, తమ ప్రాణములకు తెగించి రాజుకు రక్షణగా నిలుబడువారు బాగుగా తర్ఫీదు పొందిన కీలక సైనికులే అగుదురు.

763. ఎలుకల సైన్యము ఎంత ఉండిననూ ఏమి లాభము? పాము ఒక బుస కొట్టినచో అన్ని ఎలుకలు ప్రాణభయముతో పరుగెత్తి పారిపోవును.

764. యుద్ధములో చెదరిపోకుండా, రాజుయందు ప్రేమతో ధైర్యముగా ఎదిరించి పోరాడు సైన్యమే శ్రేష్ఠమైన సైన్యమగును.

765. యముడు ఎదురై పోరు చేసిననూ భయపడక ఎదిరించి పోరు సలుపు సైన్యము గొప్ప సైన్యము అగును.

766. వీరత్వము, ఆత్మ గౌరవము, ముందు సైనికుల యొక్క మార్గ దర్శకమును పాటించుట, రాజుపై నమ్మకము అనునది నాలుగు సేనకు లక్షణములగును.

767. శత్రు సైన్యము తమ మీదికి దండెత్తి వచ్చినపుడు దానిని దీటుగా ఎదిరించి నిలువరించడము, వారి ముట్టడిని చీల్చి చెండాడి, వారిని నాశనము చేయడము గొప్ప సైన్య లక్షణములగును.

768. ఆత్మ రక్షణ, ఎదిరించి శత్రువులను చంపు సామర్థ్యము లేకున్ననూ, సైన్యము యొక్క గంభీరమైన అలంకరణ పరిమాణము శత్రువులకు భీతి కలిగించును.

769. సైన్యములో బీదరికము లేక, రాజుయందు ప్రేమ తగ్గక, సైన్యబలము కృశించక ఉండినచో ఆ సైన్యము తప్పక శత్రువులను జయించును.

770. సైనిక వీరులు ఎంత బలముగా, ధీరముగా యున్ననూ వారిని నడిపించు సైన్యాధిపతి సామర్థ్యము లేనివాడైచో ఏ ప్రయోజనమూ ఉండదు.

## 78. సైన్య పరాక్రమము

771. ఓ శత్రువులారా!! యుద్ధములో ఎందరినో చంపి మరణ చిహ్నములు ఏర్పరచిన మా రాజుని ఎదిరించి మీరు యుద్ధము చేయజాలరు.

772. అడవి కుందేలును వేటాడి చంపుట కంటే, ఏనుగుతో యుద్ధము చేసి ఓడుట శ్రేష్ఠము.

773. ధైర్యముగా యుద్ధము చేయుట మగతనము. కాని శత్రువుని క్లిష్ట పరిస్థితులలో దయచూపుట అంతకంటే శ్రేష్ఠమైనది.

774. చేతిలో ఉన్న శూలమును ఏనుగుపై విసిరేసిన పిదప, మరొక శూలము దొరకక, తన ఛాతిలో గ్రుచ్చుకొనివున్న శూలమును బయటకు తీసి విసురుట మహా వీరత్వము.

775. శత్రువులు కోపముతో విసిరిన శూలమును ఎదిరించక, కళ్ళు మూసుకొనునది భీరత్వము అగును.

776. వీరునికి యుద్ధమునందు గాయములు ఏర్పడని రోజులన్నియూ, తన జీవితములో వృధాగా గడిపిన రోజులే అగును.

777. కీర్తినిచ్చు వీర విజయము కోరక, ప్రాణము దక్కించుకొని జీవింపగోరు వీరుడు, కాలికి గజ్జలు కట్టుకొన్నట్లే.

778. యుద్ధములో తమ ప్రాణములకు తెగించి యుద్ధము సలుపు వీరులు, తమ రాజు వద్దని వారించినా కూడ వినక యుద్ధము చేయుదురు.

779. శపథము చేసి యుద్ధమునందు వీరమరణము పొందిననూ, శపథము నెరవేరలేదని ఎవ్వరూ అనరు.

780. తమకు రక్షణ ఇచ్చి ఇన్నాళ్ళు జీవింపజేసిన రాజుకు కన్నీరు కార్చునట్లు జేసిన వీరుని వీర మరణము పుణ్యలోకము పొందుటకు అర్హత గలది.

# 79. స్నేహము

781. స్నేహము చేసుకొనుటకు తగిన అంశములు ఏవి? రక్షణ కల్పించుకొనుటకు తగిన అంశములు ఏవి అని తెలుసుకొనవలెను.

782. బుద్ధిమంతులతో చేయు స్నేహము చంద్రుని శుక్లపక్ష దినముల వంటిది. చెడ్డవారితో చేయు స్నేహము కృష్ణపక్ష దినముల వంటిది.

783. మంచి గ్రంథములు చదువ చదువ మరింత సంతోషమిచ్చునట్లు, మంచివారితో స్నేహము వారితో మెలగ మెలగ సుఖమునిచ్చును.

784. స్నేహము యొక్క లక్షణము నవ్వి సంతోషించుటకు మాత్రమే కాదు, స్నేహితుడు తప్పు చేయునపుడు దానిని ఖండించి బుద్ధి చెప్పుట కూడ.

785. ఎపుడూ ఒక్కటిగా ఉండి కలిసి మెలగడము అవసరము లేదు, ఒకే విధమైన మనోభావ లక్షణములు స్నేహమునకు చాలును

786. బయటకు నవ్వి మాట్లాడుకొనుట స్నేహము కాదు, హృదయ పూర్వక ప్రేమతో కలిసి ఒక్కటైపోవడమే స్నేహము.

787. స్నేహితున్ని చెడ్డ మార్గమున వెళ్లనివ్వక తప్పించి, మంచి మార్గమును చూపించి, వానికి ఎదురుచూడని కష్టములు వచ్చినపుడు తోడుగా ఉండడమే స్నేహమగును.

788. శరీరముపై నుండి వస్త్రములు తొలగినపుడు చేతులు ఎంత త్వరగా కదులునో, అట్లే స్నేహితునికి కష్టములు వచ్చినపుడు త్వరగా వెళ్లి ఆదుకొనుటయే నిజమైన స్నేహము.

789. స్నేహమునకు ఆఖరి సరిహద్దు ఏదనగా, ఏ కారణముతోనైనా స్నేహము వీడక నిలకడగా, ఆఖరి వరకు తోడుగా ఉండునదే.

790. "ఇతను నాకింత స్నేహమని" ఒకరినొకరు పొగడుకొనుట, స్నేహమునకు నీచమగును.

## 80. స్నేహమును పరీక్షించుట

791. స్నేహము చేసిన తరువాత విడిపోవుట చాలా కష్టము. కాబట్టి స్నేహము చేయుటకు ముందే అన్నీ పరీక్షించి స్నేహము చేయవలెను.

792. బాగా పరీక్షించకుండా చెడ్డవారితో చేసిన స్నేహము వలన శత్రువులు లేకుండానే కష్టములు కలుగును.

793. ఒకరి యొక్క గుణము, లోపములు, కుటుంబము, తోడుగాయున్న బంధువులు అన్నింటిని పరిశీలించిన తరువాత స్నేహము చేయవలెను.

794. మంచి కుటుంబములో పుట్టిన వానిని, పరుల నిందకు భయపడు వానిని ఎట్టైననూ, ఏదైన ఇచ్చియైననూ స్నేహము చేసుకొనవలెను.

795. ఇతరులు దు:ఖించునట్లు చేయు పనులను ఖండించి, లోకమునకు తగ్గట్లు నడుచుకొను వానిని చూచి ఎంచుకొని స్నేహము చేయవలెను.

796. కష్టములు కలుగుట మంచిదే. ఏలననగా స్నేహితులు ఎట్లు సహాయమునకు వచ్చి ఆదుకుందురో, అదే స్నేహమునకు సరైన కొలమానమగును.

797. ఒకనికి లాభము కలుగుట ఎట్లనగా, బుద్ధిలేనివారి స్నేహమును, వారిని వీడుటయే అగును.

798. మన ఉత్సాహమును చెడగొట్టుటకు కారణమైన పనులు చేయువారితో, కష్టములు కలిగినపుడు మనల్ని విడిచిపెట్టి వెళ్లువారితో స్నేహము చేయరాదు.

799. తనకు ఆపద కలిగినపుడు తమ స్నేహమును వీడి వెళ్లువాడు తను చనిపోయినపుడు తలచుకొన్ననూ తన మరణ బాధ కన్నా, చెడ్డ స్నేహము తలంచి కృంగిపోవును.

800. కీడు చేయలేని మంచివారి స్నేహమును పెంచుకొనవలెను. తనకు తగనివారి స్నేహమును వారికి ఏదైనా ఇచ్చియైన తెంచుకొనవలెను.

# 81. పాత స్నేహము

801. పాత స్నేహము అనునది ఏదనగా, చిన్న చిన్న తప్పులు జరిగిననూ వానిని పట్టించుకొనక ఓర్చుకొనుటయే అగును.

802. స్నేహమునకు ముఖ్యాంగము, స్నేహమను హక్కుతో చేసిన పనులను సహించుకొనుట. అదే స్నేహమునకు ఒప్పుకొని బలమునిచ్చునది.

803. పాత స్నేహితుడు, స్నేహమనే హక్కుతో చేసిన పనులను తిరస్కరించడము స్నేహము వలన లాభమేమిటి?

804. స్నేహమనే హక్కుతో తనను అడగకుండా చేసిన పనులను కూడ మంచి స్నేహితుడు ఇష్టపడి ఒప్పుకొనును.

805. తనకు ఇష్టముకాని పనులు స్నేహితుడు చేసిననూ, స్నేహమను హక్కుతో తెలియక చేసిన తప్పే అని మంచి స్నేహితుడు సరిపెట్టుకొనును.

806. ప్రగాఢమైన స్నేహముగల స్నేహితులు వారిలో ఒకరి వలన కీడు కలిగిననూ ఆ పాత స్నేహమును విడువరు.

807. ప్రియమైన స్నేహితుల మధ్య వారి స్నేహమును నాశనము చేసే కీడు జరిగిననూ దాని పట్టించుకోక, స్నేహమును క్షీణింపజేయకుందురు.

808. స్నేహితుడు చేయు కీడును పరులు తన వద్దకు వచ్చి చెప్పిననూ దానిని పట్టించుకొనక, ఓపికతో ప్రశంసించు రోజే ఒక శుభ దినమగును.

809. పాత స్నేహితులు తమ తప్పొప్పులను సహించి, స్నేహము వీడక మసలుకొనుటను లోకమే కోరును.

810. పాత స్నేహితులు తప్పులు చేసిననూ వాటిని ఒర్పుతో సహించు కొనువారిని, శత్రువులు కూడ స్తుతించుదురు.

# 82. చెడు స్నేహము

811. ప్రేమవలె నటించి సంతోషమిచ్చునది సంస్కారములేని స్నేహము. అటువంటి స్నేహమును పెంచుకొనుట కంటే తగ్గించుకొనుట మంచిది.

812. అవసరమున్నపుడు స్నేహము చేయుట, అవసరము తీరినపుడు దానిని వీడుట వంటి గుణములున్న స్నేహము ఉన్నా ఏమి? లేకపోయినా ఏమి?

813. స్నేహము వలన లాభము పొందుటకు ఎదురు చూచువారు, వేశ్యలు, దొంగలతో సమానమైన వారే.

814. యుద్ధములో భయపడి తనపై ఎక్కిన వారిని గుర్రము క్రిందికి త్రోసివేసి పరుగెత్తునట్లు, ప్రయోజనము లేని వట్టి స్నేహము కంటే, ఒంటరి తనమే మేలు.

815. స్నేహము చేసిన పిదప రక్షణ కవచమువలె ఉండవలసిన స్నేహము లేనిచో, అటువంటి స్నేహము ఉండుట కంటే లేకుండుటయే మేలు!!

816. బుద్ధిహీనులతో స్నేహము చేయుటకంటే, బుద్ధిమంతునితో స్నేహము లేకుండిననూ అది కోటి రెట్లు మేలే.

817. నవ్వికవ్వించుట మాత్రమే చేయగల స్నేహము కంటే, శత్రువుల వలన ఏర్పడు కష్టములు పదికోట్ల రెట్లు శ్రేయస్కరము.

818. చేయగలిగిన పనిని కూడ తనవల్ల కాదని చెప్పు స్నేహమును వెంటనే విడిచిపెట్టవలెను.

819. మాటలు వేరు, చేతలు వేరుగా ఉన్న స్నేహము కలలో కూడ దు:ఖమును కలిగించునదే!!

820. ఒంటరిగా ఉన్నప్పుడు తనముందు మంచి మాటలాడి, ఇతరులముందు పరోక్షముగా తనను దూషించువాని స్నేహము వెంటనే వీడుట చాలా శ్రేష్ఠము.

# 83. తగని స్నేహము

821. మనసార స్నేహములేక, పైకి మాత్రము స్నేహితుడుగా మారి నటించువాని స్నేహము, సమయము చూచి కష్టపెట్టు రోకలి దెబ్బ వంటిది.

822. మనస్సులో పగ, బయటికి స్నేహముగా నటించువాని స్నేహము బజారు స్త్రీ వలె రెండు మనుస్సులు గలది.

823. కొన్ని మంచి గ్రంథములు చదివియున్ననూ, నిజమైన ప్రేమ మనస్సులో లేనివాడు నిజమైన స్నేహితుడు కాజాలడు.

824. ముఖమున నవ్వు, మనస్సున వంచించు దుర్బుద్ధి గలవాని స్నేహమును వాటికి భయపడి వెంటనే విడిచిపెట్టవలెను.

825. మన:పూర్వకమైన స్నేహము లేనివారి మాటలు, చేతలు ఏ సమయములోనూ నమ్మశక్యము కానివి.

826. స్నేహితుని వలె బయటకు మంచి మాటలు చెప్పినను, ఒక వంచన పరుని మాటలు వెంటనే గ్రహించవచ్చును.

827. మన ఎదుట ధనుస్సు వంగినచో మనపై బాణము తప్పక వచ్చునన్నట్లు, వంచకుని యొక్క నయమైన మాటలు ఎప్పటికైనను కీడు కలిగించునదే!!

828. నమస్కరించుటకు జోడించిన అరచేతులలో మరణ ఆయుధము ఉన్నట్లు, శత్రువుని కన్నీళ్ల వెనుక ఆ వంచన దాగి ఉండును.

829. మనస్సులో పగ, బయటికి స్నేహముగా నటించువారితో తామూ అట్లే వారితో స్నేహముగా ఉన్నట్లు నటించి వారిని విడిచి పెట్టవలెను.

830. శత్రువులు స్నేహితులవలె కోరి మన వద్దకు వచ్చినచో, మనమూ అట్లే ఆ స్నేహమును మొదట అంగీకరించి తరువాత విడిచి పెట్టవలెను.

# 84. మూర్ఖత్వము

831. మూర్ఖత్వము అనునది ఏదనగా, కీడును కలిగించు పనులను కైకొని, మంచి పనులను విడిచిపెట్టుటయే.

832. ఇతరులకు కీడుని కలిగించు పనుల యందే ఆసక్తిని కనపరచుట పరమ మూర్ఖత్వమగును.

833. నిందకు బయపడకుండుట, మంచి పనులు చేయకుండుట, ప్రేమ లేకుండుట, లక్ష్యముతో ఏ పని చేయకుండుట మూర్ఖత్వ పనులగును.

834. బాగా విద్యనభ్యసించి, పరులకు ఉపదేశించి, తాను మాత్రము ఏదీ పాటించకుండుట పరమ మూర్ఖత్వమగును.

835. ఒక మూర్ఖుడు, ఒక జన్మలో చేయు తప్పులు, తనకు ఏడు జన్మల వరకు కష్టములను కలిగించును.

836. చేయు పద్ధతి తెలియని మూర్ఖుని పనుల వలన కీడు కలుగును. తానూ చెడును.

837. మూర్ఖునికి సంపద వచ్చినచో, దానిని మరొకరెవరో అనుభవింతురు. కాని అతనూ, అతని బంధువులూ ఆకలితో ఉందురు.

838. మూర్ఖునితో స్నేహం ఒక మంచి వస్తువు దొరికినచో, పిచ్చివాడు కల్లు త్రాగిన మైకములో తూగిపడునట్లుండును.

839. మూర్ఖునితో స్నేహము చాలా మంచిది, ఏలనగా ఆ స్నేహమును వీడునపుడు మనకు ఎటువంటి దు:ఖము కలుగదు.

840. విద్యావంతులున్న సభలో మూర్ఖుని ప్రవేశము ఎట్లనగా బురద కాలుతో పడక గదిలోనికి ప్రవేశించునట్లే అగును.

# 85. అజ్ఞానము

841. దారిద్ర్యముల కెల్ల పరమ దారిద్ర్యము అజ్ఞానము, మరే సంపద లేకపోయిననూ జ్ఞానము లేకపోతే బుద్ధిమంతులు గుర్తింపరు.

842. బుద్ధిలేనివాడు ఒకనికి ఒక వస్తువు ఇచ్చినచో, తీసుకొనువానికి వాని అదృష్టమే అని గుర్తించవలెను.

843. బుద్ధిలేనివాడు తనకు తానే చేసుకొను కీడు, శత్రువులు కూడ తనకు అంతటి కీడు చేయలేరు.

844. అజ్ఞానము అనునది ఏమనగా, బుద్ధిలేనివారు తమకు అన్నీ తెలుసునన్న అహంకారమే.

845. కొన్ని గ్రంథములు చదివినట్లు నటించి చదవనివాడు, నిజముగా చదివియున్ననూ, చదువరులు దానియందు కూడ సంశయము పొందుదురు.

846. అజ్ఞానులు తమయందున్న లోపములను సవరించుకోకుండా, వాటిని పై వస్త్రములతో కప్పిపుచ్చుకొనుట బుద్ధిలేని తనమే అగును.

847. మంచి బుద్ధులను విని జ్ఞాపకము ఉంచుకొని దానిని వినియోగించనివాడు, తనకు తానే కీడునుకోరి తెచ్చుకొనును.

848. మంచిని తాను తెలుసుకొనక, బుద్ధిమంతులు చెప్పు మాటలను వినక జీవించు బుద్ధిలేనివాడు, తన ప్రాణము పోవునంత వరకు, భూమికి ఒక రోగమే.

849. బుద్ధిలేని వాడిని బుద్ధిమంతునిగా జేయుటకు ప్రయత్నించుట ఒక మూర్ఖత్వమే. బుద్ధిలేనివాడు తాను పొందినదే గొప్పదని తలచి అందరివద్ద మెలగును.

850. గొప్ప బుద్ధిమంతులు "ఉన్నదని" ఎరిగి, గుర్తించి చెప్పు దానిని "లేదని" చెప్పు హీనులు, శరీరమున్ననూ జీవములేని దెయ్యము వంటివారే!!

## 86. పగ

851. అన్ని జీవులయందు ప్రేమను విడదీసి విరోధమును పెంచునదే పగ.

852. విడదీసి, కీడు కలిగించి, చేయదగిన పనులు చేసిననూ, వాని మార్పిడికి ఎటువంటి కోపము చూపక తిరిగి కీడు చేయకుండుట చాలా గొప్ప గుణమగును.

853. తన మనస్సులోని మార్పిడి పగ అను అవగుణమును తీసివేసినచో, వానికి క్షీణతలేని కీర్తి దక్కును.

854. దు:ఖములకెల్ల ఘోర దు:ఖమును కలిగించు మార్పిడైన పగను విడిచినచో, సుఖములకెల్ల మహాసుఖము కలుగును.

855. మనస్సులో క్రోధమును కలుగనీయక, పగను విడచిన వారిని ఎవరు జయించగలరు?

856. క్రోధ గుణము మంచిదని తలంచి పగను పెంచుకొని జీవించువాడు తన బ్రతుకును కోల్పోయి తన ప్రాణమునకు ముప్పు తెచ్చుకొనును.

857. పగను కోరు బుద్ధిహీనులు, జయము పొందుటకు కారణమైన మంచి మార్గముల గురించి తెలియనివారే!!

858. క్రోధమును పుట్టనీయకుండా ఎదిరించి నిలబడినచో అది ప్రగతికి దారి. పెంచుకొనినచో అది కీడుకి దారి చూపును.

859. ప్రగతి సాధించినపుడు పగ గుణము ఏర్పడదు. అట్లే కీడు కలిగినపుడు పగను ఎదిరించి నిలబడవలెను.

860. ఒకని పగ, క్రోధము అన్ని కష్టములను కలుగజేయును. వాటికి బదులు క్రోధములేని మంచి నడత వలన మహానందమను గొప్ప మేలు కలుగును.

# 87. శత్రు బలము

861. తనకంటే బలమైన వానితో పగజేసుకొనక విడవవలెను. కాని తన కన్నా శక్తి హీనుని పగను తీర్చుకొనవలెను.

862. బంధువులపై, స్నేహితులపై ప్రేమ లేనివాడు, సహాయమునకు తోడు లేనివాడు, తాను బలహీనుడైనచో శత్రువులను ఎట్లు జయించగలడు?

863. భయపడవలసిన దానికి భయపడక, నేర్చుకొనవలసినది నేర్చుకొనక, ఇతరులతో కలిసి మెలగక, ఇతరులకు ఏదీ ఇవ్వక వుండు వానిని శత్రువులు సులభముగా జయించుదురు.

864. కోపమును విడువలేనివాడు, మనోదృఢము కాపాడుకోలేని వాడు, ఎవరిచేనైనా ఏ కాలములోనైనా జయింపబడును.

865. మంచి మార్గమును ఎన్నుకొననివాడు, మంచి పనులు చేయనివాడు, నిందకు భయపడనివాడు, వినయము లేనివాడు శత్రువులచే సులభముగా జయింపబడును.

866. పరిస్థితులు ఎరగక కోపము తెచ్చుకొనువానితోనూ, మితిమీరిన కామము గలవానితోనూ శత్రుత్వము చాలా సులభము, గెలువగలరు.

867. కార్యము మొదలు పెట్టిన తరువాత దానికి తగ్గట్లు జరుగనివ్వని శత్రువుని ఏదైన వస్తువు ఇచ్చియైనను వాని పగను తీర్చుకోనవలెను.

868. సద్గుణములు లేనివానికి నేరములు, తప్పులు పెరుగుటచే సహాయమునకు ఎవరూ రారు. అవే శత్రువునకు జయము కలిగించును.

869. బుద్ధిలేని వానితో, ధైర్యములేని వానితో శత్రుత్వము చాలా సులభముగా జయింపదగును.

870. అజ్ఞానముతో ఉన్నవానికి, కోపిష్టికి, ఎదిరించి పోరాడవలెనన్న ప్రయత్నము చేయని వానికి, ఎన్నటికీ కీర్తి కలుగదు.

## 88. శత్రుత్వము తెలుసుకొనుట

871. శత్రుత్వమను వివేకములేని కీడును ఏ ఒకరు నవ్వులాటకైననూ చేయరాదు.

872. బాణమును సంధించు వీరునితో శత్రుత్వము కన్నా వివేకవంతుల మాటల బాణమును ఎదుర్కొనుట చాలా కఠినము.

873. ఏ తోడు లేక ఒంటరిగా ఉంటూ పలువురితో శత్రుత్వము తెచ్చుకొనువాడు, పిచ్చివాని కన్నా మూర్ఖుడే అగును.

874. శత్రువులతో కూడ స్నేహము చేసుకోగల వినయ, వివేకములున్న వానికి లోకమే దాసోహమనును.

875. ఏ తోడు లేనపుడు, శత్రువులు ఇద్దరుండి ఎదిరించునపుడు, ఆ ఇద్దరు శత్రువులలో ఒకనితో స్నేహము చేసుకొని తీరవలెను.

876. ఒకరితో వున్నది శత్రుత్వమా, స్నేహమా అని నిర్ణయించకోలేనపుడు, మరొకరితో శత్రుత్వము ఏర్పడినపుడు, ముందువానిని తటస్థములో ఉంచుకొనవలెను.

877. ఒకరి కష్టములను తనకు తెలియనివారితో చెప్పకూడదు. అట్లే తన బలములోని కొన్ని ఇక్కట్లను శత్రువులకు తెలియనీయకూడదు.

878. ఒకడు తను వెళ్లు మార్గమును బాగా తెలుసుకొని, సంపదను వృద్ధి చేసుకొని, దానిని కాపాడుకొనినచో శత్రువుల యొక్క సంతోషము, గర్వము చెదరిపోవును.

879. ముళ్ల చెట్టును పెరగక ముందే నరికి పారవేయవలెను. వదిలి పెట్టినచో ఏపుగా పెరిగి తరువాత నరుకువాని చేతికే ముళ్లు గ్రుచ్చుకొనును.

880. శత్రువుల యొక్క గర్వమును అణగద్రొక్కలేని వాడు, ఊపిరి వున్న శవము వంటి వాడే!!

# 89. నిగూఢ శత్రువు

881. సుఖమునిచ్చునవి నీడ, నీరుయైననూ అవి సుఖమునివ్వక కీడు కలిగించినచో వాటిని విడువవలెను. అట్లే కష్టములు కలిగించు బంధువులను విడువవలెను.

882. కత్తివలె నుండు శత్రువులను చూచి భయపడనక్కర్లేదు, కాని బంధువులవలె ఉండి నిగూఢ శత్రుత్వము చూచి జాగ్రత్తగా ఉండవలెను.

883. మనస్సులో ద్వేషముగల శత్రుత్వము నుండి కాపాడుకొనవలెను, లేనిచో సమయమెరిగి కుమ్మరి మట్టి త్రవ్వునట్లు త్రవ్వివేయబడుదురు.

884. మనస్సులో ద్వేషము, పైకి స్నేహమువలె కనిపించు శత్రుత్వము వలన చాలా కీడు కలుగును.

885. మనోద్వేషము గలవారు బాహ్యశత్రువులతో చేరి, మరణమునకు సమానమైన కీడును కలిగించుదురు.

886. తన వారితోనే శత్రుత్వము ఏర్పడినచో, ఆ ద్వేషముతో జీవించడము చాలా కష్టమగును.

887. బంగారు ఆభరణములలో రాగి కలిసి యుండునట్లు, ద్వేషముగల వాడు ఎంత స్నేహముగా మెలగిననూ రాగిలాంటి ద్వేషమున్నవాడే!!

888. బలమైన ఇనుమును రంపముతో కోయునపుడు రంపము అరిగిపోవును. అట్లే ద్వేషము గలవాని జీవితము చెడును.

889. ద్వేషము నువ్వుగింజంత చిన్నదై యున్ననూ, ఆ ద్వేషము పెద్ద కీడును తీవ్రముగా ఏర్పడునట్లు చేయును.

890. మనస్సుల పొంతనలేకుండా ఒకరితో కలిసి జీవించునది ఎట్లనగా ఒకే గుడిసెలో పాముతో కలసి జీవించునట్లు.

## 90. పెద్దలయందు గౌరవము

891. మన శ్రేయస్సుకోరి పెద్దలు మనకు చేయు కార్యములను దూషించక, అగౌరవ పరచకుండుట చాలా శ్రేష్ఠమైన రక్షణ అగును.

892. అనుభవమున్న పెద్దలను గౌరవించకపోయినచో ఆ పెద్దల వలన మనకు తీరని కష్టములు ఏర్పడును.

893. పెద్దల మాటలను, ఆలోచనలను వినక చేయు కార్యములన్నియు కీడును కోరి తెచ్చుకొనునట్లే అగును.

894. అనుభమున్న పెద్దలను గౌరవించక, వారికి కీడు చేసినచో, యమున్ని చేయి చాపి పిలిచి ఆహ్వానించినట్లే అగును.

895. పెద్దల మాటలు వినకుండా వెళ్లువారు పెద్ద రాజైనను ఓడిపోయి నిలువ నీడ లేకుండా, జీవించుటకు వీలుకాని కష్టములు ఎదుర్కొనును.

896. కాలిన గాయమునకు మందుగలదు. కాని పెద్దల మనస్సును గాయపరచిన వారికి జీవించుటయే దుర్లభమగును.

897. పెద్దలు కోపించుకొనునట్లు చేసినచో, వానికి మంచి జీవితము, గొప్ప సంపదలున్ననూ అవి నశించును.

898. కొండంత శాంతమున్న పెద్దలు కోపించి శపించునట్లు ఒకడు చేసినచో, వాడు కుటుంబముతో సహా నశించిపోవును.

899. గొప్ప వ్రతములు బూనిన పెద్దలు కోపించి శపించినచో, పెద్ద రాజైననూ రాజ్యము పోగొట్టుకొని నశించిపోవలసినదే!!

900. గొప్ప తపస్సంపన్నులైన పెద్దలు కోపించునట్లు చేసినచో, ఎంతటితోడు యున్ననూ వాడు సుఖముగా జీవించుటకు వీలుకాదు.

# 91. ఇల్లాలి మాటలు

901. సుఖము కొరకు భార్య మాటలు వినువాడు గొప్ప ధర్మఫలమును పొందలేడు, మంచికొరకు ప్రయత్నించుటకు అడ్డంకి కూడ అదేనగును.

902. మగతనము వీడి ఆడవారి మాటలు వినువాడి వలన అందరికి సిగ్గు చేటగును. తుదకు తాను సిగ్గుపడవలసివచ్చును.

903. భార్య వద్ద అణకువతో భయపడి మెలగువాడు పెద్దల మధ్యకు వెళ్లుటకు మరింత భయపడవలసి వచ్చును.

904. భార్యకు భయపడి నడుచుకొను వానికి విమోచనము లేదు. వాని సామర్ధ్యమును బుద్ధిమంతులెవరు మెచ్చుకొనరు.

905. భార్యకు భయపడువాడు ఎవ్వరికైనా మంచి కార్యములు చేసి సహాయపడుటకు భయపడును.

906. భార్య భుజములపై వ్రాలి ఆమెకి భయపడువాడు, దేవతలవలె జీవించిననూ మగతనము లేనివాడే అగును.

907. భార్య ఆజ్ఞకు తగినట్లు ఉపచర్యములు చేయు మగవాని కంటే ఆ భార్య యొక్క స్త్రీతత్వమే ఎంతో గొప్పది!!

908. భార్య మాటల ప్రకారము నడుచుకొను వాడు స్నేహితులకు సహాయపడలేడు, సద్గతి పొందుటకు దాన ధర్మములు చేయలేడు.

909. భార్యకు ఉపచర్యములు చేయువాడు ఏ ధర్మకార్యములు చేయలేడు. సంపద కూడబెట్టలేడు, ఇతర సౌఖ్యములు పొందలేడు.

910. బాగుగా ఆలోచించగల మన:దృఢము ఉన్నవానికి భార్య మాటలు వినుట అను దీనత్వము ఏ కాలములోనూ ఏర్పడదు.

## 92. భోగపు స్త్రీలు

911. ఒకరిని నిజమైన ప్రేమతో ఇష్టపడక, వారిచ్చు వస్తువుల కొరకు ఇష్టపడు స్త్రీ యొక్క ఇంపైన మాటలు ఇతరులకు కీడును కలిగించును.

912. ఒకని వస్తు సంపదను జూచి, దానిని పొందుటకు ఇంపైన మాటలాడి వినయమును ప్రదర్శించు స్త్రీని గుర్తించి ఆమెకి దూరముగా ఉండవలెను.

913. మనస్సులో ప్రేమలేక, ధనము కొరకు ఒకరిని కౌగలించుకొను స్త్రీ, చీకటి గదిలో కూలి కొరకు పరాయి శవమును కౌగలించుకొనునట్లే!!

914. సుఖము కొరకు కాకుండా, వట్టి ధనము కొరకే వచ్చు అల్ప బజారు స్త్రీల యొక్క సాంగత్యమును, విశ్వాసమును బుద్ధిమంతులు కోరరు.

915. తెలివిగలవారు, బుద్ధిమంతులు ఎవ్వరూ సర్వజన సుఖము తప్పించి అల్ప సంతోషము ఇచ్చుదానిని ఎన్నటికీ కోరరు.

916. తమ గొప్పతనము తమ శ్రేయస్సు కోరువారు, ఆటలు, పాటలు, అందముతో మురిపించు స్త్రీలతో కలియకుందురు.

917. సంపూర్ణ మనోదృఢములేని వారే, ధనము కోరక ఆశపడి వచ్చు బజారు స్త్రీల కౌగిలిలో వ్రాలిపోవుదురు.

918. వంచించు స్త్రీలను గుర్తించి వారి సాంగత్యమును వీడని వారిని కామపిశాచులు పట్టినదని పెద్దలు చెప్పుదురు.

919. అడ్డు అదుపులేని భోగపుస్త్రీల వలలో అల్పులు చిక్కుకొనుట, నరకమను గోతిలో పడినట్లే అగును.

920. రెండు మనస్సులు గల భోగపుస్త్రీలు, జూదము, కల్లుత్రాగుట అను వలల్లో చిక్కుకొన్నవారు, లక్ష్మీసంపదకు దూరమైన వారగదురు.

# 93. కల్లు త్రాగుట

921. కల్లు త్రాగుట యందు ఆసక్తి యున్నవాడు ఎన్నటికీ సిగ్గుపడడు. అదేకాకుండా ముందు పొందిన గౌరవమును కూడ పోగొట్టుకొనును.

922. గొప్పగా గౌరవముగా జీవించాలనే ఆలోచన లేని వాళ్ళు కల్లు త్రాగవచ్చును.

923. కల్లు త్రాగువానిని తన తల్లే ఇష్టపడనపుడు, గౌరవముగల బుద్ధిమంతులు ఎట్లు ఇష్టపడుదురు?

924. అందరు నీచముగా చూచు కల్లు త్రాగువాని దరికి 'సిగ్గు' అను మంచితనము అతనికి ముఖము చూపదు.

925. చేతిలోనున్న ధనమును వెచ్చించి, మైమరిపించుకొనుటకు కల్లు త్రాగడము బుద్ధిలేని తనమే అగును.

926. నిద్రించువారు, చనిపోయినవారు వేరుగాదు. అట్లే కల్లు త్రాగినవానికి తెలివి మందగించినందున విషము త్రాగిన వాడే అగును.

927. రహస్యముగా కల్లు త్రాగువానిని ఊరి ప్రజలు ఎరిగి వానిని చూచి నవ్విపోవుదురు గదా!!

928. చాటున కల్లు త్రాగి "త్రాగలేదు" అని చెప్పడము మానవలెను. లేనిచో త్రాగిన మత్తులో మనస్సులో దాచిపెట్టిన అసత్యము కూడ బయటపడును గదా!!

929. కల్లు త్రాగిన వానికి కారణము చెప్పి ఉపదేశము చేయుట నీటిలో మునిగిపోయిన వానిని దీవిటితో వెదుకునట్లే అగును.

930. త్రాగుబోతు తాను త్రాగనపుడు, త్రాగినవాడు మైకముతో, నీరసముతో పడు అవస్తలు చూసైనా మార్పు చెందవచ్చును గదా!!

# 94. జూదము

931. జూదములో కొన్ని సమయములలో గెలుపొందిననూ జూదమును మానవలెను. ఏలననగా చేప గాలములోని ఎరను ఆహారము అనుకొని చిక్కుకొన్నట్లే అగును.

932. ఒకటి గెలిచి నూరు ఓడిపోయే ఆట జూదము. కాబట్టి జూదము ఆడువారు గొప్పగా, మంచివారిగా జీవించుటకు అది మంచి దారియగునా?

933. జూదములో ఆడు పాచికలు దొర్లునట్లు, ఒకని సంపద అంతయు అతని నుండియు దొర్లి ఎదుటివాని వద్దకు చేరును.

934. క్షీణింపజేయుదియు, ప్రతిష్ఠ దిగజార్చి కష్టములు, దారిద్ర్యము తెచ్చునదైన జూదము వంటి చెడ్డ కార్యము మరొకటి లేదు.

935. జూదపు పాచికలు, ఆడుచున్న చోటు, పాచికలు నడుపు సామర్థ్యమును వీడనివాడు సంపదలన్నియూ పోగొట్టుకొని బీదవాడగును.

936. జూదమను దరిద్రదేవతను పొందినవాడు, జీవితములో ఆకలిని, దు:ఖమును పొందుదురు.

937. జూదములో కాలుపెట్టిన వాని సంపద, మంచి గుణములన్నియూ నశించిపోవును.

938. జూదము ఒకని సంపదను నాశనము చేయుటయేకాక అతనిని అబద్ధమాడునట్లు చేసి, అతని మంచి మనస్సును చెఱిపి, ఆశీస్సులను చెఱచి కష్టములు కలిగించును.

939. మంచి బట్టలు, ధనము, భోజనము, చదువు, కీర్తి – ఈ ఐదు జూదగాడి దరి చేరవు.

940. రోగము పెరుగుతూవుంటే ప్రాణము మీద తీపి కూడ పెరుగు నట్లు, ఒకనికి ధనము చేజారి పోయిన కొలది జూదముపై ఆశ పుట్టును.

# 95. మందు

941. వాత, పిత్త, శ్లేతమను మూడు హెచ్చు అయిననూ లేక తగ్గిననూ రోగమును కల్పించునని వైద్య గ్రంథ నిపుణులు చెప్పుదురు.

942. శరీరమునకు ఎటువంటి మందు అక్కరలేదు. భుజించవలసిన సమయము, జీర్ణించుకోగల పదార్థములు తెలుసుకొని భుజించిన చాలును.

943. జీర్ణించుకొనుటకు అవసరమయ్యే కాలము, కొలతలు తెలుసుకొని భుజించినచో, శరీరమును చాలా కాలము వరకు జీవింపచేయనగును.

944. జీర్ణించుకోగలినది ఎరిగి, శరీరమునకు సరిపడని దానిని విడిచిపెట్టి, ఆకలి వేయుపుడే భుజించవలెను.

945. శరీరమునకు సరిపడు దానినే భుజించి, మిగతా వాటిని విడచినచో శరీరమునకు ఎటువంటి కీడు కలుగదు.

946. విడిచి పెట్టవలసిన దానిని విడిచిపెట్టి, భుజించు వానికి సుఖము కలుగును. కాని అన్నిటినీ భుజించువానికి రోగములు చుట్టుకొనును.

947. జఠరాగ్ని కలిగించు ఆకలినెరిగి భుజించనివానికి, ఎక్కువగా ఆహారము భుజించువానికి మితిమీరిన రోగములు దరిచేరును.

948. ఒకని రోగము ఇదని తెలుసుకొని, రోగమునకు కారణమెరిగి, దానిని పోగొట్టుదారి కనిపెట్టి, సరైన మందుల సహాయముతో సరిచేయవలెను.

949. వైద్యము నేర్చినవాడు, రోగి పరిస్థితి, రోగము యొక్క తీవ్రత, మందు తీసుకొను కాలము అన్నీ పరీక్షించి వైద్యము చేయవలెను.

950. రోగి పరిస్థితి, వైద్యుని తెలివి, మందుల ప్రభావము, వైద్యుని మాటల ప్రకారము పనిచేయు సహాయకుడు ఈ నాల్గింటిపై వైద్యము ఆధారపడియుండును.

# 96. పౌరసత్వము

951. మంచి ఉన్నత కుటుంబములో పుట్టిన వారికే తప్ప మిగతా వారికి సహజముగా పరులకు సహాయపడుట, నిందకు భయపడుట అనునవి ఉండవు.

952. మంచి నడత, సత్యము పలుకుట, నిందకు భయపడుట అను మూడు గుణములను మంచి కుటుంబములో పుట్టినవారు విడువజాలరు.

953. వికసించిన ముఖము, దానగుణము, ఇంపైన మాటలు, ఇతరులను కించపరచకుండుట ఈ నాలుగు మంచి కుటుంబములో పుట్టినవాని లక్షణములు.

954. కోట్ల సంపద పొందియున్ననూ, ఉన్నత కుటుంబములో పుట్టినవారు వారి గొప్పతనమును పోగొట్టుకొను నీచకార్యములు చేయరు.

955. దానము చేయు గొప్ప కుటుంబములో పుట్టినవారు, తమ సంపద క్షీణించిననూ, దానగుణమును త్యజించరు.

956. నిందలేని, గౌరవమైన కుటుంబములో పుట్టి జీవించువారు, ఇతరులను వంచించు కార్యములను ఎన్నటికీ చేయరు.

957. మంచి కుటుంబములో పుట్టినవారు చేసిన చిన్న తప్పు కూడ, తెల్లటి చంద్రునిపై ఏర్పడిన నల్లటి మచ్చవలె పెద్దదిగా కనిపించును.

958. ఒకడు మంచి గుణములపై ఆశలేని వాడైనచో, వాడు పుట్టిన కులము గురించి లోక ప్రజలు అనుమానించుదురు.

959. మట్టి యొక్క గుణమును పండిన పంట తెలియజేయునట్లు, పుట్టిన కుటుంబము యొక్క గొప్పదనము వాని మాటలు తెలియజేయును.

960. మంచిని కోరువాడు, నింద అనే పాపమునకు భయపడి మెలగవలెను. కుల గౌరవము కోరువాడు వినయముతో మెలగవలెను.

## 97. పరువు

961. అతి ముఖ్యమైన కార్యమైనను దాని వలన మనకు చెడ్డపేరు వచ్చునన్నచో దానిని చేయక విడువవలెను.

962. కీర్తి, పరువు కోరువారు, వాటి కొరకు నీచ కార్యములు ఎన్నటికీ చేయరు.

963. సంపద వృద్ధి చెందునపుడు మరింత అణకువగా ఉండవలెను. బీదరికము దాపురించినపుడు పరువుతో తలెత్తుకొని జీవించవలెను.

964. తల నుండి ఊడిపోయిన వెంట్రుకలకు ఎట్లు పెరుగుదల ఉండదో, అట్లే తమ స్థానమునుండి దిగజారిన వారికి ప్రగతి ఉండదు.

965. కొండంత గౌరవ మర్యాదలున్ననూ, గురివిందంత పరువుపోవు కార్యము చేసినచో అన్ని గౌరవ మర్యాదలు క్షీణించిపోవును.

966. పరువుపోయి తన్ను అవమానపరుచు వాని వద్ద చేరినచో కీర్తిరాదు, సుఖమును ఇవ్వడుకదా!!

967. తనను గౌరవించని వారితో చేరి వారి సహాయముతో జీవించుటకంటే తన స్థానములో ఉండి పరువుతో మరణించుట మేలు.

968. పరువుపోయి జీవించిననూ ప్రాణమును విడచిపెట్టదు. వట్టి శరీరమును కాపాడుకొను జీవితము, పరువును కాపాడుటకు మందు అగునా?

969. కస్తూరి జింక తన నుండి వెంట్రుకలు కోల్పోయినచో అది జీవింపజాలదు. అట్లే ఉన్నతమైన వారు పరువుపోయినచో జీవింపజాలరు.

970. పరువు పోయినచో జీవించలేనివారి గొప్పతనమును, లోక ప్రజలు ఎల్లప్పుడూ స్తుతించెదరు.

# 98. గొప్పతనము

971. గొప్పతనమునకు కారణము ఒకనికి తన ప్రయత్నములో నున్న పట్టుదల, దిగజారుడు తనమునకు కారణము ప్రయత్న లోపమే!!
972. జన్మము అందరికి సమానమే. గొప్పతనము వారి వారి సామర్థ్యము, పట్టుదల బట్టి వ్యత్యాసము కలిగియుండును.
973. గొప్పగుణము లేనివారు ఎంత గొప్పగా చలామణిమైనను, గొప్పవారు కాలేరు. నీచగుణములేనివారు సామాన్య జీవనము గడిపిననూ నీచులు కాజాలరు.
974. శీలము కాపాడుకొను స్త్రీవలె, ఒకడు తనను తన మంచి నడతతో, మంచి గుణముతో కాపాడుకొనవలెను.
975. గొప్పవారనువారు మిగతవారు చేయలేని గొప్ప కార్యములను తమ గొప్ప పద్ధతి ప్రకారము సులభముగా చేసి ముగించుదురు.
976. తమకు తెలియని విషయములను గొప్పవారి వద్దకు వెళ్లి నేర్చుకొనవలెనన్న జ్ఞానము అల్పులకు కలుగదు.
977. అర్హతలేని అల్పులకు గొప్పతనము కలిగినచో దానివలన గర్వము పొంది ఇతరులకు కీడు చేయుదురు.
978. నిజమైన గొప్పతనము కలిగినవారు అణకువతో ఉందురు. అల్పులు గర్వముతో తమకు తామే గొప్పలు చెప్పుకుందురు.
979. గొప్పతనము కలుగుటకు ఎన్ని కారణములున్ననూ నిజమైన గొప్పవారు వాటిని చాటుకొనరు. అల్ప గుణమున్నవారు అది చిన్నదైననూ చాటుకొని గర్వించి విర్రవీగెదరు.
980. గొప్పతనమున్నవారు ఇతరుల యొక్క మంచి గుణములనే ప్రశంసించెదరు, చెడ్డగుణములను చూడరు. అల్పులు ఇతరుల తప్పులనే ఎన్నుదురు.

# 99. సద్గుణము

981. సద్గుణములన్నింటిని కలిగియున్న వివేకవంతులు మంచి కార్యములన్నింటిని తమ కర్తవ్యమని తలంచి చేయుదురు.

982. సద్గుణవంతుల యొక్క గొప్పతనము వారు మంచి గుణములను పొందియుండుటయే. వారు మిగతా సంపదలను కలిగియుండుట గొప్పతనమని భావించరు.

983. ప్రేమ, నిందకు భయపడుట, ఇతరులకు సహాయపడుట, దయాహృదయము, సత్యము పలుకుట ఈ ఐదు వివేకులకు మూలస్తంభముల వంటివి.

984. ఎవ్వరిని హింసింపకుండుట ఒక వ్రతము. పరుల తప్పులను ఎంచకుండుట వివేకము.

985. సద్గుణవంతులు ఒక కార్యమును చేసి ముగించుటలో తమ అణకువ కారణమగును. ఆ అణకువ శత్రువులను కూడ మార్చగల సైన్యమగును.

986. వివేకవంతులను తెలుసుకొను గీటురాయి ఏదనగా, తమకన్నా చిన్నవారి వద్ద ఓడిపోయిననూ దానిని పెద్ద మనస్సుతో అంగీకరించడమే!!

987. తమకు కీడు చేసిన వారికి కూడ మేలు చేయకపోయినచో, సద్గుణవంతులకు వినయముతో ఏమీ ప్రయోజనముండదు.

988. వివేకము అను బలము గల వారికి, బీదరికము అనునది లోకువ కాజాలదు.

989. సద్గుణము అను సముద్రమునకు తీరమువలె దృఢత్వములో నిలబడు గొప్పవారు, లోకమే అంతమైననూ తమ వినయ స్థానమునుండి తప్పిపోరు.

990. సంపూర్ణ సద్గుణములను కలిగిన వారు తమ స్థానము నుండి దిగజారినచో ఈ భూమి ఆ భారమును మోయుజాలక కృంగిపోవును.

# 100. సంస్కారము

991. అందరితో సులభముగా కలిసి మాట్లాడు గుణము గలవారు, సంస్కారము గలవారని వివేకులు చెప్పుదురు.

992. ఇతరులపై ప్రేమ కలిగియుండుట, ఉన్నతమైన కుటుంబములో పుట్టిన వారికి సంస్కారమునకు దారి అగును.

993. అవయవములు కలిగియుండుట ఒక అమరిక కాజాలదు, సద్గుణములను పొందియుండుటయే మంచి అమరిక అగును.

994. నీతి, ధర్మము, ఇతరులకు సహాయపడుట, వినయము, ఈ గుణములే ఇతరులచే గౌరవింపబడును.

995. పరిహాసమునకైననూ ఇతరులను కించపరచుట బాధ కలిగించును. కావున లోకహిత మెరిగి మెలగు వానికి శత్రుత్వమున్ననూ అది స్నేహముగా మారును.

996. ఈ లోకము వినయవంతుల సత్ప్రవర్తన వలన మాత్రమే నిలచియున్నది. వారు లేని యెడల మట్టిలో మట్టిగా మారిపోవుట నిశ్చయము.

997. కత్తి పదునువలె పదునైన తెలివి కలిగియున్ననూ, ఒకనికి వినయ గుణములు లేని యెడల వాడు చెట్టుతో సమానమే!!

998. స్నేహములేక, సద్గుణములు లేని వాడివద్ద సంస్కారముతో ప్రవర్తించి సహాయపడుట బుద్ధిమంతులకు తప్పే అగును.

999. ఒకరితో ఒకరు కలిసి సంతోషముగా జీవించలేని సంస్కార హీనులకు పగలు కూడ రాత్రివలె చీకటి అగును.

1000. సంస్కారహీనుడు పొందిన సంపద, శుభ్రములేని పాత్రలో పోసిన పాలు చెడిపోవునట్లే అగును.

# 101. సంపద

1001. తాను అనుభవింపక, ఇతరులకు సహాయపడక గొప్ప సంపద కూడబెట్టి మరణించువాడు లోకములో సాధించినది ఏమియూ లేదు.

1002. ధనమే గొప్పదని తలంచి, ఇతరులకు ఇవ్వక జీవించువాని జన్మము పిశాచి జన్మమే అగును.

1003. సంపాదించిన ధనమును ఖర్చుచేయక, దానము చేసి గొప్పతనము పొందని వాని జన్మము, భూమికి భారమే అగును.

1004. ఎవ్వరికీ ఏమీ సహాయము చేయనివాడు మరణించిన పిదప వానిని ఎవరు తలంచెదరు?

1005. ఇతరులకు ఇవ్వక, తాను తన ప్రజలు అనుభవింపక కూడబెట్టుకొను కోట్ల ధనము వలన ప్రయోజనము ఏమియూలేదు.

1006. తానూ అనుభవింపక, ఇతరులకు ధనమిచ్చి సహాయము చేయు గుణములేని వానికి, ఆ సంపద ఒక రోగమే అగును.

1007. ఇతరులకు సహాయ పడని ధన సంపద, ఒక అందమైన స్త్రీ కన్యగా ఉండి ముదుసలి అయినట్లే!!

1008. దానగుణము లేక, అవసరమైన వారికి సహాయపడని ధనవంతుని సంపద, ఊరి మధ్యన పుట్టిన విషపు చెట్టుకి పండ్లు కాచినట్లే!!

1009. బంధువులపై ప్రేమలేక, తనకూ ఉపయోగించుకొనక, కూడబెట్టిన పిసనారి యొక్క సంపద, పరాయివాళ్ల వశమగును.

1010. ఇతరులకు సహాయపడు దానగుణమున్న గొప్పవారి సంపద, కొంత కాలము క్షీణించిననూ, నీటి ఆవిరితో నిండిన మేఘము కొంతకాలము కురవక యుండినట్లే అగును.

# 102. సిగ్గు

1011. స్త్రీ సిగ్గుపడుట వేరు, బుద్ధిమంతులు నింద, పాపకార్యములకు భయపడు సిగ్గు వేరు.

1012. ఆహారము, బట్టలు అన్నీ ప్రజలకు సమానమే, కాని బుద్ధిమంతుల గొప్పతనము వారు నిందలకు సిగ్గు పడుటయే.

1013. జీవికి స్థానము శరీరము. కాని నిందకు భయపడు సిగ్గు గుణమే వివేకమునకు స్థానము.

1014. బుద్ధిమంతులకు నిందకు భయపడుగుణము ఒక ఆభరణము వంటిది. అదిలేని వారికి తల ఎత్తుకొని నడవలేని రోగము వంటిది.

1015. తన నిందకు, ఇతరుల నిందకు భయపడువారిని, 'సిగ్గు' అను మంచి గుణమున్నవారని లోకము స్థుతించును.

1016. గొప్పవారు తమకు గల సిగ్గు అను మంచి గుణమును కాపాడుకోలేని యెడల లోకజీవనముగా గుర్తించదగదు.

1017. గొప్పవారు తమకు నింద ఏర్పడినచో ప్రాణమును విడిచెదరు. కాని వారు ప్రాణము కొరకు నిందలను భరించలేరు.

1018. ఇతరులకు కాని, తనకు కాని సిగ్గులేక నింద పడినచో ధర్మము వీడిపోయి పాపము వానిని చుట్టుకొనును.

1019. సత్ప్రవర్తన లేనిచో కుటుంబ గౌరవము చెడును. పాపమునకు భయపడక, సిగ్గుపడక, నింద చేసినచో వాని మంచి గుణములన్నియూ చెడును.

1020. మనస్సులో సిగ్గు అను మంచి గుణము లేనిచో, బొమ్మలాటలో చెక్క బొమ్మలకు దారము కట్టి ప్రాణమున్నట్లు ఆడించునట్లే అగును.

# 103. కుటుంబ గౌరవము

1021. ఒకరు, తన కుటుంబ గౌరవము మరింత పెంపొందిచుటకు తగిన కార్యము చేయుట కన్నా మరో మంచి కార్యము ఏదీ లేదు.

1022. ఒకని కుటుంబ గౌరవము, వాని పట్టుదల, వాని తెలివి, చేయు మంచి కార్యముల వలన మరింత పెరుగును.

1023. కుటుంబ గౌరవము వృద్ధికి కార్యదీక్ష పూనిన వానికి, దైవమే వచ్చి తోడై సహకరించును.

1024. కుటుంబ గౌరవ వృద్ధికి దృఢ నిశ్చయముతో పాటుపడు వానికి జయము కలిగితీరును.

1025. పరనింద పడక, మంచి మార్గమున తన కుటుంబ గౌరవము కాపాడుచూ, దాని వృద్ధికి పాటుపడు వానితో లోక ప్రజలు కోరి చుట్టరికమువలె మెలగుదురు.

1026. మంచి మగతనము అనునది తనతోటి వారిని, మిగతా వారిని, కుటుంబమును మంచి మార్గములో నడిపించి అనుసరించునట్లు చేయించుటయే.

1027. యుద్ధ భూమి యందు సామర్థ్యమున్న వానిపై భారమంతయూ పడునట్లు, కుటుంబములోనూ దానిని సమర్ధవంతముగా నడుపువాని మీద భారమంతము పడును.

1028. కుటుంబ గౌరవ వృద్ధి కొరకు కార్యదీక్ష పూనిన వానికి కాల పరిమితి ఏదియూ లేదు, కాని సోమరితనముతో కాలము వెళ్ళబుచ్చినచో కుటుంబము చెడును.

1029. కుటుంబమునకు ఎటువంటి నింద రాకుండా కాపాడుటకు కార్యదీక్ష పూనిన వానికి, తన దృఢ నిశ్చయము వలన శరీర కష్టములు ఓడిపోవును.

1030. ఆదుకొనుటకు మంచి గుణవంతుడులేని కుటుంబము, వేరూనని వృక్షము సాగిల పడినట్లే అగును.

# 104. వ్యవసాయము

1031. లోకము, భోజనము కొరకు రైతు దున్ను నాగలిపై ఆధారపడియున్నది. కావున అన్ని వృత్తుల కంటే వ్యవసాయ వృత్తి చాలా శ్రేష్ఠము.

1032. ఇతర అన్ని వృత్తులకు భోజనము సమకూర్చు వృత్తి వ్యవసాయము. కావున వ్యవసాయమే ప్రపంచమునకు ఇరుసుగా యుండి చక్రము త్రిప్పి కాపాడుచున్నది.

1033. పండించి, ఇతరులకు ఆహారము పెట్టి, తాము భుజించు రైతులొక్కరే సంపూర్ణులు. మిగత వారందరు ఇతరులకు సేవచేసి తినువారే.

1034. ఏక చక్రాది పత్యము చేయు మహారాజులను కూడ తమ దయ యను గొడుగు క్రిందకు రప్పించుకొను వారు రైతులు. (ఆహారము కొరకు)

1035. రైతులు ఇతరులను యాచించరు, తమవద్దకు యాచించ వచ్చిన వారికి లేదని చెప్పక, తప్పక ఇచ్చెదరు.

1036. రైతులు వ్యవసాయము చేయక చేతులు కట్టుకొనిన యెడల, భోజనమును త్యజించిన సన్యాసులకు కూడ దారిలేదు.

1037. రైతులు బలముతో, సారవంతమైన భూమిని నాల్గవ వంతుకు, లోతుగా మెత్తగా దున్నుటచే, ఎరువులేకయే పంట వృద్ధి అగును.

1038. దున్నుటకంటె ఎరువు వేయడం ముఖ్యము, కలుపు తీసి, నీరుపెట్టి, పిదప చుట్టూ కంచె కట్టుట అతి ముఖ్యమైనవి.

1039. భూమి సొంతదారుడు భూమిని అవసర సమయాల్లో వెళ్ళి చూడలేని యెడల, భార్యని వీడిన భర్తకు ఎట్లు భోగము లేదో అట్లే పంట భోగముండదు.

1040. తన వద్ద ఏమీలేదని చెప్పుకొని, ఏ ప్రయత్నమూ చేయక, సోమరిగా కూర్చొను వానిని చూచి భూమి తల్లి నవ్విపోవును.

# 105. దారిద్ర్యము

1041. దారిద్ర్యము కన్నా దుఃఖమును కలిగించునది ఏదని పరిశీలించినచో, దారిద్ర్యము కన్నా దుఃఖమును కలిగించునది ఏదియూ లేదు.

1042. దారిద్ర్యము అను పాపి వచ్చి చేరినచో ఇహసుఖమును, పరలోకసుఖమును లేనట్లు చేయును.

1043. దారిద్ర్యము అను నస ఒకనిని పీడించినచో, వాని కుటుంబ గౌరవము, గొప్పతనము, అన్ని వసతులు మొత్తముగా చెడును.

1044. దారిద్ర్యము దాపురించినచో, గొప్ప కుటుంబములో పుట్టిన వారిని కూడ నీచమైన మాటలు మాట్లాడునట్లు చేసి, వారి స్థానమును దిగజార్చును.

1045. దారిద్ర్యము ఒకనికి దాపురించినచో, దానివలన చాలా కష్టములు వెంటవెంటనే వచ్చి చేరును.

1046. దారిద్ర్యములో నున్న వానికి మంచి మాటలను, మంచి తెలివితో చెప్పిననూ ప్రయోజనములేదు, అతను వినడు.

1047. ధర్మమార్గమున నడవని ఒకని దారిద్ర్యమును, కన్న తల్లి చూచి కూడ వానిని చీదరించుకొని పరాయివాని వలె చూచును.

1048. "నిన్న వచ్చి దాపురించి, నన్ను చంపిన ఈ దారిద్ర్యము, ఈ రోజు కూడా వచ్చి నన్ను హింసించునో?" ఏమో?!!

1049. ఒకడు అగ్గిపై పడుకొని నిరంతరాయముగా నిదురపోవచ్చును, కాని దారిద్ర్యము దాపురించిన వానికి ఒక క్షణము కూడ నిదుర రాదు కదా!!

1050. ఏమీ లేని బీదలు సన్యసించలేరు. వస్తువులపై ఆశలు వీడక మిగతవారి ఉప్పుకి, గంజికి యమునివలె తిరుగుదురు.

# 106. యాచకము

1051. బీదవాడు ఒకరిని యాచించునపుడు, యాచించువానికి ఎటువంటి అవమానము లేదు, కాని “లేదు” అని చెప్పువానికే అవమానమగును.

1052. యాచించువానికి, ఇచ్చువానికి ఇద్దరికీ కష్టములేక, యాచించినది దొరికినపుడూ ఎటువంటి కష్టము లేదు. సుఖమే అగును.

1053. యాచించు వారికి లేదని చెప్పని, దానగుణమున్నవారి యొద్దకు వెళ్లి అడగడము మంచిదే!!

1054. తన వద్ద యున్న దానిని ఇచ్చుటకు కలలోనైన మరువని గొప్ప గుణమున్న వాని వద్దకు వెళ్లి యాచించి పొందినది కూడ ఇచ్చువాని దానముతో సమానమైనదే.

1055. యాచించువారికి ఇచ్చు పుణ్యాత్ములు లోకములో ఉండుట వలన కొందరు ఆదరణకు యాచించుచున్నారు.

1056. తన వద్ద ఉన్న దానిని దాచుకొను చెడ్డ గుణము లేనివారిని చూచుటచే, దారిద్ర్యము వలన ఏర్పడు కష్టములన్ని తొలగిపోవును.

1057. యాచించువానిని హేళనచేయక, అవమానపరచక ఇచ్చు గొప్ప గుణమున్న వారిని చూసిన వెంటనే యాచించు వానికి మహా సంతోషము కలుగును.

1058. బీదరికము వలన ధనవంతుల దగ్గరకు వెళ్ళి చేయిచాపి అడగనిచో, ఈ లోకములో జీవితము చెక్కబొమ్మలాట వలె మారిపోవునే!!

1059. యాచించు వారే లేకపోయినచో, ఇచ్చుటకు ఇష్టపడువారికి దానగుణమను కీర్తి ఎట్లు కలుగును?

1060. యాచించు వాడు ఎవరివద్ద కోపము చూపరాదు. ఏలననగా తన బీదరికమే తనకు మార్గదర్శకమై, ఇతరుల పరిస్థితులను అర్థము చేసుకొనునట్లు చేయును.

# 107. బిచ్చము

1061. ఎన్నడూ లేదని చెప్పని, ఎల్లప్పుడూ ఇచ్చువాని వద్ద కూడ యాచించక ఉండుట కోటి రెట్లు శ్రేష్ఠము

1062. ఈ లోకములో ప్రజలు బిచ్చమెత్తుకొని జీవించవలెనని విధి విధించినచో, ఆ విధించినవాడే చెడి నాశనమగుగాక!!

1063. దారిద్ర్యము వలన కలుగు కష్టములను తన మంచి ప్రయత్నముతో పోగొట్టక, బిచ్చమెత్తి తీర్చుకోరుట చాలా క్రూరము.

1064. భోజనమునకు కూడ దారి లేనపుడు, ఎవ్వరిని యాచించకుండుట లోకమే ప్రశంసించు వివేకమగును.

1065. యాచించక, తన సొంత ప్రయత్నము వలన సంపాదించగలిగిన గంజి నీళ్ళనే త్రాగుట అమృతము కన్నా గొప్పదగును.

1066. "ఈ ఆవునకు నీళ్ళు పెట్టండి" అని యాచించుటయు తన నాలుకకు నీచమే అగును.

1067. ఇచ్చుటకు మనస్సులేని వారివద్ద యాచించకు. అని యాచకులను నేను వేడుకుంటున్నాను. (తిరువళ్లువరు వేడుకుంటున్నారు)

1068. యాచకమను రక్షణ లేని పడవ, దానగుణము లేని ధనవంతుడను బండరాయికి గుద్దుకొనినచో అది చిన్నాభిన్నమగును.

1069. భిక్షమెత్తుకొనుటను తలంచినచో హృదయము చలించిపోవును, అట్లు అడిగిన వానికి ఇవ్వని పిసినారిని చూచినచో హృదయము బ్రద్దలగును.

1070. యాచించువానికి యాచించునపుడే సిగ్గుతో ప్రాణము పోవుచున్నదే!! అడిగితే, ఇవ్వనివాని ప్రాణము ఎక్కడికి వెళ్లి ప్రకాశించునో గదా!!

# 108. అల్పగుణము

1071. అల్పగుణము కలవారు సామాన్య ప్రజలవలె ఉన్నారే!! ఇటువంటి పోలిక వేరెందులోనూ చూడలేము కదా!!

1072. అల్పగుణము గలవారికి మంచి కార్యములు చేయవలెనన్న భయములేనందున ఎప్పుడూ సంతోషముగా మనస్సులో ఏ కష్టము లేక యుందురు. (అల్పులను హేళనము చేయుట)

1073. దేవతలు తమకు ఇష్టమైనట్లు నడచుకొందురు. అట్లే లోకములో అల్పులు కూడ తమకు ఇష్టమైనట్లు నడచుకొను దేవతలకు సమానులు!! (ఇదీ హేలనమే)

1074. అల్పులు తమకన్నా తక్కువవారిని చూచినచో, వాడికన్నా తాము గొప్పవాళ్ళమని తలంచి గర్వించి మరింత అక్రమములు చేయుదురు.

1075. అల్పులు కొన్ని సమయములలో భయపడి మంచివారివలె నడుచుకొందురు, లేక తాము కోరినది పొందుట కొరకైనను మంచిగా నటించుదురు.

1076. ఢంకా మ్రోగునట్లు, అల్పులు రహస్యములను దాచక ఊరందరికీ తెలియజేయుదురు.

1077. అల్పులు ఎంగిలి చేతులతో కాకులను కూడ తరమరు. అయితే తనను కొట్టగలవాని వద్ద అణకువతో వుండి అన్ని ఇచ్చి వేయుదురు.

1078. బుద్ధిమంతులు ఒకరు అడిగిన వెంటనే సహాయపడుదురు. అయితే అల్పబుద్ధి గలవానికి చెఱకువలె మెలివేసి పిండితేగాని అతనినుండి సహాయము దొరకదు.

1079. అల్పులు, ఇతరుల మంచి భోజనము, మంచి బట్టలు చూచి అసూయపడి వారిమీద నిందలు మోపుదురు.

1080. అల్పులు ఏ కార్యమునకు భయపడరుకాని, తమకు ఒక కష్టము కలిగినపుడు మరొకరికి కీడు చేయుటకు తామే అమ్ముడు పోవుదురు.

# అధ్యాయము – 3

# కామము

## 109. మెరుపు చూపులు

1081. నన్ను భ్రమింపజేయు అందముతో ఒప్పారుచున్న ఈమె ఏ దేవకన్యయో? లేక అందమైన నెమలియో? లేక మానవ కన్యయో? నా మనస్సుకు తెలియకున్నదే!!

1082. ఆమె చూసింది, నేను చూసాను. ఆమె చూపు ఆమె ఒక్కరిదే కాదు, పెద్ద సైన్యమునే తరలించుకొని వస్తున్నట్లు ఉన్నదే!!

1083. "మృత్యువు" అని చెప్పుదురే, దానిని ఇప్పుడే నేరుగా చూచుచున్నాను, అది స్త్రీ రూపమున యుద్ధము చేయగల కన్నులు గలది.

1084. చూసిన వారి ప్రాణమును కొల్లగొట్టునట్లు ఈ కన్యకు కళ్ళు అమరియున్నవే!!

1085. ఈమె కళ్లు, ప్రాణము తీయు చూపువో? మానవ కన్యవో? ఆడ జింకవో? ఆ చూపుల్లో మూడూ అమరియున్నవే!!

1086. ఈమె వంగిన కనుబొమ్మలు ముడివడి నన్ను చూచిననూ, ఈమె చూపు నాకు కష్టమును కలిగించలేదు.

1087. మదపుటేనుగు కన్నులను మూయు అంబారి కవచమువలె ఈమె రొమ్ములను మూయు వస్త్రము గలదు.

1088. యుద్ధ రంగమున శత్రువులకు భీతి కలిగించు నా బలము, ఈమె నుదుటి చూచిన వెంటనే సడలిపోయినదే!!

1089. లేడికన్నుల వంటి అందమైన చంచల కన్నులు, మనస్సులో సిగ్గు ఇవే ఆభరణములుగా ఉన్నపుడు వేరే నగలు ఈమెకు ఎందులకో?

1090. త్రాగిన వారికే సంతోషమునిచ్చునది కల్లు, అట్లుకాక చూచిన వారందరికీ సంతోషమునిచ్చునది శృంగారము.

# 110. మనోసైగలు

1091. ఈమె రెండు విధములైన చూపులు గలది, ఒకచూపు కామ రోగమును పురికొల్పునది, రెండవ చూపు ఆ రోగమునకు అదే మందు అగును.

1092. నాకు తెలియకుండా ఈమె చూచు కడకంటి చూపు, నా ఇష్టములో సగము కాదు అంతకంటే ఎక్కువగా ఉండవచ్చును.

1093. చూచెను, సిగ్గుపడెను. ఆ చేష్టలు మా ప్రేమ అను పైరు ఎదుగుటకు పారించిన నీరు వంటిది.

1094. నేను ఆమెను చూసినపుడు, తాను నేలను చూస్తూ నిలబడును. నేను అటు చూడనపుడు నన్ను చూచి తనలో నవ్వుకొనును.

1095. తాను నన్ను నేరుగా చూడకపోయిననూ, ఒక కన్ను మూసి ఒంటికంటితో చూచి, తనలో తాను సంతోషపడును.

1096. ఇష్టము లేనిదానివలె కఠినమైన మాటలు మాట్లాడిననూ, వాటికి అర్థము తరువాతే తెలుసుకొనదగును.

1097. బయటికి కఠినమైన మాటలు, కఠినమైన చూపులు, పరులవలె, నడుచుకొనుట, లోపలి స్నేహమునకు గుర్తులే అగును.

1098. నేను ఆ ప్రేయసిని చూడగా ఆమె నవ్వెను, కావున ఆమె మెత్తటి ప్రేమ నిండిన గుండెకు ఆ నవ్వు ఒక గుర్తే అగును.

1099. పరిచయము లేనివారివలె ఒకరినొకరు బయటికి చూచుకొను గుణము ప్రేమికుల మధ్యనే ఉండును.

1100. ప్రేమికుల మధ్య కన్నులతో కన్నులు కలిసి మాట్లాడుకొనునపుడు, నోటి మాటలతో ఏమి ప్రయోజనము?

# 111. కలయిక కోరికలు

1101. చూచుట, వినుట, రుచి చూచుట, వాసన చూచుట, స్పర్శ పొందుట ఈ పంచేంద్రియ జ్ఞాన సుఖములు ప్రేయసి యందే యున్నవి.

1102. సాధారణముగా రోగమునకు కారణము వేరు, మందులు వేరు. కాని ప్రేయసి వలన కలుగు రోగమునకు మాత్రము తానే మందు అగును.

1103. తాను కోరుకున్న ప్రేయసి మెత్తటి భుజముపై నిదురించుట కంటే వైకుంఠ వాసము సుఖమునిచ్చునా?

1104. ఈమె దూరమయినచో కాలిపోవును. దగ్గరైనచో చల్లబడును. ఇటువంటి ఆశ్చర్యకరమైన ప్రేమాగ్ని ఈమెకు ఎట్లు కలిగినది?

1105. పూలతో నిండి, జడ వాలిన భుజముపై తలపెట్టినపుడు ఎన్నో సుఖములు కలుగుచున్నవి.

1106. ఈమె భుజముపై వ్రాలిన నా తలను చేతితో తాకినపుడల్లా, నా ప్రాణము చిగురించుటచే ఈమె భుజములు అమృతముతో చేసినవా?

1107. మావి రంగుగల ఈమె నన్ను కౌగిలించుకొనునపుడు కలుగు సుఖము, కుటుంబములో అందరికీ భోజనము పెట్టి, తానూ తినినంత సుఖముగానున్నది.

1108. గాలి కూడ మధ్యన చొరలేని విధముగా ప్రేమికులు గట్టిగా చేయు ఆ లింగనము, ఒకరిపైనొకరికి ప్రేమానుభూతి వలన, ఇద్దరికీ సుఖము కలిగించును.

1109. ఉత్తుత్తి కోపము, కోపము తీర్చుకొనుట, సంభోగము ఇవి ప్రేమికుల కామలీలలో సుఖమునిచ్చునవి.

1110. గ్రంథములను చదువ, చదువ కొత్త అర్థములు పుట్టుకొచ్చునట్లు, ప్రేయసి ఇచ్చు సుఖము దిన, దినమూ కొత్త అనుభవములను కలిగించుచున్నదే!!

## 112. అందమే ఆనందము

1111. ఓ విరజాజి పుష్పమా! మంచి గుణవతియైన నా ప్రేయసి, నీకన్నా బహుసున్నితమైనది!!

1112. పలువురు చూచుటకు ఉద్యానవనములో పుష్పించిన ఓ పుష్ప మనసా! నా ప్రేయసి యొక్క కంటి పుష్పమునకు సమానముకావు.

1113. వెదురువంటి భుజములు గల ఆమె శరీరపు రంగు పసుపు, పళ్ళు ముత్యములు, సహజ సువాసనతో నిండిన శరీరము, కళ్లు శూలము వంటివి.

1114. సాధారణముగా పుష్పములకు చూచే కన్నులున్నచో, ఈమె కంటి అందమును చూచి సిగ్గుతో తలవంచుకొని నేలచూపులు చూచును.

1115. విరజాజి వంటి సున్నితమైన పుష్పమును కాడతో ధరించిన యెడల ఈమె సున్నితమైన నడుము విరిగి చనిపోయినచో, కళ్యాణ మేళమునకు బదులుగా చావు మేళము మ్రోగును.

1116. నక్షత్రములు కూడ ఈమె చంద్రబింబము వంటి ముఖమును చూచి చంద్రుడేమోనని పొరబడి తమ స్థానచలనమై తబ్బిబ్బులైనవి.

1117. ఆ నక్షత్రములకు ఏర్పడిన తబ్బిబ్బులకు కారణము, చంద్రబింబము వంటి ముఖములో చంద్రునిలో ఏర్పడు పక్షముల మార్పులు లేవేమోనని.

1118. ఓ చంద్రుడా! ఈమె ముఖమువలె ప్రకాశించుటకు నీకు సాధ్యమైతే కదా నేను నిన్ను ప్రేమించుటకు!!

1119. ఓ చంద్రుడా! పుష్పముల వంటి కన్నులుగల నా ప్రేయసిలాంటి ముఖము నీకు ఉండవలెనన్న నీవు పలువురి కంటి పడకుండా ఉండవలెను.

1120. విరజాజి పుష్పము, హంస తూలికలు కూడ ముళ్లువలె గుచ్చుకొని బాధించునంత సున్నితమైనవి ఈమె పాదములు.

## 113. ప్రేమికుల మాటలు

1121. నా ప్రేయసి ఇంపైన మాటలాడు నోటినుండి కారు లాలాజలము పాలలో తేనె కలిపినట్లు తియ్యగానున్నది.

1122. శరీరముతో ప్రాణమునకు ఎంతటి అనుబంధముగలదో అంతటి అనుబంధము కలది ఈ ప్రేయసితో మా ప్రణయము.

1123. నా కంటిలో నా ప్రేయసిని దాచుకొనవలెను. కావున, ఓ కంటిపాపా! నీవు ఎక్కడికైనా వెళ్లిపో, నా కంటిలో నీకు స్థానము లేదు.

1124. కలిసి జీవించుట అనునది ప్రాణము శరీరముతో కలిసిపోయినట్లు, ఈమెను విడిపోవుట అనునది ప్రాణము వీడి చనిపోవునట్లే!

1125. ప్రకాశవంతమైన కన్నులుగల ప్రేయసిని మరచిపోయినట్లైతే కదా ఆమెను మరలా తలంచుకొనుటకు. ఎన్నడూ ఆమెను మరువలేదు కదా!!

1126. ప్రేయసి కంటినుండి ప్రేమికుడు వెళ్లడు. రెప్పలు మూసియున్ననూ, తెరచియున్ననూ దానినుండి కదలడు. అంతటి సున్నితమైనవాడు ఆ ప్రేమికుడు.

1127. కంటిలోని నా ప్రియుడు కాటుక రాయుటచే కరిగిపోవచ్చునని తలంచి, కంటికి కాటుక రాసుకొనుట లేదు.

1128. నా ప్రియుడు నా హృదయముతో వున్నాడు కావున వేడి ఆహారము తినినచో అతనికి వేడి తగులును. కనుక వేడి ఆహారమును తీసుకోనుట లేదు.

1129. ప్రియుడు కంటిలోనే ఉండుటచే రెప్పలు వాల్చి నిదురపోవుట లేదు. ఇది చూచిన ఊరివారు అతనిపై నింద మోపుచున్నారే!!

1130. ప్రియుడు దూరప్రదేశమునకు వెళ్లిననూ, నా కంటిలోనే ఎల్లప్పుడూ నిలిచి ఉన్నాడు. కాని ఇది తెలియక ఊరివారందరు తను నన్ను వీడియున్నాడందురు.

# 114. లజ్జవీడిన ప్రేమ

1131. ప్రేమ లీలలు అనుభవించిన తరువాత వివాహమునకు అడ్డంకులు వచ్చిన యెడల తాటి గుర్రము (మడలై ఏరుదళ్*) ఎక్కుట ఒక్కటే దారి.

1132. ప్రేమ, దు:ఖమును ఓర్చుకోలేక శరీరమును, ప్రాణమును, సిగ్గును దూరముగా ఉంచి తాటి గుర్రము ఎక్కుటకు తీర్మానించుకొనెను.

1133. ప్రేమకు ముందు సిగ్గు, పరువు, మర్యాద అన్నీ పాటించే వాడిగా ఉంటిని, కాని ఇపుడు ప్రేమకొరకు తాటి గుర్రము ఎక్కువాడినైతిని.

1134. సిగ్గు, ధైర్యము అను మంచిగుణ తెప్పలను, కామమను వరద నీరు నానుండి విడదీసి కొట్టుకుపోయినట్లు చేసినది.

1135. చేతులలో పూల గాజులు ధరించిన నా ప్రేయసి సంధ్యాకాలమున కామము ఎక్కువ కావడముతో, తాటిగుర్రము ఎక్కుట గురించి ఆలోచింప చేసినది.

1136. ఈ ప్రేయసి కారణముగా రాత్రి అంతయూ నాకళ్లు నిదురించలేదు. అర్ధరాత్రి సమయమున తాటి గుర్రము గురించే ఆలోచించుచున్నాను.

1137. సముద్రమంత తీరములేని కామరోగము నా ప్రేయసికి వచ్చిననూ, సిగ్గు అను మంచి గుణము వలన ఆమె తాటి గుర్రము ఎక్కకుండుట జాతికే శ్రేష్ఠము.

1138. స్త్రీకి సిగ్గు, దయ అను గుణములు వున్ననూ, కామమును మాత్రము ఎంత ప్రయత్నించిననూ దాచడము కుదరదు.

1139. నాలోని కామమును ఎవరూ తెలుసుకోవడము లేదు. కావున నేనే దానిని బహిరంగపరుస్తాను అన్నట్లు వీధిలో అందరికి తెలియజేయుచున్నది.

1140. కామముతో ఒక స్త్రీ పడు అవస్థలను గుర్తించక, ఇతర స్త్రీలు నా ఎదురుగా నిలబడి హేళన చేయుట, వారి అజ్ఞానమే అగును.

---

*మడలై ఏరుదళ్ = తాటి ఆకులతో చేసిన గుర్రము ఎక్కుటచే, తాటి ఆకులు గీసుకొని శరీరము నుండి రక్తము కారుతూ వుండగా ఊరిని ప్రదక్షిణ చేసి, తమవారి ముందు తమకు న్యాయము చేయమని కోరుట ప్రాచీన తమిళ సంప్రదాయము.

# 115. బహిర్గతమైన ప్రేమ

1141. ఊరందరికి మా ప్రేమ గోల తెలియుటచే మా ప్రాణము నిలబడినది, అది మా భాగ్యమే అని తెలుసుకొంటిమి.

1142. నా ప్రేయసి యొక్క పువ్వుల వంటి కన్నుల గొప్పతనము తెలియక ఈ ఊరి ప్రజలు ఆమెను ఛీదరించుకొని గోల పెట్టుచున్నారు.

1143. ఈ ఊరి ప్రజలకి మా ప్రేమగోల తెలియడము వలన మేము ఎదుర్కొను తిట్లు, మా ప్రేమకు సహాయముగా ఉండి మహానందమును గలిగించుచున్నది.

1144. ప్రేమను బలపరచు ఊరివారి తిట్లు లేనియెడల, మా ప్రేమ సుఖము కొంత తగ్గిపోవును.

1145. కల్లు త్రాగుట వలన కాంక్ష పెరుగునట్లు, మా ప్రేమ వ్యవహారముపై తిట్ల గోల వలన సంతోషము కలుగుచున్నది.

1146. ఒకే ఒక్క రోజు ప్రేమికుల కలయిక అయిననూ, ఆ గోల చంద్ర గ్రహణము వలె ఊరందరికి తెలియపరచినది.

1147. ఈ ప్రేమ రోగమను పైరుకి ఊరివారి తిట్లు ఎరువుగాను, తల్లి యొక్క కఠిన మాటలు నీరుగా మారి ప్రేమరోగము మరింత వృద్ధియగును.

1148. నేతితో మంటను ఎట్లు ఆపలేమో, అట్లే ప్రేమను తిట్లతో ఆపలేము.

1149. వీడివెళ్లిన ప్రేమికుడు "భయపడకు తిరిగి వస్తానని" చెప్పి వెళ్లిన తరువాత ఊరివారి తిట్లకు ప్రేయసి భయపడనేల?

1150. వెళ్లిన ప్రేమికుడు నిశ్చయముగా తిరిగి వస్తాడు. వచ్చునంత వరకు ఈ ఊరివారి తిట్లు ఒక ఆదరణముగా ఉండనీ!!

# 116. వియోగ వేదన

1151. నీవు నన్ను వదిలి వెళ్లనన్నచో నాకు చెప్పుము, అదికానిచో వెళ్లి వేగిరముగా తిరిగి వచ్చెదనన్నచో, అంతవరకు ప్రాణముంచుకొను వారితో చెప్పుము.

1152. ప్రేమికుడుని చూస్తూ ఉన్న యెడల అది సుఖముగా నున్నది. అతను వీడి వెళ్లుటకు ఒప్పుకొనుట చాలా దు:ఖమును కలిగించుచున్నది.

1153. బుద్ధిశాలియైన ప్రేయసి అయిననూ ప్రేమికుడు వీడివెళ్లునపుడు ఓర్చుకొనజాలదు.

1154. "వీడను" అని చెప్పి, తను వీడి వెళ్లిన యెడల అతని ఎడ ప్రేయసి కోపగించుకోవడములో తప్పేమిటి?

1155. తనను కాపాడుటకు హామీ ఇచ్చిన తరువాత, ప్రేమికుడు తనను వీడి వెళ్లరాదు. అట్లు వెళ్లినచో ప్రేయసి ఓర్వజాలదు.

1156. ప్రేమికుడు తాను ప్రేయసిని వీడివెళ్లుట నిశ్చయము అనే స్థితికి వచ్చిన యెడల, మరలా తిరిగి వచ్చి కలుసుకొనునది సంశయార్థమే!!

1157. ప్రేమికుడు వీడి వెళ్లినందున శరీరము కృశించి చేతిలోనున్న గాజులు దిగజారి క్రిందకుపడు శబ్ధము ఊరివారందరికి వినబడును.

1158. తోడు, బంధువులు లేని ఊరిలో జీవించుట కష్టములు కలిగించును. దానికన్నా ప్రేమికున్ని వీడి జీవించడము చాలా దు:ఖమగును.

1159. నిప్పుని తాకితే కాలును. కాని తాకలేనంత దూరముగా ఉన్ననూ ప్రేమాగ్ని కాలును.

1160. వీడియున్ననూ, దు:ఖమును ఓర్చుకొని, వచ్చువరకు ఓపికతో కాచుకొని యుండి జీవించుట కొందరు స్త్రీలకే తగును.

# 117. విరహబాధ

1161. వీడియుండుట వలన కలుగు విరహ వేదన పరులకు తెలియకూడదని దాచిపెట్టుట సాధ్యము కాలేదు. తోడ, తోడ ఊటనీరు పెరుగుతున్నట్లు వేదన మరింత ఎక్కువగుచున్నదే!!

1162. వీడియుండుట వలన కలుగు వేదన మరువ సాధ్యము కాలేదు, ఈ వేదనను కల్పించిన ప్రేమికుడుకి సందేశము పంపుటకు నాకు సిగ్గుగా యున్నదే!

1163. కావడి అను ఈ దేహమునకు ఒక వైపు కామము, మరొక వైపున సిగ్గు వ్రేలాడి నన్ను బాధ పెట్టుచున్నవి.

1164. విరహ వేదన అనే సముద్రమును దాటుటకు సరైన నావ నా వద్ద లేదు.

1165. ప్రేయసితో స్నేహముగా ఉన్నప్పుడే ఆమెను వీడుట అను దు:ఖమును కలిగించు అతను, ప్రేయసితో శత్రుత్వము ఉన్నచో ఏమి చేయుదురో?

1165. కామముతో వచ్చు సుఖము సముద్రమువలె పెద్దది. ప్రేమికులు విడిపోయి ఉండడములో కలుగు కామవేదన మహా సముద్రము కన్నా పెద్దది.

1167. విరహవేదన అను మహాసముద్రములో ఎంత ఈదిననూ, తీరము చేరలేదు. అర్ధరాత్రి వరకు తోడు లేక ఒంటరిగా గడుపుచున్నాను.

1168. ఈ లోకములో జీవరాశులన్నింటికీ నిద్ర అను ఆశీస్సులు కురిపిస్తున్న రాత్రి, నాకు మాత్రము నిద్ర తోడు లేకుండా చేయుచున్నది.

1169. విడిపోయిన దు:ఖము కంటే, రాత్రి మరింత పెరిగిపోవుట చాలా దు:ఖమును కలిగించుచున్నది.

1170. వీడిన ప్రేమికునితోబాటు వెళ్లిన ప్రేయసి మనస్సువలె కళ్లు వెళ్లి ఉండినచో, ఈ కళ్లకు కన్నీటి గాధ ఉండదు కదా!!

# 118. కళ్ల అవస్థ

1171. ప్రేమతో చూచి, ప్రేమించుటకు సహాయపడి, కామరోగము పుట్టించినది ఆ కళ్లు. అలాంటి ఆ కళ్లు ఇప్పుడు ఏడ్వడమెందుకో?

1172. భవిష్యత్తులో జరుగబోవునది ఆలోచించక, కావాలని చూచిన వెంటనే ప్రేమలో పడునట్లు చేసిన ఆ కళ్లు ఇప్పుడు కన్నీరు కార్చనేల?

1173. ఆ రోజు ప్రేమికులను పురికొల్పి, ప్రేమింపజేసిన ఆ కళ్లు, ఈ రోజున ఏడ్వడము ఒక నవ్వులాటగా యున్నది.

1174. భరించలేని కామ రోగమును నాకు కల్పించిన కళ్లు మాత్రము ఏడ్చిఏడ్చి కన్నీరే కరువై ఎండిపోయినది.

1175. సముద్రము కన్నా పెద్దదైన కామరోగమును కల్పించిన పాపమునకు ఆ కళ్లు ఇప్పుడు నిద్రలేమి అను దు:ఖమును అనుభవించుచున్నవి.

1176. ఆహా! ఆహా!! మంచిదే అయినది, కామ రోగమును నాకు కల్పించిన ఆ కళ్లకు నిద్రలేమి మంచి దండనే అయినది.

1177. మొదట అతనిని ప్రేమతో చూచి, మైమరచి, వదలక చూచిన అవే కళ్లు ఇప్పుడు ఏడ్చి ఏడ్చి కన్నీరే ఇంకిపోవును గాక!!

1178. మనస్సులో మంచి తలంపుతో కలిసి, మెలిగి, ఇప్పుడు వంచనతో వీడి వెళ్లడముతో ఏడ్వడము ఒక ఆశ్చర్యమే!!

1179. ప్రేమికుడు ప్రేయసిని వీడి వెళ్లిననూ నిద్రలేదు, కలిసి ఆనందములో సుఖించునపుడూ నిద్రలేదు ఈ కళ్లకు!!

1180. ప్రేమికుడు ప్రేయసిని వీడి వెళ్లడము, దు:ఖించు కళ్ళ ద్వారా ఊరి వారందరికి తెలిసిపోవడముచే ఎడబాటుని దాచడము సాధ్యము కాలేదు.

## 119. పసుపు పచ్చదనము.

1181. ప్రేమికుని ఎడబాటు వలన శరీరము ఏర్పడిన పసుపు పచ్చ* రంగు మార్పును ఎవరికి చెప్పగలను?

1182. ఈ పసుపు రంగు ప్రేమికుని ఎడబాటు వలన కలిగినదని సగర్వముగా తెలియజేస్తూ ప్రేయసి శరీరమంతా సోభివలె వ్యాపించిపోతున్నది.

1183. వీడిన ప్రేమికుడు, విరహ వేదనను, పసుపు సోగను ప్రేయసికి ఇచ్చివేసి, ఆమె యొక్క అందము, సిగ్గును తనతో తీసుకొనివెళ్లెను.

1184. ఎల్లవేళలు ప్రేమికునిపై తలంపుతో ఉండి అతని మంచి గుణములను తలంచుతూ, అతని ఎడబాటును తలంచకుండిననూ, ఈ పసుపు సోగ వంచనతో వ్యాపించుచున్నదే!!

1185. అక్కడ చూడుము! నా ప్రేమికుడు వీడి వెళ్లియున్నాడు. ఇక్కడ చూడుము! నా శరీరమంతయూ పసుపు రంగు వ్యాపించియున్నది.

1186. దీపమును తొలగించిన వెంటనే చీకటి అలుముకొన్నట్లు, ప్రేమికుడు వీడిన వెంటనే ప్రేయసి శరీరమునకు పసుపు రంగు అలుముకొని యున్నది.

1187. ప్రేమికున్ని గట్టిగా ఆలింగనము చేసుకొనియుంటిని, ఇప్పుడు నన్ను వీడి దూరముగా ఉండుటచే నా శరీరమంతయూ పసుపు రంగు సోభివలె వ్యాపించియున్నది.

1188. ప్రేయసి శరీరమున వ్యాపించి ఉన్న పసుపు రంగుని కించపరచువారు, దానికి కారణమైన ప్రేమికున్ని ఎవరూ నిందించరేమి?

1189. ఎడబాటు ఇద్దరికీ సమ్మతమైనదైననూ, అతనికి దానివలన మంచి స్థానము లభించినచో, ప్రేయసికి ఈ పసుపు రంగు ఉండుగాక!!

1190. "ప్రేయసి శరీరముపై పసుపు రంగు ఏర్పడినది" అని పేరొందిననూ పరవాలేదు. వీడి వెళ్లిన ప్రేమికున్ని దూషించకుండా ఉంటే అదే చాలును.

*నిండు నిద్రలేక సదా విరహ భాదతో ఉండువారికి రక్తము క్షీణించి, రక్త సోగగా మారుటచే శరీరమంతయూ పసుపు పచ్చగా మారును.

## 120. ఒంటరి బాధ

1191. భార్య, భర్తను ఇష్టపడునట్లే, అంతే సమానముగా ఆమెను ఇష్టపడు భర్త జీవితమునకు తోడైతే, అది విత్తనములేని పండువలె చాలా రుచించును.

1192. లోకములోని వారికి అవసరమైనపుడు, అవసరమైనంత వర్షము కురుయునట్లు, భార్యకు భర్త యొక్క ప్రేమ కుదరవలెను.

1193. తను ప్రేమించే భర్త తనను ప్రేమించినచో, ఆ స్త్రీకి "మనము సుఖముగా జీవించుచున్నామన్న" గొప్పతనము కలుగును.

1194. భార్య కోరిన భర్త, ఆమెని అట్లే ప్రేమించలేదనినచో, అటువంటి ప్రేమ దురదృష్టమే అగును.

1195. అతను తనను ప్రేమించనపుడు, తాను మాత్రమే అతనిని ప్రేమించినచో, తనకు అతనేమి సుఖమును ఇవ్వగలడు?

1196. కామ క్రీడలో భర్త, భార్య ఇద్దరూ త్రాసుకు సమతూకముగా ఉన్నచో సుఖము ఎక్కువగును.

1197. ఒకరి వద్దనే వుండి తన పనిని కానిచ్చుచున్న కామదేవుడు ఆమెకు మాత్రము కామరోగమును, దు:ఖమును కల్పించడమెందులకో?

1198. తనను వీడి వెళ్లిన ప్రేమికుని వద్ద నుండి ఎటువంటి సందేశము పొందక, ఓర్పుతో జీవించుచున్న ప్రేయసి వంటి హృదయము ఉన్నవారు ఈ లోకములో అరుదే!

1199. ప్రేమికుడు తనంత తానే ఎటువంటి సందేశము పంపకపోయినా, అతని గురించి శుభవార్త వినినచో అది ఆమె చెవులకు ఆనందము కలిగించును.

1200. ఎడబాటు వలన కలిగిన విరహ వేదన తెలియని అతనికి తను తిరిగి వచ్చిన తరువాత చెప్పదగును. ఓ మనసా! సముద్రము వంటి ఈ విరహ వేదన నీవు ఓపికగా జయింతువుగాక!!

# 121. తలచి ఏడ్చుట

1201. తలంచినంత మాత్రమున సుఖమునిచ్చునది కామము, కనుక కల్లు కన్నా కామము గొప్పదగును.

1202. తాను కోరిన వారిని తలంచుటచే ఏ కష్టము లేనపుడు, ప్రేమ ఎంత, ఎట్లు ఉన్ననూ సుఖము నిచ్చునదే తప్ప మరొకటి కాదు.

1203. ప్రేయసిని తలంచిన ప్రేమికుడు వెంటనే మనస్సు మార్చుకున్నాడేమో! వచ్చిన తుమ్ములు కూడ మధ్యలోనే ఆగిపోయినవే!!

1204. ప్రేయసి మనస్సున ప్రేమికుడు ఎల్లపుడు నిలచియున్నాడు, అట్లే ప్రేమికుని మనస్సున ప్రేయసి నిలచియున్నదా?

1205. ప్రేయసి గురించి తన మనస్సులో తలవని ప్రేమికుడు, తను మాత్రము సిగ్గులేక ప్రేయసి మనస్సులోకి వచ్చి నిలుచున్నాడే!!

1206. ప్రేమికునితో కలిసి సుఖముగా గడిపిన రోజులను తలంచుకుంటూ జీవించుచున్నది ప్రేయసి. మరే కారణము వలన కాదు.

1207. అతనితో గడిపిన సుఖ ఘడియలను మరువక ఉండు కాలములో ఎడబాటుని తలంచినచో హృదయము మండుచున్నదే, ఇక ఆ సుఖ ఘడియలను మరచినచో ఏమైపోదునో!!

1208. వీడివెళ్లిన ప్రేమికునిపై కోపమున్ననూ, అతను మాత్రము మనస్సులో ఏ కోపము లేకుండా ఉండుటయే ప్రేయసికి చేయు సహాయము.

1209. "నీవూ నేనూ వేరువేరు కాదు" అని ఒకటిగా కలసియున్న కాలములో ప్రేమికుడు చెప్పిన మాటలనే తలంచుకుంటూ ప్రేయసి జీవించుచున్నది.

1210. ఓ చంద్రుడా! నీవు కదలకు!! నన్ను వీడి వెళ్లిన నా ప్రియుడు తిరిగి నా వద్దకు వచ్చి చేరుట, నా కళ్లతో చూచువరకు నీవు అస్తమించకు.

## 122. కలల పరిస్థితి చెప్పుట

1211. ఎడబాటు దు:ఖమును పోగొట్టుటకు, ప్రేమికుడు కలలో పంపిన సందేశమునకు ప్రేయసి ఎట్లు సంతోషించి జవాబు ఇవ్వగలదు?

1212. చేపవంటి కన్నులు గల ప్రేయసికి కోరినపుడు నిద్ర వచ్చినట్లైతే, తాను వేచియున్నది కలలో చెప్పదగును.

1213. వీడి వెళ్లిన అతన్ని ఎదుట చూడకపోయిననూ కలలో చూచుటచే ఆమె ఇంకా జీవించుచున్నది.

1214. ఎదుట ఉండి సుఖము ఇవ్వకపోయిననూ, కలలో వచ్చి కనిపించుటచే అది ప్రేయసికి సుఖముగా ఉన్నది.

1215. ఎదుట ఉండి ఇచ్చిన సుఖము అప్పటికే, కాని ఇపుడు కలలోకి వచ్చి ఇచ్చు సుఖము ఎప్పటికీ మహానందముగా ఉన్నది.

1216. 'తలంపు అనునది లేనియెడల కలలో అతను కనిపించి ఇచ్చిన సుఖము వలన మాకు ఎడబాటు లేదని చెప్పవచ్చును.

1217. మెలకువగా ఉన్నపుడు ఇవ్వని సుఖము, నా కలలోకి వచ్చి నన్ను పీడింపనేల?

1218. నేను నిదురించునపుడు నా కలలోకి వచ్చి నా భుజముపై వాలిన అతను, మెలకువ వచ్చిన వెంటనే నా మనస్సులోనికి వెళ్లి దాగున్నాడు.

1219. కలలో తమ ప్రేమికుడుని చూడలేని ప్రేయసీలు, మెలకువగా ఉన్నపుడు అతను ఏమి చేయలేదని ఏడ్చెదరు.

1220. ఈ ఊరివారు, ప్రేమికుడు ప్రేయసిని వీడి వెళ్లినని చెప్పుదురుకాని, అతడు ఆమె కొరకు ఆమె కలలోకి రావడము తెలుసుకోలేరు కాబోలు!!

## 123. సంధ్యాబాధ

1221. ఓ సంధ్యా సమయమా! నీవు జీవించుగాక! సంధ్యాకాలము కాదు, ప్రేమికుల ప్రాణములను హరించు కాలము నీవు!!

1222. మత్తునిచ్చు సాయం సమయమా! నీవు జీవించుగాక! నీ ప్రకాశము కోల్పోయి ఉన్నావే! నీ తోడు కూడ నా తోడువలె దయలేనివాడా?

1223. మంచు కురుయుట, చీకటికమ్ముకొను సంధ్యా కాలము ఇపుడు ప్రేయసికి కష్టములను కలిగించి దు:ఖించునట్లు చేయుచున్నవి.

1224. ప్రేమికులు విడిపోవు సమయమున వచ్చు సంధ్యాకాలము, వారిని చంపుటకే వచ్చియున్నట్లు తెలియుచున్నది.

1225. ప్రేయసి, తను పగటి కాలమునకు చేసిన మేలు ఏమిటి? సంధ్యా సమయమునకు చేసిన కీడు ఏమిటి? ఏల ఇంత బాధ?

1226. సంధ్యా సమయము ఇచ్చు కష్టములను, నా భర్త విడిపోవుటకు ముందు నేనెరుగను.

1227. ఈ విరహ వేదన, ఉదయమున తొడిమగాను, మధ్యాహ్నము మొగ్గగాను, సంధ్యా సమయమున పుష్పించిన పుష్పముగాను పెద్దదగుచున్నదే.

1228. వీటి మధ్యన పిల్లనగ్రోవి శబ్దము నిప్పువలె కాల్చునట్లున్నూ, సంధ్యా సమయ ఆసన్న సందేశము వచ్చి నన్ను చంపు సైన్యమైనట్లున్నదే!!

1229. సంధ్యా సమయమును తలంచినచో ప్రేయసి యొక్క మతిచెడి, స్థానము తప్పి తటపటలాడినట్లు ఈ ఊరునూ దు:ఖమును అనుభవింపజేయుచున్నదే!!

1230. ధనము సంపాదింపగోరి వెళ్లిన ప్రేమికున్ని వీడి ఉండడము, తనురాకపోవడముతో, ఈ సంధ్యా సమయమునే ప్రాణము పోవునట్లున్నదే!!

# 124. అంగ సౌందర్యము నశించుట

1231. ప్రేమికులు ఒకటిగా ఉన్నపుడు పుష్పము యొక్క అందమును జయించిన ఆ కళ్లు, ప్రేమికుని ఎడబాటుతో ఏడ్చిఏడ్చి వాడిపోయి, ప్రకాశము కోల్పోయి పుష్పముతో ఓడిపోయినది.

1232. రంగుమారి, కన్నీరు ఇంకిపోయిన ఆ కళ్లు, పరులకు ఆమె బాధను చూపించునట్లున్నవి.

1233. ప్రేమికున్ని, వివాహమాడిన తరువాత పొంగిన ఆ భుజములు, ఇపుడు ఎడబాటు వలన కృశించిపోయినవే!!

1234. సహజ సౌందర్యముతో పొంగిన ఆ భుజములు, చేతులు సన్నబడి, ఎర్రని మెరుపు కోల్పొయి, చేతిలో ధరించిన గాజులు కూడ క్రిందకు జారిపోయినవి.

1235. చేతి గాజులు క్రిందకు జారిపోయి మునుపటి సౌందర్యమును కోల్పోయిన భుజములు, చేతులు ప్రేమికుని యొక్క కఠినత్వమును చాటుచున్నవి.

1236. గాజులు జారిపోవునంత శరీరము కృశించిననూ, ప్రేయసి ప్రేమికుని ఎడబాటు వలన పరులు పలికే కఠిన మాటలను సహించజాలకున్నది.

1237. ఓ మనసా! కఠిన మనస్కుడైన నా ప్రేమికునికి నా భుజములు వాడిపోయినవని చెప్పి నీవు గొప్ప పొందలేవా?

1238. ప్రేయసికి నొప్పి కలుగునని, భుజములను నిమురుట విరమించిన ప్రేమికుడు, కృశించి, రంగుమారిన ఆమెను వీడి వెళ్లడముతో ఆమెకు ఏమైపోయినదో!!

1239. ఇద్దరూ ఆలింగనములో వున్నపుడు శరీరముల మధ్య దూరిన గాలికి కోపించి ఆమె కళ్లు రంగు మారినవే! ఇప్పటి పరిస్థితికి ఆమె ఏమైపోయినదో!!

1240. మెరుస్తూ ఉండే ఆమె నుదుటిపై రంగు మారడము, శరీరము కృశించడము చూచిన ఆ కళ్లు ప్రకాశము కోల్పోయి ధు:ఖించుచున్నవి.

## 125. మన:పలవరింత

1241. ఓ మనసా! నా తీరని రోగమునకు తగిన మందు ఒక దానిని యోచించి చెప్పలేవా?

1242. ఓ మనసా! జీవించుగాక! అతనికి నీపై ఏ ప్రేమ లేకపోవుట, నీవు మాత్రము అతని రాక కొరకు ఎదురుచూచి దు:ఖించుట నీ అజ్ఞానమే.

1243. మనసా! నీవు ఉండి దు:ఖించనేల? ఈ రోగమును కల్పించిన వానికి నన్ను తలంచునట్లు చేసి దు:ఖింపచేయ జాలకున్నానే!!

1244. ఓ మనసా! నీవు అతని వద్దకు వెళ్లునపుడు ఈ కళ్లను నీతో తీసుకువెళ్లుము, ఈ కళ్లు అతనిని జూడగోరి నన్ను మ్రింగునట్లు చూచుచున్నవి.

1245. ఓ మనసా! మనము కోరిననూ అతను మనల్ని కోరలేదని తలచి అతనిని విడిచిపెట్టడము జరుగునా?

1246. ఓ మనసా! అతనిని చూచిన వెంటనే పులకరించిపోవు నీవు, ఇపుడు అతను కఠినుడని ఏల ఛీదరించుకుంటున్నావు?

1247. ఓ మంచి మనసా! నీవు కామమునైనా విడువుము లేక సిగ్గునైనా విడిచిపెట్టుము. ఒకదానికొకటి వేర్వేరు కనుక నేను ఓర్వకున్నాను.

1248. ఓ పేద మనసా! జాలిపడి అతను తిరిగి వచ్చి నీకు మంచి చేయుదురని తలంచుచున్నావా?

1249. ఓ మనసా! ప్రేమికుడు నీయందే ఉండగా, నీవెక్కడికి వెళ్లి అతని కొరకు వెదకుచున్నావు?

1250. వీడి వెళ్లిన అతని ఇంకా మనస్సులో ఉంచుకొనిన యెడల మరింత మనస్సు, శరీరము కృశించిపోవలసినదే!!

# 126. అభిమానము క్షీణించుట

1251. 'సిగ్గు' అను తాళముతో మూయబడిన 'శీలము' అను ద్వారమును 'కామము' అను గొడ్డలి పగులగొట్టును.

1252. 'కామము' అనునది ఒకటి అర్ధరాత్రియందు నా మనస్సులో ఉండి నన్ను వేదించుచున్నది.

1253. ఆపుకొను వీలుకాని తుమ్ములవలె కామము కూడ అణగక బయటికి వచ్చివేయును.

1254. అణగద్రొక్కగలనని నేను అనుకొన్ననూ, కామము ఏదో దాచియుంచినది బయటికి వచ్చి వేయునట్లు అందరికి తెలియపరచుచున్నదే!!

1255. వీడివెళ్లిన వాని వెంటబడకూడదన్న ఆత్మాభిమానము, ఈ కామరోగమున్న వారికి లేదు కాబోలు!!

1256. వీడి వెళ్లిన వానివెంట వెళ్లుట వలన కలుగు కామ మహిమలు ఎన్నెన్నో!!

1257. కోరుకున్నవాడు, ప్రేమతో తమకు ఇష్టమైనవి చేసినచో, సిగ్గు అనునది తెలియకుండును.

1258. కపట మాటలు, ఇంపైన సొంపైన మాటలు కదా ప్రేయసి మనస్సును దోచుకొనుటకు సైన్యముగా మారినవి.

1259. ప్రేమికుని వద్ద మైమరచిపోకూడదనుకున్ననూ, నా మనస్సు స్వాధీనము తప్పి అతనితో కలిసిపోయినట్లైనదే!!

1260. అగ్నిలో వేసిన నేయివలె కరిగిపోవు మనస్సుగల వారికి, సంగమమైన తరువాత విడి,విడిగా యుండుటకు సాధ్యమగునా?

# 127. మనో వేదన

1261. వీడి వెళ్లిన ప్రేమికున్ని తలచి తలచి కత్తివంటి కళ్లు కూడ గడ్డిపోచలవలె సన్నగిల్లినవి. అతను వీడి వెళ్లిన రోజులను లెక్కపెట్టిన వ్రేళ్లు అరిగిపోయినవి.

1262. ఆభరణములను ధరించిన ఓ సఖీ! ఇపుడు అతనిని మరచినచో, ముందే చేతినుండి దిగజారిన గాజులు ఇంకా దిగజారి క్రింద పడిపోవును.

1263. ప్రేమికుడు లక్ష్య సాధన కొరకు దృఢమైన మనస్సుతో వెళ్లెను. అయితే, ప్రేయసి అతనిని మరువక యుండుటచే జీవించుచున్నది.

1264. వీడివెళ్లిన అతను తిరిగి ప్రేమతో వచ్చి కలియుననే నమ్మకముతో నా మనస్సు చెట్టుకొమ్మ చివరి కెక్కి ఎదురు చూచుచున్నది.

1265. నా ప్రేమికున్ని నేను కళ్లార చూచెదను, అతన్ని చూచిన తరువాతే నా సున్నిత భుజములపై ఏర్పడిన పసుపుపచ్చ రంగుఛాయ తగ్గును.

1266. ఏదో ఒక రోజు అతను వచ్చితీరును, వచ్చినచో ఈ విరహవేదన అంతయూ పోవునట్లు సుఖము అనుభవించెదను.

1267. కళ్లు వంటి ప్రియమైనవాడు వచ్చినచో, నేను తొలుత కోపము చూపుదునా? లేక ఆలింగనము చేసుకొనుదునా? లేక కలిసి ప్రేమ సల్లాపములాడుదునా? తెలియలేదే!!

1268. ప్రేమికుడు, జయప్రదముగా యుద్ధము ముగించి ఇంటికి వీరుని వలె వచ్చినచో నేను అతనితో సంధ్యాకాలములో సుఖమును రుచి చూడకోరుదును.

1269. వీడి దూరదేశము వెళ్లిన వాడు తిరిగివచ్చు రోజును తెలిసికొనినచో, ఎదురుచూచు ఒక్కొరోజు ఏడు రోజులవలె కనిపించును.

1270. ఎన్ని జయించిననూ, ఎంత జయము పొందిననూ, విరహవేదన, మరియు వియోగము వలన ప్రేయసి మనస్సు విరిగిపోయినచో ఏ ప్రయోజనమూ లేదు!!

## 128. సూచనలు

1271. నీవు మరచిపోవలెనని తలంచిననూ, నీ కళ్లు నీ ప్రేమను, నిన్ను కాదని బయటకు వెలిబుచ్చుచున్నవే!!

1272. కళ్లు నిండిన అందమునూ, వెదురువంటి భుజములునూ కలిగిన ప్రేయసిలో స్త్రీలకు తగిన అందములు చాలా ఉన్నవి.

1273. మణులు గ్రుచ్చిన మాలలో, దారము బయటికి కనిపించునట్లు, ఈమె ఆభరణముల మధ్య అందమైన చిహ్నములు కలవు.

1274. పుష్పముల యొక్క మొగ్గలో వాసన ఇమిడియున్నట్లు, ఈమె చిరునవ్వు అను మొగ్గలో ప్రేమ ఇమిడిన గుర్తు ఒకటి కలదు.

1275. ప్రేమికుల విరహవేదనకు, ప్రేయసి ఓపికయే ఆమె ప్రేమికునికి ఇచ్చు మందు అగును.

1276. ఎక్కువగా ప్రేమించి, వీడివెళ్లి, మరలా కలుసుకొన్నపుడు ప్రేయసికి కలుగు సంకోచము, కోపము, ఆమెలోని ప్రేమను చూపు గుర్తులై అగును.

1277. శాంత స్వభావమున్న ప్రేమికుడు వీడి వెళ్లడము, తెలియుటకు ముందే చేతినుండి జారిపోవు గాజులు చెప్పివేయుచున్నవి.

1278. ప్రేమికుడు నిన్ననే నన్ను వీడి వెళ్లెను. కాని ఏడు దినములైనట్లు నా శరీరములో పసుపుదనము వచ్చినదే.

1279. గాజులను చూచి, సున్నితమైన భుజములను చూచి, నేలను చూచునట్లు చేసినవి ఆమె అతనితో వెళ్లిన గుర్తులు.

1280. విరహ వేదనను కళ్లతోనే తెలియజేయునదియు, ప్రేమను తెలియజేయునదియు అగు సూచనలు స్త్రీత్వముకే గొప్ప గుణములగును.

# 129. కలయిక కోరికలు

1281. తలచిన వెంటనే మనస్సును ఉప్పొంగించునది, చూచిన వెంటనే సంతోషమును కలిగించునది అయిన గుణము కల్లునకు లేదు, అయితే కామమునకు కలదు.

1282. కామము కొండంత ఉన్ననూ, ప్రేమికుల మధ్య హాస్యమునకైనను చిన్న కొట్లాట ఉండుట తగదు.

1283. ప్రేయసికి తగని పనులు ప్రేమికుడు చేసిననూ, ప్రేయసి కళ్ళు మాత్రము అతని చూట్టూ తిరుగుతూ యుండును.

1284. సఖీ! అతనితో చిన్న కొట్లాట కొరకు వెళ్లితిని, కాని నా మనస్సు దానిని మరచి కలయికతో ఒకటైనది.

1285. వ్రాయునపుడు వ్రాయుపుల్లని కళ్లు చూడవు, అట్లే ప్రేమికుడు చేసిన తప్పులు అతనిని చూచినపుడు జ్ఞాపకము రావడము లేదు.

1286. అతనిని చూచునపుడు అతనియొక్క తప్పులు నాకు కనిపించడము లేదు, అతనిని చూడనపుడు అతని తప్పులే కనిపించుచున్నవి.

1287. వరదనీటిలో దూకినచో కొట్టుకొనిపోవునని తెలిసి కూడ నీటిలో దూకినట్లు, ఉత్తుత్తి కోపముచే కొట్లాట తెచ్చుకొనుట ఎందులకో?

1288. దొంగా! నీ ఛాతిపైన సుఖము!! కల్లు త్రాగుట వలన అది నీచము, కీడు కలిగించిననూ దానిని కోరి సుఖము పొందునట్లే కదా!!

1289. పుష్పము కన్నా సున్నితమైనది కలయిక, దీని పక్వము తెలుసుకొని నడచుకొనువారు కొందరే!!

1290. ప్రేయసి కంటితో కపటి కోపము చూపి దూరమైనది, తరువాత దానిని మరచి నా కన్నా శీఘ్రముగా వచ్చి నాతో కలిసిపోయినదే!!

## 130. మనోఘోష

1291. అతని మనస్సు నా గురించి ఎన్నడూ ఆలోచించనపుడు, నా మనస్సు మాత్రము సదా అతని గురించి ఆలోచించుట ఎందులకో?

1292. నా మీద ప్రేమ లేదని బాగా తెలిసికూడ, నేను వెళ్లితే అతను కోపించరు అని నా మనస్సు అతని వద్దకు వెళ్లుచున్నదే!!

1293. లోకములో బాగా బ్రతికి చెడినవారికి స్నేహితులు లేరనట్లు, ఓ మనస్సా! నీవు అతని వద్దకే వెళ్లుచున్నావే!!

1294. అతనితో ముందు జగడమాడి, తరువాత సుఖము అనుభవించిన విషయము తెలిసిన నీతో ఇకపై దాని గురించి ఎవరు మాట్లాడుదురు మనసా!!

1295. అతనిని చూడనపుడు, చూడలేదే అని నా మనస్సు తపించును, చూచిన వెంటనే ఎడబాటు గురించి భయపడును!!

1296. వీడి వెళ్లిన అతని గురించి తలంచునపుడు కలుగు దు:ఖము నన్ను తినువేయునట్లున్నదే!!

1297. అతనిని మరచిపోవడమే చేతకాక, నా బుద్ధిలేని మనస్సు వలన నా సిగ్గు, బిడియమును మరచిపోతిని.

1298. ప్రాణముపై తీపి వలన, నా మనస్సు అతనిని వీడియున్నచో నాకు కీడు కలుగునన్న తలంపుతో, అతని మంచినే ఎప్పుడూ కోరుచున్నది.

1299. ఒకరికి కష్టములు కలుగునపుడు, వాటిని నివృత్తి చేయుటకు వారి మనస్సు వారికి తోడ్పడలేదన్నచో మరెవరు వచ్చి తోడుండెదరు?

1300. ఒకరికి తమ మనస్సు తమ అధీనములో లేదన్నచో వేరెవరో సహాయమునకు వచ్చి వారిని ఓదార్చలేరు కదా!!

# 131. ఉత్తి అలక

1301. ప్రేమికుడు వచ్చిన వెంటనే నీవు అతనిని కౌగిలించుకొనక కొంచెము దూరముగా ఉండి, ఎడబాటు పొందిన దు:ఖమును అతను ఎరుగునట్లు చేయుము.

1302. ఉత్తుత్తి కోపము ఆహారము రుచికి కావలసిన ఉప్పు వంటిది. కాని అది ఎక్కువైనచో రుచి పాడైపోవును.

1303. కోపించిన వారి కోపము పోగొట్టి కౌగిలించుకొనకుండుట, ముందే అనుభవించుచున్న దు:ఖమును మరింత ఎక్కువ చేయుటయే అగును.

1304. కోపించి, కోపము పోగొట్టి వారితో చేరకుండుట, ముందే నీరులేక ఎండిపోయిన మొక్కను పీకి పారివేయునట్లే అగును.

1305. మంచిని కోరు ప్రేమికుని లక్షణము, కలువరేకుల వంటి కన్నులగల ప్రేయసి మనస్సులోనున్న ఉత్తుత్తి కోపమును తీర్చుటయే!!

1306. ప్రేమికుల మధ్య ఉత్తుత్తి కోపము గిల్లికజ్జాలు లేనియెడల, ఆ కలయిక బాగా ముగ్గిన పండువలె కాక లేత కాయవలె రుచించదు.

1307. గిల్లికజ్జాల వలన, ఇక ప్రేమ కలయిక సాగదేమోనన్న భయము పుట్టి కొన్ని సమయములలో దు:ఖమునకు దారి తీయవచ్చును.

1308. ఉత్తుత్తి కోపమును అర్ధము చేసుకోలేని ప్రేమికుల మధ్య అటువంటి కోపములతో ప్రయోజనము లేదు.

1309. నీరు కూడ, నీడలో ఉండి త్రాగునపుడే చల్లదనపు సుఖమునిచ్చునట్లు, నిజమైన ప్రేమానుభూతి ఉన్న ప్రేమికుల మధ్య ఉత్తుత్తి కోపము మరింత సుఖమునిచ్చును.

1310. ఉత్తుత్తి కోపము వలన దూరమైన ప్రేమికుడు మరలా తిరిగివచ్చి కలియునని చెప్పునది మనస్సులో కలిగిన ఆ ఆశయే!!

# 132. ఉత్తి జగడము

1311. స్త్రీలందరు వారి కళ్లతో, నీయొక్క విశాలమైన ఛాతిని చూచి సుఖమును అనుభవించుదురు, కాబట్టి నేను నీ ఛాతిపై చేరజాలను.

1312. అతనిపై ఉత్తుత్తి కోపముతో ఉన్నపుడు "దీర్ఘాయుష్మాన్ భవ!" అని చెప్పుదునని తలంచి తను తుమ్మిరి.

1313. పూలమాలలు ధరించి అతను ప్రేయసి ముందు నిలబడిననూ, వేరెవరి కొరకో మాలలు ధరించి ఉన్నారని ఎత్తి పొడిచి ఉత్తి జగడములాడును.

1314. "అందరికన్నా నిన్నే నేను ఎక్కువగా ప్రేమించుచున్నాను" అని ప్రేమికుడు చెప్పిననూ, ప్రేయసి మాత్రము "ఎవరినీ, ఎవరినీ?" అని జగడములాడును.

1315. "ఈ జన్మలో మనము విడిపోము" అన్న మాటలకు, మరు జన్మలో విడిపోవుదమా ఏమిటని? కన్నీరు కార్చును.

1316. "ఇప్పుడే తలంచితిని" అన్నచో, ప్రేయసి "ఎప్పుడు నన్ను మరచితిరి ఇప్పుడు తలంచుటకు''? అని కోపము తెచ్చుకొని జగడములాడును.

1317. తుమ్మితిని, వెంటనే తను దీవించెను, "మరలా ఎవరు మిమ్మల్ని తలంచిరి? ఎందుకు మీరు తుమ్మితిరని" నాపై నేరము మోపి ఏడ్చును.

1318. నాకు వచ్చిన తుమ్మును ఆపితిని, "ఎవరో మిమ్మల్ని తలంచుటచే, నన్ను మభ్యపెట్టుటకు వచ్చిన తుమ్మును ఆపితిరి" అని మరలా ఏడ్చును.

1319. ప్రేయసికి నచ్చిన మంచి మాటలాడి కోపమును పోగొట్టిననూ, ఇట్లే కదా మిగతా వారిని కూడ సమాధానపరచి యుందురని తలచి ఏడ్చును.

1320. ప్రేయసి అందము చూచి మురిసిపోయిననూ, "ఇట్లే కదా పరస్త్రీల అందమును నాతో పోల్చి చూచుచున్నారని" నేరము మోపి కోపించును.

# 133. అలక ప్రేమ

1321. అతనిపై ఏ నేరములేకపోయినా అతనిపై ఉత్తి కోపము చూపించుట వలన ప్రేమికుల కలయిక మరింత సుఖమునిచ్చునదే అగును.
1322. ఉత్తి అలక వలన మొదట కొంచెము కష్టము కలిగిననూ, తరువాత దానివలన అధిక సంతోషము కలుగుటచే, అది మంచిదే అగును.
1323. భూమిలో ఇంకిపోయే నీరువలె, ఒకటైన ప్రేమికుల ఉత్తి కోపము వలన కలుగు మహానందము దేవలోకములోనున్నదా?
1324. పట్టు సడలని గాఢమైన ఆలింగనమునకు ముందు దానికి కారణమైన ఉత్తికోపము ప్రేమికుల హృదయములను వికసింపజేయు సైన్యమగును.
1325. ప్రేమికునిపై ఏ తప్పు లేకున్ననూ, ప్రేయసి చేయు ఉత్తి జగడము వలన తన సున్నిత భుజములను నిమరకుండిననూ అందు ఒక సుఖము కలదు.
1326. ఎక్కువ పర్యాయములు భుజించుటకంటె, భుజించిన ఆహారము జీర్ణము కావడము ముఖ్యము, అట్లే ప్రణయ కలయికలో సుఖము కన్నా ఉత్తి కోపము, జగడములు ఎక్కువ సుఖమే.
1327. ఉత్తి జగడములో ఓడిపోయిన వారిదే గెలుపు, ముందు ఓడిపోయినట్లు కనిపించినను అది గెలుపని కలయిక సమయములో గుర్తింపదగును.
1328. ప్రేయసి నుదుటన ఏర్పడిన చమట బిందువుల ఉప్పు రుచి ప్రేమికుని కలియకతో ఏర్పడిననూ, ఉత్తి జగడము వలన ఏర్పడిన రుచి ఎక్కువ.
1329. ఉత్తి కోపము, జగడములు పొడిగించుకుంటూ వెళ్లుగాక! ఆ జగడములు, కోపము తీర్చుట, అటుపిమ్మట సుఖము అనుభవించుటకు రాత్రి వేళను ఎక్కువ చేయవలసియుండును.
1330. ప్రేమికుల మధ్య ప్రేమానుభూతితో ఏర్పడు ఉత్తి కోపము, జగడములు సుఖమును ఇచ్చునవే. వాటి ముగింపు గాఢమైన ఆలింగన సుఖమే!!

**--- సమాప్తం ---**

# <u>స్వీయ పరిచయము</u>



శెవ్వాన రంగనాయకులు కృష్ణారావు M.Com., P.G.D.C.A, (ICWA) పుట్టి పెరిగినది, చదువుకున్నది మద్రాసులో. తండ్రి, తాతగార్లు శ్రీకాకుళము జిల్లాలోని హీరమండల తాలుకా సువలై గ్రామస్తులు. పిదప మద్రాసుకు వలస. ఉద్యోగము మద్రాసు, కోయంబత్తూరులోను కాస్ట్ అకౌంటింగ్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసి పదవి విరమణ అనంతరము విశాఖపట్టణములో స్థిర నివాసము. పెద్దలు వంద సం॥ల పైగా మద్రాసులో నివాసము వలన తమిళ భాషలో పట్టుతో, అచ్చుతేనె తెనుగుపై ప్రేమతో మాతృభాషాభిమానము వలన, తెలుగువారికి సాహితి రంగమున చేయదగిన సహాయము చేయగోరి, ఇది ఒక చిన్న ప్రయత్నము. ఇది వరకే మా గురువుగారి ఆనతి ప్రకారము, తను రచించిన తమిళములోని **"సాంఖ్యయోగము"**ను తెలుగున అనువదించబడినదని సవినయముతో తెలిపించుచున్నాము.

E-mail ID: sevvanakrishna@yahoo.com

Cell: 9704655002

# స్వీయ పరిచయము



గుండాన జగన్నాధ రావు AMIE. పుట్టి పెరిగినది చదువుకున్నది శ్రీకాకుళము జిల్లాలో. తండ్రి, తాతగార్లు శ్రీకాకుళము హీరమండల తాలుకాలోని బత్తిలి గ్రామస్థులు. పిదప మహారాష్ట్రమునకు వలస. ఉద్యోగము నాసిక్ హెచ్.ఏ.ఎల్.లో డిజైన్ ఇంజనీర్ (ఏరోనాటికల్). పనిచేసి పదవి విరమణ అనంతరము విశాఖపట్టణములో స్థిర నివాసము. మహారాష్ట్రంలో దాదాపు 40 సం॥లు ఉన్ననూ మాతృభాషాభిమానముతో, భాషాభివృద్ధికి, తెలుగుపై ధ్యాస వలన, కొన్ని కవితలు, వ్యాసములు ఇదివరకే పర్యవేక్షింపబడినది. తమిళము నుండి తెలుగుకు అనువదించిన **"సాంఖ్యయోగము"** ను, **"తిరుక్కుఱళ్"**లు ఇప్పుడు పర్యవేక్షింపబడినవని సవినయముగా తెలుపుచున్నాము.

**సెల్:** 9949375120